అనుదినం... జనస్వరం


నవతెలంగాణ

www.navatelangana.com
14 పేజీలు వెల: 6.50

మంగళవారం 08-04-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి: 11 సంచిక: 97 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar



గ్యాస్ బండ రూ.50 పెంపు

వంటింట్లో సిలిండర్ మంట

- సబ్సిడీ, సబ్సిడీయేతర వినియోగదారులపై మరో భారం
- నేటి నుంచి అమల్లోకి..
- హైదరాబాద్‌లో రూ.905కు చేరనున్న ధర
- కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ వెల్లడి
- మోడీ సర్కారుపై సామాన్య ప్రజల ఆగ్రహం

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కారు సామాన్యులపై మరో భారం మోపింది. దేశంలో వంట గ్యాస్ సిలిండర్ ధరలను మళ్లీ పెంచింది. గృహావసరాలకు వినియోగించే 14.2 కేజీల ఎల్పీజీ సిలిండర్‌పై రూ.50 మేర పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. దీంతో ఈ భారం ప్రధాన ...13లో

రూ.14 లక్షల కోట్లు హాంఫట్

- ట్రంప్ టారిఫ్‌లతో ప్రపంచ మార్కెట్లు అల్లకల్లోలం
- భీతిల్లిన దలాల్ స్ట్రీట్
- భారత మార్కెట్లో సెన్సెక్స్ 2200 పాయింట్ల పైగా పతనం





ముంబయి : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల వేటు ప్రపంచ మార్కెట్లలో అల్లకల్లోలం సృష్టిస్తోంది. వరుస నష్టాలతో ఇప్పటికే కుదేలైన మార్కెట్లు.. సుంకాల ప్రకంపనలతో సోమవారం పేకమేడల్లా కుప్పకూలాయి. అమెరికా, యూరప్, ఆసియా స్టాక్ ఎక్స్ఛేంజీలు భారీ నష్టాలను చవి చూశాయి. ఈ ప్రభావంతో దలాల్ స్ట్రీట్‌లోనూ అమ్మకాల వెల్లువ చోటు చేసుకుంది. ఒక్క పూటలో ఓ దశలో దాదాపు రూ.20 లక్షల కోట్ల సంపద తుడుచుకుపెట్టుకుపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ ...13లో

సంక్షోభాన్ని అంచనా వేయలేం : వికె విజయ్ కుమార్



ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్లు తీవ్రమైన అస్థిరతను ఎదుర్కొంటున్నాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వికె విజయకుమార్ అన్నారు. ట్రంప్ టారిఫ్‌ల కారణంగా ఏర్పడిన ఈ సంక్షోభం ఎలా మారబోతోందో అంచనా వేయడం కష్టంగా మారిందన్నారు. ఈ సమయంలో వేచి చూడటమే ఉత్తమ వ్యూహమన్నారు.

ఇది ట్రైలరే : జిమ్ క్రెమెర్

స్టాక్ మార్కెట్లలో ఇప్పుడు నడుస్తోన్నది ట్రైలర్ మాత్రమేనని అమెరికా మార్కెట్ నిపుణులు, హార్వర్డ్ లా గ్రాడ్యుయేట్ జిమ్ క్రెమెర్ పేర్కొన్నారు. ఈ పరిస్థితిని నియంత్రించకపోతే అమెరికన్ మార్కెట్లలో 1987 నాటి బ్లాక్ మండే సంక్షోభ పరిస్థితులు పునరావృతం అవుతాయన్నారు. ట్రంప్ వెంటనే సహకారం చూపుతున్న దేశాలతో చర్చలు జరిపి ఈ ప్రతీకార పన్నులను ఎత్తేయాలని ఆయన సూచించారు. 1987 అక్టోబర్ 19న ఒక్క రోజే అమెరికా డౌజోన్స్ సూచీ ఏకంగా 22.6 శాతం పతనమై.. బ్లాక్ మండేగా నిలిచింది.

రూపాయికి టారిఫ్‌ల సెగ

38 పైసలు పతనం

న్యూఢిల్లీ : అమెరికా టారిఫ్ యుద్ధ అనిశ్చితులకు తోడు దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడంతో రూపాయి విలువ భారీగా పతనమయ్యింది. స్టాక్ మార్కెట్ల వరుస పతనం.. ఎఫ్ఐఐలు తరలిపోవడంతో రోజు రోజుకు ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలోనే డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 38 పైసలు క్షీణించి 85.82కు దిగజారింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో డాలర్‌తో రూపాయి విలువ 85.79 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 85.57-85.90 మధ్య కదలాడింది. ముడి చమురు బ్యారెల్ ధర 3.03 శాతం తగ్గి 63.59 వద్ద ముగిసింది. శుక్రవారం సెషన్‌లో రూ.3,483.98 కోట్ల ఎఫ్ఐఐలు తరలిపోయాయి. భారత్‌కు ట్రంప్ ప్రభుత్వం వ్యూహాత్మక భాగస్వామి అని గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ ప్రభుత్వ వర్గాలకు ట్రంప్ టారిఫ్‌ల చర్యలతో రూపాయి పతనం, మార్కెట్ల క్షీణతతోనైనా మేలుకొలుపు కావాలని నిపుణులు సూచిస్తున్నారు. రూపాయి పతనంతో దిగుమతి, దిగుమతి ఆధారిత ఉత్పత్తులు భారం కానున్నాయి. బంగారం ధర మరింత పెరగనుంది. అదే విధంగా ప్రభుత్వ విదేశీ అప్పు చెల్లింపులు భారంగా మారనున్నాయి. ఈ పరిణామాలు అంతిమంగా దేశ ఆర్థిక వ్యవస్థను మందగమనంలోకి నెట్టనున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



సివిల్ కేసులను క్రిమినల్ కేసులుగా

ఎలా మారుస్తారు !

యూపీలో ఎందుకీ పరిస్థితి

- చెక్ బౌన్స్ కేసులో చీఫ్ జస్టిస్ ఖన్నా వ్యాఖ్యలు
- రెండు వారాల్లోగా అఫిడవిట్లు ఇవ్వండి : డీజీపీకి, దర్యాప్తు అధికారికి ఆదేశాలు

న్యూఢిల్లీ : సాధారణమైన సివిల్ వివాదాలను క్రిమినల్ కేసులుగా మార్చివేయడాన్ని సుప్రీం కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఉత్తరప్రదేశ్‌లో రోజు రోజుకు ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని, ఇది చాలా అసంబద్ధమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా సోమవారం వ్యాఖ్యానించారు. "ప్రతి రోజూ ...5లో

12 శాతం మంది

మాత్రమే

- ఆస్తుల వివరాలు ప్రకటించిన హైకోర్టుల జడ్జిలు కేవలం 95 మంది
- ప్రస్తుతం దేశవ్యాప్తంగా 25 హైకోర్టులలో ఉన్న జడ్జిలు 769 మంది
- కేరళ, హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టులు భేష్



న్యూఢిల్లీ : దేశంలో తమ ఆస్తుల వివరాలను ప్రకటించిన వివిధ హైకోర్టుల న్యాయమూర్తుల సంఖ్య ...5లో

హెచ్‌సీయూ విద్యార్థులపై కేసుల ఉపసంహరణ

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశం

- సివిల్ సొసైటీ సంఘాలతో మంత్రుల సబ్‌కమిటీ భేటీ
- పలు డిమాండ్లను ప్రస్తావించిన ప్రతినిధులు
- కోర్టు ఆదేశాల మేరకు భూమిలోకి ఎవరినీ అనుమతించం
- విద్యార్థులతో చర్చలకు సర్కార్ సిద్ధం
- మంత్రుల సబ్‌కమిటీ వెల్లడి
- డిమాండ్లు పరిష్కరిస్తేనే విద్యార్థులు నేరుగా చర్చల్లో పాల్గొంటారు
- తేల్చిచెప్పిన పౌరసంఘాల ప్రతినిధులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించా లని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పోలీసులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉపాధ్యాయ, సివిల్ సొసైటీ సంఘాల ప్రతినిధులతో సబ్‌కమిటీ సభ్యులైన మంత్రులు డి.శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి ...5లో

బనకచర్లపై గరంగరం

ఏపీ సమాచారాన్ని దాస్తున్నది

- అనుమతుల్లేకుండా ఎలా చేపడతారు ?: జీఆర్ఎంబీని ప్రశ్నించిన తెలంగాణ
- డీపీఆర్ తయారు కాలేదు: ఏపీ కార్యదర్శి అజగేషన్‌పై ఫిర్యాదు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును అనుమతుల్లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిందని తెలంగాణ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ప్రాజెక్టు సమాచారంతోపాటు ఇతర అంశాలను దాస్తున్నదని నిరసన వ్యక్తం చేసింది. దీనిపై జీఆర్ఎంబీకి, కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం లేఖలు రాసిందనీ, అయినా పట్టించుకోకపోవడం సరికాదని వ్యాఖ్యానించింది. సోమవారం హైద రాబాద్‌లోని సాగునీటి శాఖ ప్రధాన కార్యాలయం జలసౌధలో గోదావరి నదీ యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) సమావేశం ...13లో





యర్రా మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని

- పార్టీ 24వ మహాసభతో పాటు కేంద్ర కమిటీ సంతాపం
- మదురై నుంచి ఖమ్మం చేరిన శ్రీకాంత్ భౌతికకాయం
- ప్రకాశ్ నగర్ నుంచి బైక్ ర్యాలీగా సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయానికి..
- నివాళులు అర్పించిన ఎంపీ వద్దిరాజు, తమ్మినేని, పోతినేని, నున్నా, మచ్చా, వివిధ రాజకీయ పార్టీల నేతలు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ (ఎం) అఖిలభారత 24వ మహాసభల ప్రతినిధిగా మధురై వెళ్లి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్ మృతికి పలువురు నేతలు, ప్రముఖులు నివాళులర్పించారు. మదురైలోని అపోలో ఆస్పత్రిలో ఆదివారం మృతిచెందిన ఆయన భౌతికకాయాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు ఖమ్మం తీసుకొచ్చారు. పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీగా ప్రకాష్‌నగర్ నుంచి ...13లో

మే 7 నుంచి ఆర్టీసీ కార్మికుల సమ్మె



సమస్యల పరిష్కారానికి మరో మార్గం లేదు : చలో లేబర్ కమిషనరేట్ ఆందోళనలో జేఏసీ నేతలు

వివరాలు 13లో..

సుప్రీం నిర్ణయం తర్వాతే విచారణ

కంచ గచ్చిబౌలి భూములపై హైకోర్టు స్పష్టీకరణ

- 24వ తేదీకి కేసు వాయిదా
- ప్రతివాదులు కౌంటర్లు దాఖలు చేయాలి

6లో..



ఉసురుతీస్తోంది

పెరుగుతున్న ఆత్మహత్యలు


దేశంలో మానసిక సమస్యలతో బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. 2020-22 మధ్య కాలంలో ఇలా ఆత్మహత్యలు చేసుకున్న వారి సంఖ్య ఏకంగా 44 శాతం పెరిగిందని జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) తెలిపింది. మానసిక ఆరోగ్యం బాగా లేక ప్రాణాలు తీసుకుంటున్న ప్రతి ఐదుగురిలో ముగ్గురు 18-45 సంవత్సరాల మధ్య వయస్కులు కావడమే గమనార్హం. కోవిడ్ మహమ్మారి విరుచుకుపడిన సమయంలో ఈ తరహా ఆత్మహత్యలు ఎక్కువగా నమోదయ్యాయి. 2019తో పోలిస్తే 2020లో మానసిక అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్న వారి సంఖ్య పాతిక శాతం పెరిగింది. 2022లో ఆ సంఖ్య ఆరు శాతం పెరిగిందని ఎన్‌సీఆర్‌బీ డేటా చెబుతోంది.

- మానసిక అనారోగ్యంతో ఏటా పెరుగుతున్న బలవన్మరణాలు
- 18-45 సంవత్సరాల వారిలోనే అధికం
- వెలుగులోకి రాని మహిళల ఆత్మహత్యలు



ఆత్మహత్య రేటూ పెరుగుతోంది

మన దేశంలో ఆత్మహత్య చేసుకుంటున్న ప్రతి ముగ్గురిలో ఇద్దరు 18-45 సంవత్సరాల మధ్య వయస్కులేనని ఎన్‌సీఆర్‌బీ నివేదిక తెలిపింది. 2018తో పోలిస్తే 2022లో దేశంలో ఆత్మహత్యలు చేసుకున్న వారి సంఖ్య 27 శాతం పెరిగింది. దీనితో పాటే ప్రతి లక్ష జనాభాకు ఆత్మహత్య రేటు కూడా పెరిగింది. 2018లో ఈ రేటు 10.2 ఉంటే 2022 నాటికి 12.4 శాతానికి పెరిగింది. 2012-2022 మధ్య కాలంలో అంటే పది సంవత్సరాలలో ఆత్మహత్య రేటు అత్యధికంగా నమోదైంది 2022 లోనే. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూటీఓ) ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఏటా 7.2 లక్షల మందికి పైగా ఆత్మహత్య చేసుకుంటున్నారు. 15-29 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో మరణాలకు మూడో అతి పెద్ద కారణం ఆత్మహత్యే. ప్రపంచంలో చోటుచేసుకుంటున్న ఆత్మహత్యలలో 73 శాతం పేద, ఓ మోస్తరు ఆదాయం కలిగిన దేశాలలో జరుగుతున్నవే.



న్యూఢిల్లీ : ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం మానసిక ఆరోగ్యం బాగా లేక ప్రాణాలు తీసుకుంటున్న వారి సంఖ్య 2018లో 10,134, 2019లో 11,009, 2020లో 13,796, 2021లో 13,792, 2022లో 14,600గా నమోదైంది. కోవిడ్ సమయంలో బంధువులను, ఉద్యోగాలను కోల్పోవడం, ఒంటరితనం వేధించడం వంటి కారణాలతో మానసికంగా ఆరోగ్యం క్షీణించి ప్రజలు ఎక్కువగా ఆత్మహత్యకు పాల్పడ్డారని మానసిక ఆరోగ్య నిపుణులు విశ్లేషించారు. 2017లో కేంద్ర ప్రభుత్వం మానసిక ఆరోగ్య రక్షణ చట్టాన్ని రూపొందించింది. ఎలాంటి వివక్షకు తావు లేకుండా నాణ్యమైన మానసిక ఆరోగ్య సేవలు ప్రజలందరికీ అందుబాటులో ఉంచడం దీని ప్రధాన లక్ష్యం. అయితే ఇది సరిగా అమలు కావడం లేదు. పైగా ఆత్మహత్య చేసుకుంటున్న వారి వివరాలు సేకరించడం, దానిని వర్గీకరించడంలో కూడా పరిమితులు కన్పిస్తున్నాయి. ముఖ్యంగా మహిళల ఆత్మహత్యలు చాలా వరకూ వెలుగులోకి రావడం లేదు.

వాస్తవాలు దాచిపెట్టి...

మానసిక ఆరోగ్యం సరిగా లేక ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో పురుషులే ఎక్కువగా ఉంటున్నారు. 2022లో 10,365 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. మానసిక అనారోగ్యంతో ప్రాణాలు తీసుకున్న ...5లో

ఎల్‌ఆర్‌'ఎస్‌' అంటారో..? లేదో..?

• గందరగోళంగా లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం • ఫీజు చెల్లింపునకు సందేహాలు • రుసుం నిర్ధారణలోనూ అయోమయం

నవతెలంగాణ-సిటీబ్యూరో

సిటీ శివారు ప్రాంతాల్లోని కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనపై అస్పష్టత నెలకొంది. నిర్ణీత రుసుం చెల్లించిన అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫైనల్ ప్రొసీడింగ్స్ జారీ చేస్తామని పురపాలక శాఖ ప్రకటించగా, శివార్లలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. రుసుం వసూలుపై దృష్టి సారించిన పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది ప్లాట్ల పరిశీలన ఇప్పుడు కుదరదని చెబుతున్నారు. దాంతో దరఖాస్తుదారులు ఆందోళనకు గురవుతున్నారు. ప్లాట్ వద్దకు ఎప్పుడు వస్తారంటూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయినా వారికి సమాధానం చెప్పే వారు కరువయ్యారు.



దరఖాస్తుల పరిశీలనపైనా స్పష్టత కరువు

రుసుం చెల్లించినా తప్పని ఎదురుచూపులు

ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన అంతంతే ఉండటంతో ప్రభుత్వం 25 శాతం రాయితీని ప్రకటించింది. ముందు రుసుం చెల్లిస్తే, క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫైనల్ ప్రొసీడింగ్స్ ఇస్తామని ప్రకటించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్‌కు 1.78 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో మెజార్టీ దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించాలనే సమాచారం వెళ్లింది. ప్రభుత్వ నిషేధిత భూముల్లోని సర్వే నెంబర్లలో, చెరువులు, కుంటల పక్కన 200 మీటర్ల దూరం వరకు ఉన్న ప్లాట్ల దరఖాస్తులను ప్రస్తుతం పక్కన పెట్టారు. సమాచారం వచ్చిన కొందరు ఇప్పటికే రుసుం చెల్లించారు. తమ ప్లాట్‌ను ఎప్పుడు పరిశీలిస్తారని స్థానిక కార్యాలయాలకు వెళ్లి ఆరా తీస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే దరఖాస్తు ఆమోదం/ తిరస్కరణ అన్నది తేలనున్న దృష్ట్యా దరఖాస్తుదారుల్లో ఆందోళన మొదలైంది. ఒకవేళ దరఖాస్తు తిరస్కరిస్తే చెల్లించిన రుసుంలో 10 శాతం మినహాయించుకుని మిగతాది తిరిగి ఇవ్వనున్నారు. దాంతో ప్లాట్ క్రమబద్ధీకరణ జరగుతుందో..? లేదో..? అన్న అనుమానంతోనూ కొందరు రుసుం చెల్లించేందుకు ఆలోచిస్తున్నారు.

రుసుం నిర్ధారణలో గందరగోళం

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల రుసుం నిర్ధారణలో గందరగోళం నెలకొంది. ఆటోమెటిక్‌గా ఫీజు నిర్ధారణ జరుగుతుందని పురపాలక శాఖ ప్రకటించగా, ఏ ప్రాతిపదికన రుసుం నిర్ణయిస్తున్నారన్న దానిపై స్పష్టత లేదు. ఫీర్జాదిగూడలో ఓ వ్యక్తి సమాన విస్తీర్ణంగల రెండు ప్లాట్లను ఒకేసారి కొనుగోలు చేశాడు. ఓ ప్లాట్ రుసుం రూ.26 వేలు రాగా, మరో ప్లాట్ ఫీజు రూ.75 వేలకుపైగా వచ్చింది. దాంతో ఆందోళనకు గురైన దరఖాస్తుదారుడు స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను సంప్రదించారు. సాంకేతిక లోపాల వల్ల ఇలా జరిగి ఉంటుందనీ, పరిశీలిస్తామని సమాధానమిచ్చారు. రుసుం నిర్ధారణలో వ్యత్యాసాలపై జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, శివారు మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు ఇలాంటి ఫిర్యాదులు కోకొల్లలుగా వస్తున్నాయి.

సిబ్బంది నుంచి ఫోన్ కాల్స్..

'మీ లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎస్‌ఆర్‌ఎస్) దరఖాస్తు రుసుం నిర్ధారణ అయ్యింది. ఆన్‌లైన్‌లో చెక్ చేసుకుని చెల్లించండి. లేదా పట్టణ ప్రణాళికా విభాగం కార్యాలయంలో చెల్లించవచ్చు' అని ఓ దరఖాస్తుదారునికి శివారు మున్సిపాల్టీ సిబ్బంది నుంచి ఫోన్ వచ్చింది. ఫీజు చెల్లిస్తే ఫైనల్ ప్రొసీడింగ్స్ ఎప్పుడిస్తారన్న పౌరుడి ప్రశ్నకు, మార్చి 31 తర్వాతే క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుందని సమాధానమిచ్చారు. కానీ ఇప్పటి వరకు పరిశీలన మొదలు కాలేదు. ఇలాంటి ఘటనలు ఎక్కువగా నిజాంపేట, దుండిగల్, బాచుపల్లి, ప్రగతినగర్ కార్పొరేషన్లలో నెలకొన్నాయి. ఇప్పటికే రుసుం చెల్లించిన వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫైనల్ ప్రొసీడింగ్స్ ఇవ్వలేదు.

బీఓబీ నుంచి కొత్త స్క్వేర్ డ్రైవ్ ఎఫ్‌డీ స్కీమ్

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) కొత్తగా 'బీఓబీ స్క్వేర్ డ్రైవ్ డిపాజిట్ స్కీమ్'ను ప్రవేశపెట్టినట్టు సోమవారం ఆ బ్యాంక్ ఓ ప్రకటనలో తెలిపింది. ఇది ఏప్రిల్ 7 నుంచి అందుబాటులోకి వచ్చిందని పేర్కొంది. ఈ పథకంలో రూ.3 కోట్ల లోపు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకోవడానికి వీలుందని వెల్లడించింది. ఇందులోని 444 రోజుల కాలపరిమితి ఎఫ్‌డీలకు గరిష్టంగా 7.75 శాతం వడ్డీ రేటు అందించనున్నట్టు తెలిపింది. సాధారణ ఖాతాదారులకు 7.15 శాతం ప్రారంభం వడ్డీ ఉంటుందని వెల్లడించింది. మరో ప్లాన్ ఉత్సవ్ స్కీమ్‌ను రద్దు చేసి.. ఈ కొత్త ఎఫ్‌డీ పథకాన్ని ఆవిష్కరించినట్టు పేర్కొంది. మార్కెట్ పరిస్థితుల ఆధారంగా ఈ స్కీమ్‌ను డిజైన్ చేసినట్టు పేర్కొంది.



పిల్లలకు ఆటల పట్ల ఆసక్తి కలిగించాలి

సికింద్రాబాద్ స్పోర్ట్స్ డైరెక్టర్ శ్రీనివాస్ గౌడ్ అంబర్‌పేటలోని స్విమ్మింగ్ పూల్‌ను సందర్శన

నవతెలంగాణ-హైదరాబాద్

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆటల పట్ల ఆసక్తి కలిగేలా చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ స్పోర్ట్స్ డైరెక్టర్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అంబర్‌పేటలోని జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్‌ను ఆయన సోమవారం సందర్శించారు. అనంతరం అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పిల్లలకు స్పోర్ట్స్ పట్ల ఆసక్తి తగ్గుతోందని అన్నారు. చిన్నప్పటి నుంచే వారు ఫోన్లకు అలవాటు పడడం వల్ల అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు పిల్లలకు ఆటలపై ఆసక్తి కలిగేలా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, రాజు, సురేష్, ప్రభాకర్ చారి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులాల్లో సోదరభావం పెంపొందించాలి

బీసీ కమిషన్‌కు కులనిర్మూలన వేదిక లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీల్లోని కొన్ని కులాలపై దాడులు, బహిష్కరణలు, హత్యలను రూపుమాపాలని కుల నిర్మూలనా వేదిక, మాదిగ జర్నలిస్టుల ఫోరం బీసీ కమిషన్‌కు కొన్ని ప్రతిపాదనలు చేసింది. ఈ మేరకు సోమవారం కుల నిర్మూలన వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాపని నాగరాజు, మిర్యాల బాలకృష్ణ, తెలంగాణ మాదిగల జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు బూర్గుల నాగేందర్, కనుకు రవి ఒక ప్రకటన విడుదల చేశారు. దళిత, గిరిజనులపై కులపరమైన దుస్సంఘటనల కు అడ్డుకట్టవేయాలని సూచించారు. బీసీ కులాల్లో సోదరభావం పెంపొందించేందుకు అల్కె బల్కె నిర్వహించాలని కోరారు. కులసంఘాలన్నింటితో ప్రతి జిల్లాల్లో ప్రభుత్వ శాఖల సమావేశాలతో సోదరత్వం కల్పించాలని సూచించారు. బీసీ, ఎస్సీలలో సోదరభావం పెంపొందించేందుకు ఆయా సంఘాలతో జిల్లాల్లో సమావేశాలు నిర్వహించాలని కోరారు.

ఉపాధి కరువై...

- ఆర్థిక సాయం అందక విలవిలలాడుతున్న ఎన్జీవోలు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

● శాపంగా మారిన ట్రంప్ నిర్ణయం

నిలిచిన యూఎస్ ఎయిడ్ ప్రాజెక్టులు, కార్యక్రమాలు

సమాజ సేవ బరువై

ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నది ఓ సామెత. అమెరికా సంస్థ యూఎస్ ఎయిడ్ వివిధ దేశాలకు అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని నిలిపివేస్తూ డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం జనవరి 20వ తేదీన జారీ చేసిన ఆదేశాలు మన దేశానికి శాపంగా మారాయి. ట్రంప్ ఆదేశాలు జారీ చేసిన వెంటనే మన దేశంలో యూఎస్ ఎయిడ్ (యునైటెడ్ స్టేట్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్) నిర్వహిస్తున్న కార్యకలాపాలన్నీ ఆగిపోయాయి. చేసేందుకు పనేమీ లేకపోవడం తో వివిధ సంస్థల్లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు వీధిన పడ్డారు. యూఎస్ ఎయిడ్ సంస్థ నుంచి ఆర్థిక సాయం పొందుతున్న పలు సంస్థలు తమ సిబ్బందిలో 70 శాతం మందికి ఉద్వాసన పలికాయని ఉపాధి కోల్పోయిన ఓ ఉద్యోగి తెలిపారు.

వీధిన పడిన ఉద్యోగులు

న్యూఢిల్లీ : యూఎస్ ఎయిడ్ సంస్థ మన దేశంలో సామాజిక, ఆరోగ్య, విద్య, పునరుత్పాదక ఇంధన రంగాలలో పలు కార్యక్రమాలు చేపట్టింది. ట్రంప్ ఆదేశాలతో అవన్నీ నిలిచిపోయాయి. యూఎస్ ఎయిడ్ నుంచి నిధులు పొందుతూ ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థలు ఉద్యోగులకు లే-ఆఫ్‌లు ప్రకటించాయి. ట్రంప్ ఆదేశాల కారణంగా ఉద్యోగం కోల్పోయిన వారిలో గుంజా కీర్తి ఒకరు. జనవరిలో ఆమె యూఎస్ ఎయిడ్ నుంచి ఆర్థిక సాయం పొందుతున్న ఓ సంస్థలో పార్ట్ టైమ్ కన్సల్టెంటుగా పనిచేసే వారు. భారత్‌లో తాము నిర్వహిస్తున్న ఓ కార్యక్రమానికి నాయకత్వ బాధ్యతలు చేపట్టాల్సిందిగా ఆ సంస్థ ఆమెకు ఆఫర్ ఇచ్చింది. అంటే పూర్తి స్థాయి ఉద్యోగమన్న మాట. దీంతో అప్పటికే మరికొన్ని సంస్థలకు కన్సల్టెంటుగా వ్యవహరిస్తున్న కీర్తి వాటన్నింటినీ వదిలేశారు. అయితే ఫుల్‌టైమ్ ఉద్యోగం దొరికిందన్న సంతోషం కీర్తికి ఎంతోకాలం నిలవలేదు. జనవరి 31న ఉద్యోగం నుంచి తొలగిస్తున్నామంటూ ఆమెకు చావు కబురు చల్లగా చెప్పారు.

ట్రంప్ ఆదేశాలతో వీధిన పడ్డది ఒక్క కీర్తి మాత్రమే కాదు. అమెరికా ప్రభుత్వానికి చెందిన దక్షిణాసియా ప్రాంతీయ ఇంధన భాగస్వామ్యం (ఎస్ఏఆర్ఈపీ) ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.



ఇది దక్షిణాసియాలో సుస్థిర ఇంధనం కోసం కృషి చేస్తోంది. న్యూఢిల్లీలోని తమ కార్యాలయంలో పనిచేయడానికి అది ఓ పీఆర్ఓను నియమించింది. భారత్‌లో స్థిరమైన ఇంధనం అందుబాటు ధరలో లభించేలా చూసేందుకు ఎస్ఏఆర్ఈపీకి ఆ సమయంలో యూఎస్ ఎయిడ్ నుంచి 1.8 మిలియన్ డాలర్ల సాయం అందింది. అయితే ట్రంప్ ఆదేశాలతో ఆ కార్యక్రమం అటకెక్కింది. పీఆర్ఓ ఉద్యోగమూ పోయింది. ఎస్ఏఆర్ఈపీ చేపట్టిన పలు ప్రాజెక్టులు కూడా ఆగిపోయాయి. ప్రస్తుత సంవత్సరానికి యూఎస్ ఎయిడ్ మన దేశానికి 31 మిలియన్ డాలర్లను మంజూరు చేసింది. అయితే ఆ నిధులను ట్రంప్ ఫ్రీజ్ చేశారు.

సాయం చేసే వారేరి?

'యూఎస్ ఎయిడ్ అందిస్తున్న నిధులను ఫ్రీజ్ చేయడం అనేక రకాలుగా ప్రభావం చూపింది. క్షేత్ర స్థాయిలో పనిచేసే వాలంటీర్లే కాకుండా నా లాంటి వైట్ కాలర్ నిపుణులు ఉపాధి కోల్పోయారు. అనేక మంది వ్యాపారులు, సర్వీస్ ప్రొవైడర్లు బిల్లుల విడుదల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. అన్నింటి కంటే ముఖ్యంగా సమాజ కార్యక్రమాలకు విఘాతం ఏర్పడింది' అని కీర్తి తెలిపారు. జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో ఆమె కన్సల్టెంటుగా పనిచేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మహిళలకు అందేలా చూడడం, గృహహింసకు గురికాకుండా వారికి రక్షణ కల్పించడం ఆమె పని. ఆ సంస్థకు చెందిన ఒక్కో కేంద్రానికి ప్రతి నెలా 300 మందికి పైగా మహిళలు వచ్చే వారు. తమకు సాయం అందించాలని కోరేవారు. 'ఇప్పుడు వారు ఎక్కడికి వెళతారు?' అని కీర్తి ఆవేదనతో ప్రశ్నించారు.

అటకెక్కిన ఐదు వేల కార్యక్రమాలు

యూఎస్ ఎయిడ్ 6,200 కార్యక్రమాలకు నిధులు అందజేస్తుండగా వాటిలో 5,200 కార్య క్రమాలను రద్దు చేశామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో గత నెలలో తెలిపారు. అంటే ప్రపంచ వ్యాప్తంగా 83 శాతం కార్యక్రమాలు నిలిచిపోయాయన్న మాట. మన దేశానికి సంబంధించినంత వరకూ అనేక కమ్యూనిటీ స్థాయి కార్యక్రమాలు ఆగి పోయాయి. మరీ ముఖ్యంగా వేలాది మంది ప్రత్యక్షంగానో లేదా పరోక్షంగానో ఉపాధి కోల్పోయారు. దీంతో అనేక మంది సీనియర్ స్థాయి ఎగ్జిక్యూటివ్‌లు ఉద్యోగాల వేటలో పడ్డారు. గడచిన దశాబ్ద కాలంలో యూఎస్ ఎయిడ్ మన దేశానికి 1.2బిలియన్ డాలర్ల నిధులు అందించింది. ప్రస్తుత సంవత్సరానికి 31 మిలియన్ డాలర్లు మంజూరు చేసింది. 2022-24 మధ్య 554 మిలియన్ డాలర్ల సాయం చేసింది.

సాంకేతిక సలహాలకూ విఘాతమే

యూఎస్ ఎయిడ్ సంస్థ కేవలం ఆర్థిక సాయంతోనే సరిపుచ్చుకోలేదు. 14 రాష్ట్రాలలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల ఏర్పాటుకు సాంకేతిక సాయాన్ని అందిస్తోంది. ఆంధ్రప్రదేశ్, అస్సాం, హర్యానా, ఒడిశా, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లో చెట్ల పెంపకానికి సాయం చేస్తోంది. దేశంలోని టిబెటన్ సెటిల్మెంట్లలో పరిస్థితులను మెరుగుపరిచేందుకు 1.3 మిలియన్ డాలర్లు ఇచ్చింది. కాగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలగాలన్న అమెరికా నిర్ణయం కూడా భారత్‌పై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా దేశంలో నిర్వహిస్తున్న టీబీ నిర్మూలన కార్యక్రమాలు కుంటు పడుతున్నాయి.


ఆరోగ్య రంగానికి దెబ్బ

యూఎస్ ఎయిడ్ నుంచి పరోక్షంగా ఆర్థికసాయం పొందుతున్న అనేక చిన్న చిన్న స్వచ్ఛంద సంస్థలు మూతపడ్డాయి. క్షేత్రస్థాయిలో పని చేసే ఉద్యోగులకు భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. కొన్ని సంస్థలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాయి. గేట్స్ ఫౌండేషన్, ప్రపంచబ్యాంక్ వైపు ఆశగా చూస్తున్న సంస్థలకు నిరాశ తప్పేలా లేదు. మన దేశంలో యూఎస్ ఎయిడ్ నుంచి ఎక్కువ మొత్తంలో నిధులు పొందుతున్నది ఆరోగ్య రంగమే. ప్రస్తుత సంవత్సరంలో ఈ రంగానికి 16 మిలియన్ డాలర్ల నిధులు మంజూరయ్యాయి. 2023లో 120 మిలియన్ డాలర్లు, 2024లో 79 మిలియన్ డాలర్లు విడుదలయ్యాయి. ఆరోగ్య రంగంతో పాటు విద్య, పరిపాలన, మౌలిక సదుపాయాలు, ఆర్థిక వృద్ధి వంటి వాటికి కూడా ఈ ఏడాది నిధులు మంజూరయ్యాయి. ఈ ఏడాది అత్యధిక నిధులు మంజూరైన కార్యక్రమం నిష్ఠా. ఇది ప్రాథమిక స్థాయి ఆరోగ్య సంరక్షణ ప్రాజెక్ట్. టీబీ, హెచ్ఐవీ, గర్భిణులు-శిశువుల ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ వంటి వాటిపై దేశంలోని 582 జిల్లాలలో నిష్ఠా కార్యక్రమం నడుస్తోంది.

ఆ దేశాలలో కూడా...

నిధులను ఫ్రీజ్ చేయడంతో బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాలలో పెద్ద ఎత్తున ఉద్యోగుల లే-ఆఫ్‌లు కొనసాగుతున్నాయి. అక్కడ కార్యకలాపాలు నిర్వహించే ధార్మిక సంస్థలు విదేశీ సాయంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం పెట్టిన రెండు గంటల వ్యవధిలోనే బంగ్లాదేశ్‌లో బంధు సోషల్ వెల్ఫేర్ సొసైటీ అనే సంస్థ 100 మందికి పైగా ఉద్యోగులను ఇంటికి పంపింది. బంగ్లాదేశ్‌లోనే గర్భిణులు, శిశువుల ఆరోగ్యం కోసం పనిచేస్తున్న పాప్యులేషన్ సర్వీసెస్ అండ్ ట్రైనింగ్ సెంటర్ వివిధ ప్రాజెక్టులలో పనిచేస్తున్న 500 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. నిధుల విడుదల ఆపేయడంతో భారత్‌లోని శరణార్థి పునరావాస కార్యక్రమం నిలిచిపోయింది. విపత్తులు, హింస కారణంగా నిరాశ్రయులైన వారికి ఈ కార్యక్రమం కింద పునరావాసం కల్పిస్తున్నారు. దీనికి యూఎస్ ఎయిడ్ నిర్దిష్ట మొత్తంలో నిధులు అందజేస్తోంది. ఢిల్లీ కార్యాలయంలో పనిచేసే సుమారు 20 మంది ఉద్యోగులకు మొండిచేయి చూపించారు. మన దేశంలో లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యంపై పనిచేస్తున్న అనేక సంస్థలు నిధులు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి.

గ్లోబలైజేషన్‌కు 'గోరీ' నట!



దెబ్బకు దయ్యం వదిలింది అంటే ఇదేనేమో? ట్రంప్ టారిఫ్ దెబ్బకు ప్రపంచీకరణ శకం ముగిసిందనే చర్చ మొదలైంది. బ్రిటన్ దేశ ప్రధాని స్టార్మర్ వ్యాఖ్యతో ఈ చర్చ ప్రపంచం ముందుకు వచ్చింది. మన్మోహన్‌సింగ్ నుంచి మోడీ వరకు ఓ పిడికెడు దేశాలు తప్పా అన్ని దేశాల్లో ప్రపంచీకరణ బ్రహ్మాండమని పొగిడి పట్టుమని పాతికేండ్లు కాలేదు. అర్థాంతరంగా ఈ సినిమాకు తెరలు దించేస్తున్నారు.

ప్రపంచీకరణను మనం దయ్యం అనడం న్యాయమేనా? అనే ప్రశ్న వస్తుంది. కచ్చితంగా అది దయ్యమే. సోవియట్ రష్యాను కూల్చిన తర్వాత ప్రపంచాన్ని ఏక ధృవం చేసి ఆరగించాలని బహుళజాతి కార్పొరేట్లకు దురాశ కలిగింది. ఆ దురాశకు పెట్టుకున్న పేరే ప్రపంచీకరణ. పాజిటివ్‌గా చెప్పుకోవడానికి పనికొచ్చేపేరు.

అనేక దేశాలు దీన్ని అమలు పరిచేటట్టుగా ప్రపంచబ్యాంకు, డబ్ల్యూటీవో, ఐఎంఎఫ్‌లు బలవంతం చేశాయి. ఈ దయ్యాన్ని కావలించుకోవటానికి కావలసిన ప్రచారం సాగించాయి.



ప్రపంచీకరణలో భూగోళం ఒక కుగ్రామం అయిందన్నాయి. పెట్టుబడి ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఎటువంటి అడ్డు లేకుండా ప్రయాణించవచ్చు అన్నాయి. పెట్టు బడి ప్రపంచ మంతా విస్తరించడంతో అన్ని దేశాలు సమాన స్థాయిలో అభివృద్ధి చెందుతాయి అన్నాయి. కనుక పెట్టుబడి రావటం ఆ దేశాలుకు లాభం గనుక అన్ని అడ్డంకులు తొలగించి దానికి ఎర్ర తివాచీ పరిచి ఆహ్వానించాలన్నాయి. పెట్టుబడికి పోటీ కార్మికవర్గం గనక అంతవరకు కొద్దిపాటి ఉపయోగకరంగా ఉన్న కార్మిక చట్టాలకు, కార్మిక ప్రజాస్వామ్య హక్కులకు మంగళ గీతం పాడాలన్నాయి. ప్రపంచీకరణలో ప్రజలకు అన్నీ లాభాలే అన్నాయి. సరుకుల ధరలు తగ్గుతాయి. చిన్న చిన్న దేశాల్లోకి కూడా పెద్ద పెద్ద కార్పొరేట్లు వచ్చి ఫ్యాక్టరీలు పెట్టడంతో నిరుద్యోగం తగ్గిపోతుంది. ట్రికిల్ డౌన్ సిద్ధాంతం చెప్పినట్టు, అభివృద్ధి చిన్న బిందువులుగా సమాజంలో అట్టడుగున ఉన్నవారికి కూడా చేరటం ఖాయం అవుతుంది. ఆదాయం ఫుల్లు, నిరుద్యోగం నిల్లు అంటూ మబ్బుల్లో నీళ్లను చూపించాయి. చివరికి ఈ ప్రపంచీకరణ సాధించిందేమిటి?

సరుకుల ధరలు తగ్గలేదు. నిరుద్యోగం మాయం కాలేదు, సరికదా మహమ్మారి లాగా తయారయింది. బతుకుతెరువుకు వలసలు పెరిగాయి. ప్రభుత్వం అనేది పెట్టుబడికి సదుపాయాలు కలిగించేదే కానీ, వ్యాపారం చేసేది కాదని చెప్పి ప్రభుత్వ రంగానికి తాళం పెట్టారు. విద్యా, వైద్యంతో సహా అన్నీ ప్రయివేటు పరం చేశారు. చదువులకు, వైద్యానికి అయ్యే ఖర్చు చూసి సామాన్యుడు బెంబేలెత్తుతున్నాడు. ఇంకా ఏమి సాధించాలని మనకీ ప్రపంచీకరణ?

వ్యక్తులు, కుటుంబాలు, ప్రభుత్వాలు అప్పుల విషవలయంలో చిక్కుకుపోయాయి. సంపద మాత్రం కొద్దిమంది ప్రపంచ కుబేరుల బొక్కసంలోకి చేరింది. సముద్రంలోని అలలు మాదిరిగా ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం లాంటి ఏదో ఒక ఆర్థిక ఉపద్రవం ఈ ప్రపంచీకరణ కాలంలో ఒకదాని తర్వాత ఒకటి చుట్టుముట్టాయి.

ఇప్పుడు ట్రంపు రెసిప్రోకల్ టారిఫ్ విధానాన్ని అనుసరించడంతో డబ్ల్యూటీఓ, ఐఎంఎఫ్‌లు అటకెక్కినట్టే. ఇది దాదాపు అన్ని దేశాలకు అర్థమైంది. ఇది కూడా ఒకందుకు మంచిదే అని అనుకుంటున్నాయి. దేశ అవసరాలకు తగ్గట్టు ఎటువంటి ఆంక్షలు లేకుండా పరస్పర ఒప్పందంతో టారిఫ్‌లు విధించవచ్చు. స్వదేశీ పరిశ్రమల రక్షణకు టారిఫ్ పద్ధతి వాడుకోవచ్చు. ఇప్పుడు ప్రపంచీకరణ బూచిని ప్రభుత్వాలు చూపించలేవు. గతంలో లాగా ప్రజల కనీస అవసరాలను తీర్చడానికైనా, ఉద్యోగాల కల్పనకైనా ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు పెట్టమని ప్రజలు ఒత్తిడి చేయడానికి అవకాశం వస్తుంది.

ప్రపంచీకరణలో భాగంగా నిజమైన ఉత్పత్తిదారులైన కార్మికులకు జరిగిన లాభం ఏమీ లేకపోగా నష్టం చాలా జరిగింది. ప్రపంచీకరణలో పోటీతత్వం అంటూ కార్మిక సంఘాలను పెట్టనివ్వలేదు. నాసిరకం జీతాలు ఇచ్చి లాభాలు పోగేసుకోవటానికి వీలైన కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానాలను అనుసరించారు. ప్రపంచీకరణకు ఉప ఉత్పత్తులు (బైప్రొడక్ట్స్) ఇవి. బ్రిటన్ ప్రధాని బహిరంగంగా చెప్పినట్టు నిజంగా గ్లోబలైజేషన్ శకం ముగిస్తే, కార్మిక వర్గానికి ఒక అవకాశం వచ్చినట్టే. అవకాశాన్ని వినియోగించుకోవడం కార్మిక వర్గానికి ఉన్న సత్తాపై ఆధారపడి ఉంటుంది.

- కర్లపాలెం

టారిఫ్‌లతో అమెరికా ఆర్థిక బెదిరింపులు

చైనా విమర్శ

బీజింగ్ : అమెరికా ఏకపక్షవాదాన్ని, రక్షణవాదాన్ని అవలంబిస్తూ టారిఫ్‌లతో ఆర్థిక బెదిరింపులకు పాల్పడుతోందని చైనా సోమవారం విమర్శించింది. "అంతర్జాతీయ నియమాల కంటే కూడా అమెరికాను మొదటి స్థానంలో వుంచడమనేదే ఈ ఏకపక్షవాదం, రక్షణవాదం, ఆర్థిక బెదిరింపుల యొక్క విలక్షణ లక్ష్యంగా వుంది." అని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ విలేకర్లతో వ్యాఖ్యానించారు. ఈ కొత్త టారిఫ్‌ల వల్ల అంతర్జాతీయ ఉత్పత్తి, సరఫరా చెయిన్ సుస్థిరత దెబ్బతింటుందని అన్నారు. పైగా కోలుకుంటున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా తీవ్రంగా ప్రభావితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత వారంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా సహా పలు దేశాలపై పెద్ద మొత్తంలో టారిఫ్‌లు విధించారు. దీనిపై చైనా సహా ఇతర దేశాలు కూడా తక్షణమే స్పందించాయి. దీటైన చర్యలు తీసుకున్నాయి. టారిఫ్‌ల విషయమై ట్రంప్‌తో చైనా నేత జిన్‌పింగ్ భేటీ అవుతారా అని ప్రశ్నించగా, దానిపై సంబంధిత విభాగాలను ప్రశ్నించాలని లిన్ బదులిచ్చారు. "చైనాను ఎదుర్కొనాలంటే ఒత్తిళ్ళు, బెదిరింపులు మార్గం కాదు, చైనా తన చట్టబద్ధమైన హక్కులను, ప్రయోజ నాలను కచ్చితంగా కాపాడుకుంటుంది." అని లిన్ చెప్పారు. ఈ టారిఫ్‌ల సమస్యను పరిష్కరించేందుకు నిర్దిష్ట చర్యలు తీసుకోవాల్సిందిగా టెస్లా సహా అమెరికన్ కంపెనీల ప్రతినిధులను చైనా కోరింది. హాంకాంగ్, షాంఘైల్లో మార్కెట్లు క్షీణించినా చైనా విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. అమెరికా సుంకాలు



ప్రభావం చూపినప్పటికీ 'ఆకాశం ఏమీ కుప్పకూలిపోదు' అని పీపుల్స్ డైలీ వ్యాఖ్యానించింది. "విచక్షణారహితంగా అమెరికా విధించిన సుంకాలనెదుర్కొంటున్నా మేం ఏం చేస్తున్నామో మాకు తెలుసు, మాకుండే సాధనాలు మాకున్నాయి." అని వ్యాఖ్యానించింది. టారిఫ్ సమస్యకు మూలం అమెరికాలోనే వుందని, అమెరికన్ కంపెనీలు ఆ సమస్యను మూలంలోనే పరిష్కరించ గలవని ఆశిస్తు న్నట్లు చైనా వాణిజ్య శాఖ సహాయ మంత్రి లింగ్ జీ వ్యాఖ్యానించారు. నిర్దష్టమైన చర్యలు తీసుకుంటూ అంతర్జాతీయ సరఫరా గొలుసు స్థిరత్వం దెబ్బతినకుండా కలిసి కట్టుగా కృషి చేయాల్సి వుందని వ్యాఖ్యానించారు.

యెమెన్‌పై అమెరికా దాడి.. నలుగురు మృతి



యెమెన్ : యెమెన్‌పై అమెరికా వైమానిక దాడికి పాల్పడింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ దాడి వల్ల యెమెన్ రాజధాని సనాలో కనీసం నలుగురైనా మృతి చెంది ఉంటారని ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది.

ఈ క్రమంలోనే అమెరికా యుద్ధ విమానాలు సనాలో ఓ నివాస భవనంపై దాడికి పాల్పడడంతో ఆ ఇంట్లో నలుగురు మహిళలు, చిన్నారులతో సహా 20 మందికి పైగా గాయాలపాలయ్యారు. అలాగే రాజధాని సనాకి పశ్చిమాన ఉన్న బనిమటర్ జిల్లాలో అల్ జబల్ అల్ అస్వాద్ ప్రాంతంపై పలుమార్లు దాడికి పాల్పడ్డాయి. అయితే ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు తెలియలేదని అక్కడి మీడియా వర్గాలు పేర్కొన్నాయి.

'ఉపాధి'లో తగ్గిన పనిదినాలు

బడ్జెటరీ కేటాయింపులు తగ్గుతున్నాయన్న నిపుణులు

న్యూఢిల్లీ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పనిదినాల సంఖ్య తగ్గిపోతోంది. 2023-24తో పోలిస్తే అవి గత సంవత్సరంలో బాగా తగ్గాయి. 2024-25 మార్చి 31 నాటికి కార్మికుల పనిదినాల (అందరూ పని చేసిన రోజులు కలిపి) సంఖ్య 288 కోట్లుగా నమోదైంది. సమాచారాన్ని నవీకరించి ఈ నెలాఖరుకు దానిని తాజా పరుస్తారు. అయినప్పటికీ 2023-24లో నమోదైన 312 కోట్ల పనిదినాలతో పోలిస్తే అది తక్కువగానే ఉంటుంది. 2019-20లో నమోదైన 265 కోట్ల పనిదినాలతో పోలిస్తే గత రెండు సంవత్సరాలలో పనిదినాలు ఎక్కువగానే ఉన్నాయి.

2020-21లో కోవిడ్ కారణంగా ఆర్థిక కార్యకలాపాలు నిలిచిపోయాయి. లాక్‌డౌన్ విధింపుతో వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న కార్మికులు స్వస్థలాల బాట పట్టారు. వారందరికీ కష్టకాలంలో ఉపాధి చట్టం జీవనభృతి కల్పించింది. ఆ సంవత్సరం పనిదినాల సంఖ్య 389 కోట్లకు పెరిగింది. వలస కార్మికులు స్వ రాష్ట్రాలకు చేరుకోవడం కూడా దీనికి కారణమైంది.

అయితే అప్పటి నుంచి ఉపాధి చట్టం కింద పనికి డిమాండ్ తగ్గిపోయింది. అది ఇప్పటికీ కోవిడ్ ముందున్న స్థాయికి చేరుకోలేదు. గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న ఆందోళనకరమైన పరిస్థితులే దీనికి కారణమని ప్రభుత్వం చెబుతోంది. అయితే బడ్జెట్ కేటాయింపులు తగ్గిపోతుండడంతో పని డిమాండ్‌ను నియంత్రించాల్సి వస్తోందని నిపుణులు వాదిస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా కేంద్రం ఉపాధి చట్టానికి బడ్జెట్‌లో రూ.86,000- 89,000 కేటాయింపు మాత్రమే చేసింది. పనికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో బడ్జెటరీ కేటాయింపులు కూడా పెంచాల్సి ఉండగా ప్రభుత్వం ఆ పని చేయడం లేదు. కేంద్రం నుంచి చాలినన్ని నిధులు రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పని డిమాండ్‌ను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాయి. 2024-25 కేటాయింపులతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయింపులు ఏకంగా రూ.29,000 కోట్లు తగ్గిపోయాయి.

కునాల్ కమ్రా బెయిల్ పొడిగింపు

చెన్నై : మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండేపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే కేసులో స్టాండ్‌అప్ కమెడియన్ కునాల్ క్రమాకు మద్రాస్ హైకోర్టు సోమవారం మధ్యంతర ముందస్తు బెయిల్‌ను ఈ నెల 17 వరకూ పొడిగించింది. జస్టిస్ సుందర్ మోహన్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. గత నెల మార్చి 28న మంజూరు చేసిన బెయిల్ పొడిగిస్తూ మహారాష్ట్రలోని ఖర్ పోలీస్ స్టేషన్‌కు ప్రయివేటు నోటీస్ జారీ చేసినట్టు కునాల్ క్రమా తరపు న్యాయవాది వి సురేష్ మీడియాకు తెలిపారు. అలాగే, తదుపరి విచారణను ఈ నెల 17కు లిస్ట్ చేయాలని హైకోర్టు రిజిస్ట్రీని జడ్జి ఆదేశించారు. కాగా, సోమవారం విచారణలో క్రమా న్యాయవాది వాదనలు వినిపిస్తూ ప్రస్తుత కేసులో బెయిల్ వచ్చిన తరువాత ఖర్ పోలీసులు క్రమాపై మరో మూడు కేసులు నమోదు చేశారని, ముంబయిలో నివస్తున్న అతని వృద్ధ తల్లిదండ్రులను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23న కునాల్ క్రమా యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోలో శిండే గురించి అనుచిత వ్యాఖ్యలు చేశారని, దీంతో షిండేకు పరువునష్టం జరిగిందని ఆరోపిస్తూ ఖార్ పోలీస్‌స్టేషన్‌లో స్థానిక శివసేన ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఖార్ పోలీసులు మార్చి 23న విచారణకు హాజరుకావాలని క్రమాకు సమన్లు జారీ చేశారు. దీంతో మద్రాస్ హైకోర్టును క్రమా ఆశ్రయించారు. క్రమా ముంబయిలో జన్మించినప్పటికీ, ప్రశాంత జీవితం గడపాలనే కోరికతో 2021 నుంచి తమిళనాడులోని విల్లుపురం జిల్లాలో ఒక గ్రామంలో నివసిస్తున్నారు. అయితే ప్రదర్శనల కోసం వివిధ ప్రాంతాలకు విస్తృతంగా ప్రయాణిస్తుంటారు.

ట్రైకార్ రుణాలు తక్షణమే విడుదల చేయాలి

గిరిజన సంక్షేమ కార్యాలయాన్ని ముట్టడించిన జేఏసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ట్రైకార్ రుణాలను తక్షణమే విడుదల చేయాలని గిరిజన సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ కార్యాలయాన్ని ఆ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ముట్టడించారు. ఈ కార్యక్రమాన్ని విఫలం చేసేందుకు ఆదివారం అర్ధరాత్రి నుంచి పోలీసులు ఆయా జిల్లాల్లో ట్రైకార్ రుణాల లబ్దిదారులను, గిరిజ సంఘాల నేతలు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్ ప్రాంతంలో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. బారికేడ్లు వేశారు. అయినప్పటికీ గిరిజనులు నిర్బంధాన్ని ఛేదించుకుని కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాం నాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అజ్మీర రామ్మూర్తి, రమావత్ అంజయ్య నాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎం. రాంబాల్ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు దాస్‌రాం నాయక్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి రఘు ఎరుకల, గిరిజన జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వినోద్ నాయక్ తదితరులు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రూ.219 కోట్ల ట్రైకార్ రుణాలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంజూరైన చెక్కులను లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రారంభించడం వల్ల ట్రైకార్ సంస్థ నిర్వీర్యమవుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ట్రైకార్ సంస్థ ద్వారా 2019-2021 సంవత్సరాల్లో గిరిజన యువతీ, యువకుల నుంచి వేలాది దరఖాస్తులను స్వీకరించిందనీ, అందులోనుండి 30 వేల మందికి రుణాలను మంజూరు చేస్తూ లబ్దిదారులుగా గుర్తించిందని తెలిపారు. లబ్దిదారులు రుణాల అర్హత సాధించేందుకు బ్యాంకుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగారనీ, రుణాలకు అర్హత సాధించారన్నారు. ఒక్కో లబ్దిదారునికి రూ. 50 వేల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు ట్రైకార్ సంస్థ లిస్టును ఫైనల్ చేసిందని చెప్పారు. బ్యాంకు ఖాతాల్లో జమ చేయడానికి చెక్కులను రెడీ చేసి క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖకు పంపించిందని గుర్తు చేశారు. రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాల కొరకు కొత్తగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి వెళితే ఇప్పటికే రుణాలు తీసుకున్నట్టు చూపిస్తున్నదనీ, దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నా యని చెప్పారు. దీంతో వేలాది మంది గిరిజన యువత రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాలు పొందకుండా అనర్హులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పథకంలో విలీనం చేయడం గిరిజన యువతి యువకులకు తీవ్ర నష్టం జరుగుతుందని విమర్శించారు. ట్రై కార్ సంస్థలో యూనిట్ కాస్ట్ రూ.50 వేల నుంచి 10 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉండగా రాజీవ్ యువ వికాసంలో రూ.4 లక్షల వరకే రుణ సౌకర్యాలు కల్పించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం నాయకులు ఎం బాలునాయక్, రామ్ కుమార్, బాల్యా నాయక్, అజ్మీర్ కృష్ణ, శ్రీను. తెలంగాణ గిరిజన సమాఖ్య నాయకులు స్వరూప నాయక్, మాలోత్ శంకర్, జర్పలా శివ, బోడా వీరన్న, రవి నాయక్, మమత, లక్ష్మీ, కమల. లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులు మూడవత్ మోహన్ నాయక్, పాతావత్ సంతోష్ నాయక్, పాతావత్ బాబు రాజ్ నాయక్, రామ్ చరణ్ నాయక్. తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం నాయకులు కండల వెంకటేష్, క్రరు మల్లేష్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సంపాదకీయం

గ్రోక్ చెప్పిన 'పంచాంగం'

"అప్పు పుట్టింది బిడ్డా.. అంటే కొంప మునిగింది కొడుకా.." అన్నట్టుగా ఉంది దేశ ఆర్థిక పరిస్థితి. మొన్న ఉగాది పండగ నాడు కేంద్ర ప్రభుత్వానికి రాశిఫలితాలు ఎవరు చెప్పినట్టు లేరు. కానీ, కాస్త ఆలస్యంగానైనా ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' కేంద్ర ప్రభుత్వ ఆదాయ వ్యయాలను బయట పెట్టింది. ప్రభుత్వ పాలన అప్పుల మీదే నడుస్తున్నదని...ఆదాయం కంటే అప్పులే ఎక్కువగా ఉన్నాయని పంచాంగ కర్త ఏఐ 'గ్రోక్' స్పష్టం చేసింది.

మనం ఓసారి కనురెప్ప మూసి తెరిచేలోపు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అప్పు అక్షరాలా రూ.3.8 లక్షలు. చాయ్ తాగినంత సేపట్లో 'చాయ్ వాలా' సర్కార్ ఏకంగా రూ.2.28 కోట్ల అప్పు చేస్తున్నది. క్షణక్షణానికీ అప్పుల

'మీ రాష్ట్రం ఎంత అప్పు చేసింది? కార్పొరేషన్లు ఎంత మేరకు రుణాలు తెచ్చాయి? అప్పులపై కడుతున్న వడ్డీ ఎంత? ఏటా ఎంత చెల్లిస్తున్నారు? పీడీ ఖాతాలు ఎన్ని? వాటి లావాదేవీల వివరాలు ఏమిటి? ఖజానా నుంచి కార్పొరేషన్ల ఎస్క్రో ఖాతాలకు మళ్లించిన నిధుల వివరాలేవి? కార్పొరేషన్లకు బడ్జెట్లో గ్రాంట్ ఇన్‌ఎయిడ్ పేరుతో ఇస్తున్న నిధులెన్ని? కేంద్ర పథకాల నిధులను, స్థానిక సంస్థల గ్రాంట్లను పీడీ ఖాతాలకు మళ్లించడం నిజమా? ఎన్నివేల కోట్లను మళ్లించారు?.. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం అడిగిన ప్రశ్నలు!" ఇప్పుడు అవే ప్రశ్నలు కేంద్రాన్ని అడగాల్సిన పరిస్థితి.

ఊబిలోకి దించేస్తూ 'అప్పులభారతం'గా దేశాన్ని మార్చేస్తున్నది. 2014 మార్చి 31 నాటికి దేశ అప్పులు రూ.55.87 లక్షల కోట్లు ఉంటే నేడు అది కాస్త రూ.185 లక్షల కోట్లకు చేరింది. 65 ఏండ్లలో దేశం చేసిన అప్పులతో పోల్చితే కేవలం పదేండ్లలోనే ట్రిపుల్ అప్పులు చేసిన ప్రధానిగా మోడీ ఘనత వహించారు. ఒక్కొక్కరి నెత్తిన రూ.1.27 లక్షల అప్పును పెట్టిందీ మోడీ సర్కార్. ఆదాయాన్ని రెట్టింపు చేయడంలో 'డబులింజన్ సర్కార్' దారుణంగా చతికిలబడినట్టు స్పష్టం చేసింది ఏఐ. దేశ అప్పులను మూడింతలు, తలసరి అప్పును రెండున్నర రెట్లు పెంచిందీ 'ట్రిపుల్ ఫెయిల్యూర్ సర్కార్'. ఇదే విషయాన్ని కుండబద్దలు కొట్టింది ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్'.



ప్రజలకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వాలు..పౌరులకు ఆదర్శంగా నిలబడాల్సిన ప్రభుత్వాలే ఎడాపెడా అప్పులు చేసుకుంటూ పోతున్నాయని కాగ్ ఆక్షేపించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి చేస్తున్న అప్పులు కొండలా పెరిగిపోయాయి. అర్జెంటుగా అప్పులు తగ్గిం చాలని కాగే వాయించాల్సి వచ్చిందంటే.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎఫ్ఆర్‌బీఎం చట్టం ప్రకారం కేంద్రప్రభుత్వం దేశ జీడీపీలో 40శాతం వరకు అప్పులు చేసుకునే వెసులుబాటు ఉన్నది. అదే రాష్ట్రాలు అయితే 20 శాతానికి లోబడి మాత్రమే అప్పులు చేయాల్సి ఉంటుంది. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం ఎడాపెడా అప్పులు చేస్తూనే రాష్ట్రాలను మాత్రం అప్పులు చేయవద్దని సుద్దులు చెబుతుంటే...ఆ 'శ్రీరంగ నీతులు..' ఏ రాష్ట్రం పట్టించుకుంటుంది? ఉచితాలు, సబ్సిడీలు, ఇతర రాయితీలు, నగదు బదిలీ పథకాలు రద్దు చేసుకోవాలని ఒత్తిడి చేయడం వారి రెండు నాలుకల ధోరణికి నిదర్శనం.

'మీ రాష్ట్రం ఎంత అప్పు చేసింది? కార్పొరేషన్లు ఎంత మేరకు రుణాలు తెచ్చాయి? అప్పులపై కడుతున్న వడ్డీ ఎంత? ఏటా ఎంత చెల్లిస్తున్నారు? పీడీ ఖాతాలు ఎన్ని? వాటి లావాదేవీల వివరాలు ఏమిటి? ఖజానా నుంచి కార్పొరేషన్ల ఎస్క్రో ఖాతాలకు మళ్లించిన నిధుల వివరాలేవి? కార్పొరేషన్లకు బడ్జెట్లో గ్రాంట్ ఇన్‌ఎయిడ్ పేరుతో ఇస్తున్న నిధులెన్ని? కేంద్ర పథకాల నిధులను, స్థానిక సంస్థల గ్రాంట్లను పీడీ ఖాతాలకు మళ్లించడం నిజమా? ఎన్నివేల కోట్లను మళ్లించారు?.. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం అడిగిన ప్రశ్నలు!" ఇప్పుడు అవే ప్రశ్నలు కేంద్రాన్ని అడగాల్సిన పరిస్థితి. కేంద్రం చేసిన అప్పుల నిధులను ఉత్పత్తి రంగాలు, అభివృద్ధి పథకాలకు ఖర్చు చేసినట్లయితే దేశంలో ఎకనమిక్ యాక్టివిటీ జరిగి ఉండేది. రాష్ట్రాలు సైతం ఆర్థికంగా నిలదొక్కుకునేవి. కానీ అలా చేయకుండా అనుత్పాదక రంగాలపైన లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేయడం మూలంగా అభివృద్ధి లేకుండా, ఎకనమిక్ యాక్టివిటీ లేక, సంక్షేమ రంగాలు, సేవా రంగాలపైన కూడా ఖర్చు చేయకపోవడంతో ప్రజల కొనుగోలుశక్తి పూర్తిగా పడిపోయింది. ఈ దివాలకోరుతనానికి కారకులెవరు?

పోనీ ఇన్ని లక్షలకోట్లు అప్పులు చేసినా ప్రజలకు ఒరిగిందేమీ లేదు. కనీసం వారు చెప్పిన ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలైనా ఇచ్చిందా అంటే అదీ లేదు. దేశంలో పెరిగిందల్లా అసమానతలే. సామాన్యుడు, ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు బతకడానికి అప్పులు చేసే పరిస్థితి వచ్చింది. ఇదీ టూకీగా మన దేశం పరిస్థితి. ఇంకా మన ప్రధాని మోడీ మన దేశం విశ్వగురు కాబోతోందని, ప్రపంచంలో అయిదో స్థానం నుంచి మూడో స్థానానికి మన ఎకానమీ ఎగబాకనుందని పేర్కొంటారు! మీ చెప్పులో కాళ్ల పెట్టే రాష్ట్రాలు సైతం బిలియన్ డాలర్ ఎకానమీ అని, ట్రిలియన్ డాలర్ ఎకానమీ అని ఈ 'కల్లబొల్లి' మాటలు ఇంకా ఎంత కాలం చెబుతారు? ఇంకా నల్లధనం వెలికి తీసి జనం ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని చెప్పిన ముచ్చటనే ఆయన ప్రతీ మాటలో గుర్తుకు వస్తుంటుంది! వట్టి మాటలు నమ్మే పరిస్థితుల్లో ఇప్పుడు దేశ ప్రజలు లేరు మోడీజీ! ఏమి చెప్పినా నిజమా, అబద్ధమా అని క్రాస్ చెక్ చేసుకుంటున్నారు!

'ఎంపురాన్'పై విద్వేష ప్రచారం

మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం "ఎంపురాన్"పై సంఘ్ పరివార్ తీవ్ర విద్వేష ప్రచారాన్ని కొనసాగిస్తోంది. గుజరాత్‌లో జరిగిన హత్యాకాండను చిత్రీకరించిన విషయమూ, హిందూత్వ శక్తులు దేశాన్ని ఎలా పట్టుకుని పాలిస్తున్నాయో చూపించిన అంశమూ వారిని తీవ్రంగా కుదిపేశాయి. ఈ తీవ్రమైన దుష్ప్రచార వాతావరణంలో, చిత్రాన్ని మళ్లీ సెన్సార్ చేయాల్సిన పరిస్థితి నిర్మాతలకు కల్పించింది. ఇది కేరళలో, మొత్తం మలయాళ సినీ చరిత్రలోనే, బయటి ఒత్తిళ్ల వల్ల సినిమా మళ్లీ సెన్సార్ చేసిన మొదటి సందర్భం. ఇది మన ప్రజాస్వామ్య దేశంలో చోటుచేసుకుంటున్న ప్రమాదకరమైన మార్పును సూచిస్తుంది.పురోగమన ఆలోచనలు కలిగినవారిపై, భిన్న స్వరాలపై, సంఘ్ పరివార్ చూపుతున్న అసహనమే "ఎంపురాన్"పై వచ్చిన ఆరోపణల్లో ప్రతిఫలిస్తోంది. తమపై విమర్శలు చేసే రచనలు, కళలు, రాజకీయ ప్రకటనలు బెదిరింపులు చేయడంలో హిందూత్వ శక్తులు ఎన్నో పద్ధతులు అవలంబిస్తున్నాయి. రచయితల్ని, కళాకారుల్ని, ప్రజా



ప్రతినిధుల్ని, మేధావుల్ని టార్గెట్ చేయడం, కేసులు పెట్టడం, కోర్టుల ద్వారా వేధించడం వంటి పద్ధతులు వినియోగిస్తూ వస్తున్నారు. తీవ్ర ఒత్తిడిలో, బాధితులు తమ అభిప్రాయాలను, ఆలోచనలను వెనక్కి తీసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఇది చాలదన్నట్లు శారీరక దాడులు, హత్యలకు కూడా పాల్పడుతున్నారు.ఇలాంటి ప్రతి సంఘటన ప్రజాస్వామ్య సమాజానికి హెచ్చరికగా మనం చూడాలి.

2014లో నరేంద్ర మోడీ ప్రధాని అయిన తర్వాత ఇలాంటి ఒత్తిళ్లు భారీగా పెరిగాయి. ఎం.ఎం. కల్బుర్గి, నరేంద్ర ధబోల్కర్, గౌరి లంకేష్ వంటి, అలాగే ప్రజాప్రతినిధుల హత్యలు,ఈ కోవకు చెందినవి. అలాగే పికె, పద్మావతి, అన్నపూర్ణి వంటి సినిమాలపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనలు, హింసాత్మక ఘటనలు.. ఇవన్నీ ఒకే ధోరణిని సూచిస్తున్నాయి. తాజాగా స్టాండప్ కామేడియన్ కునాల్ కమ్రాపై శివసేన చేసిన దాడీ ఈ వరుసలోనే మరో ఘట్టం.సంఘ్ పరివార్ ఈ దాడులన్నింటినీ ప్రజాస్వామ్య హక్కుల కోణంలో చూపిస్తూ, వాటిని తమ హక్కులుగా సమర్థించడానికి ప్రయత్నిస్తోంది. తాము నమ్మే మత సాంప్రదాయాలను దూషించే విషయాలపై చర్యలు తీసుకుంటే అది పౌరస్వాతంత్ర్యానికే చెందుతుందని వాదిస్తున్నారు. శకుంతల బెనర్జీ అనే తత్వవేత్త చెప్పినట్లు ఇది ప్రజాస్వామ్య విలువలనే వక్రీకరించే చర్య.సంఘ్ పరివార్ చెబుతున్న హిందూత్వ సిద్ధాంతం ప్రకారం, భారతదేశానికి సనాతన హిందూ ధర్మమే ఆధారం. దేశప్రజలంతా హిందువులే అన్న భావనతో ప్రజాస్వామ్యాన్ని పునర్నిర్మించేందుకు సంఘ్ పరివార్ ప్రయత్నిస్తోంది. ఇలాంటి నేపథ్యంలో ఎవరైనా హిందూత్వాన్ని విమర్శిస్తే, వారిని దేశద్రోహులుగా ముద్రించడమే వారి సూత్రంగా మారుతోంది.కానీ ఇది కేవలం సాంస్కృతిక మార్పు మాత్రమే కాదు. ప్రపంచవ్యాప్తంగా (నియో-ఫాసిజం) పెరుగుదలకు కారణం నియో లిబరల్ ఆర్థిక విధానాలే కారణం. భారతదేశంలో 1990ల్లో నియో లిబరల్ సంస్కరణలతోపాటే హిందూత్వ శక్తులు బలపడ్డాయి. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత, అంతకుముందు మండల్ కమిషన్ వ్యతిరేకత ఉద్యమం, రామజన్మభూమి ఉద్యమం వంటి ఘటనలే ఈ శక్తులకు ఊతమిచ్చాయి.

"విజిలాన్టే సెన్సార్‌షిప్" అంటే చట్టబద్ధ అధికారాలే లేని వర్గాలు తమకు నచ్చని అభిప్రాయాలపై దాడులు చేయడం. భారత సినీ రంగంలో పెరిగిపోతున్నది.గతంలో ఈసినిమాల సందర్భంగా మనకు అనుభవాలున్నాయి. ఖల్నాయక్ (1993), బొంబాయి(1995), ఫైర్ (1996), ఫనా (2006), మై నేమ్ ఈస్ ఖాన్ (2010), పికె (2014), పద్మావత్ (2018), అన్నపూర్ణి (2023) ఇవన్నీ ఈకోవలోనే ఈ దాడుల గురయ్యాయి.ఇప్పుడు "ఎంపురాన్"పై వస్తున్న ప్రచారం అదే విధంగా హిందూత్వ శక్తుల విజయాన్నే సూచిస్తోంది. ఇది కేవలం సినిమా విషయంలో కాదు, కేరళ వంటి రాష్ట్రాల్లో కూడా ఈ శక్తులు తమ ఆధిపత్యాన్ని పెంచేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగం. ముఖ్యంగా "ఎంపురాన్" పై పెంచిన వ్యతికేత కేవలం సోషల్ మీడియాకే పరిమితమైపోయింది. దీని కోసం ఎలాంటి ర్యాలీలు, నిరసనలు జరగలేదు.అయిన నిర్మాతలు బెదిరింపులకు గురై భయపడి మళ్లీ సెన్సార్ చేయాల్సిన పరిస్థితిని సంఘ్ పరివార్ కల్పించింది.సోషల్ మీడియాలో కాసుకుని ఉన్న సంఘ్‌పరివార్ శక్తుల హిందూత్వ విద్వేషానికి బలైతామనే భయంతో నిర్మాతలు సినిమా మళ్లీ సెన్సార్ చేయడం ఆందోళన కలిగించే విషయం. ఇది పూర్తిగా నియో-ఫాసిస్టు శైలికి చిహ్నంగా చెప్పవచ్చు. ప్రజాస్వామ్య వ్యవస్థను నాశనం చేయకుండా, దాన్ని వక్రీకరించి ఉపయో గించుకునే అంశాన్ని రాజకీయంగా చూడాలి. హిందూత్వ శక్తులు కూడా మీడియా బదులు సోషల్ మీడియాను ఈ విధంగా వాడు కుంటున్నాయి.ఈ పరిస్థితుల్లో, పురోగమనశక్తులు అప్రమత్తంగా ఉండి, ఈ విధ్వంసకర ప్రయత్నాలను ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది.

- టి.నాగరాజు, 9490098292

యుద్ధానికి కాలు దువ్వడం దేనికి?



ప్రభాత్ పట్నాయక్

రష్యాపై యూరప్ దేశాలు యుద్ధానికి తలపడే ధోరణిని ప్రదర్శిస్తున్నాయి. ఇది పెట్టుబడిదారీ ప్రపంచంలో ప్రస్తుతం ఒక చిక్కు సమస్యగా కనిపిస్తోంది. రష్యా యూరప్‌ను ఆక్రమించుకునే దురుద్దేశ్యంతో వ్యవహరిస్తోందంటూ యూరప్ దేశాలు పదేపదే చేస్తున్న ప్రచారం బొత్తిగా అర్థం లేనిది. గతంలో అమెరికా గోర్బచేవ్‌కు ఇచ్చిన హామీ ప్రకారం నాటో తూర్పుదిశగా (రష్యా వైపుగా) విస్తరించేందుకు పూనుకోకూడదు. కాని, ఆ హామీని ఉల్లంఘించి రష్యాను రెచ్చగొట్టింది నాటో సభ్యదేశాలే. ప్రత్యేకించి అమెరికా, బ్రిటన్ పూనుకుని రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య మిన్స్క్‌లో కుదిరిన శాంతి ఒప్పందాన్ని భగ్నం చేశాయి. ఆ ఒప్పందం గనుక అమల్లోకి వచ్చి ఉంటే అసలు యుద్ధమే జరిగేది కాదు. రష్యాను ఎలాగైనా లొంగదీసుకుని అక్కడ ఉన్న సహజ వనరుల మీద తన పెత్తనాన్ని చెలాయించాలన్నదే నాటో దేశాల లక్ష్యం.బోరిస్ ఎల్సిన్ రష్యా అధ్యక్షుడిగా ఉన్న స్వల్పకాలంలో పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదులు రష్యాను తమ పెత్తనం కిందకు తెచ్చుకోవచ్చునన్న కలలు కన్నారు. కాని ఆ కల ఎక్కువ కాలం నిలవలేదు. కాని వాళ్ల ఆశలు మాత్రం అలానే ఉన్నాయి. అందుకే ప్రచ్ఛన్న యుద్ధకాలంలో సోవియట్ యూనియన్ యూరప్‌ను ఆక్రమించు కుంటుందని అంటూ సాగించిన తప్పుడు ప్రచారాన్నే మళ్లీ ఇప్పుడు తలకెత్తుకున్నారు. అర్థం పర్థం లేని ఈ ఎత్తుగడ పైకి చూస్తే చిన్నపిల్లలాటలా కూడా అనిపిస్తోంది.

అయితే ఇక్కడో ప్రశ్న తలెత్తుతుంది.ఒకపక్క అమెరికా ఎలాగైనా ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకాలన్న పట్టుదలతో ఉంది. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయంలోనే అంతర్లీనంగా రష్యా ఎటువంటి దురాక్రమణకూ పాల్పడ లేదని అంగీకరిం చినట్లైంది.అయినప్పటికీ, యూరప్ ఇంకా 'రష్యా దురాక్రమణ' ప్రచారాన్ని ఎందుకు కొనసాగిస్తోంది? ఈ ప్రశ్న ముఖ్యంగా జర్మనీ విషయంలో బాగా వర్తిస్తుంది. రష్యాపై ఆంక్షలు విధించిన కారణంగా గణనీయంగా నష్టపోయిన దేశం జర్మనీయే. అంతవరకూ చౌకగా లభిస్తున్న రష్యన్ ముడిచమురు బదులు ఖరీదైన అమెరికన్ ముడి చమురును కొనవలసివచ్చింది. దాని ఫలితంగా జర్మనీలో ఉత్పత్తి ఖర్చు బాగా పెరిగిపోయింది. దాంతో పరిశ్రమలు తమ ఉత్పత్తి కేంద్రాలను వేరే దేశాలకు తరలించడం ప్రారంభించారు. ఆ విధంగా జర్మనీలో పరిశ్రమలు మూత బడడంతో బాటు, అక్కడి ప్రజల జీవన వ్యయం కూడా బాగా పెరిగిపోయింది. ఉక్రెయిన్ యుద్ధం గనుక ముగిసిపోతే దాని వలన జర్మనీకి తక్కిన దేశాల కన్నా ఎక్కువగా ఊరట లభిస్తుంది.దాని ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. అయినప్పటికీ జర్మనీ ఇంకా రష్యా మీద యుద్ధానికి కాలు దువ్వడం దేనికి?

ఈ పరిణామాలను బట్టి సామ్రాజ్యవాద దేశాల నడుమ వైరుధ్యం, పోటీ మళ్లీ తీవ్రమవుతున్నట్టు నిర్ధారణకు రాకూడదు. ఆయా బడా పెట్టుబడిదారీ ఆధిపత్య వర్గాల మధ్య శత్రుత్వం నెలకొనివుంటే అది సామ్రాజ్యవాద దేశాల నడుమ వైరుధ్యం పెరగడానికి దారితీస్తుంది. కాని ఇక్కడ అటువంటి శత్రుత్వం లేదు. రష్యా ఎడల అనుసరించ వలసిన వైఖరి విషయంలో వేర్వేరు దృక్పథాలున్నాయి. లెనిన్ వివరించినట్టు, బడా పెట్టుబడిదారీ కూట ములు వివిధ భౌగోళిక ప్రాంతాలపై ఆధిపత్యం కలిగివుండిన కాలంలో వాటి మధ్య శత్రుత్వం తలెత్తే అవకాశం ఉంటుంది. కాని ఇప్పుడు ప్రపంచం మొత్తాన్ని చుట్టుముట్టిన అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం కొనసాగుతోంది.అందుచేత సామ్రాజ్యవాద దేశాల నడుమ వైరుధ్యం చడీచప్పుడూ లేకుండా ఉంటుంది. పైగా ఇప్పుడు జర్మనీ గాని, తక్కిన యూ రోపియన్ దేశాలు గాని రష్యాతో శాంతి సంధి కుదుర్చుకోవడం తప్ప ఘర్షణను కొనసాగించడం వలన ఎటువంటి ప్రయోజనాలూ పొందలేవు. పైగా, ఎంతకాలం పాటు ప్రస్తుత యుద్ధం కొనసాగినా, దాని ద్వారా రష్యాను ఓడించడం ఏ విధంగానూ సాధ్యం కాదు.

అయితే ఇక్కడ ఒక వాదనను చేయవచ్చు. అమెరికా రక్షణ ఛత్రం నీడలో ఇంతవరకూ ఉక్రెయిన్ యుద్ధం కొనసాగింది. ఇప్పుడు అమెరికా పక్కకు తప్పుకుంటానని అంటోంది. ఆ పరిస్థితిలో ఆ యుద్ధాన్ని కొనసాగించడానికి యూరప్ దేశాలు తమ సైనిక వ్యయాన్ని పెంచడం అవసరమే కదా. అలా చేయకపోతే, రేపొద్దున్న ఎటువంటి సంధి కుదిరినా, అందులో యూరప్ దేశాల ప్రయోజనాలను కాపాడుకోవడం సాధ్యం కాదు. అలా రక్షణ వ్యయం పెంచా లంటే సంక్షేమ చర్యల మీద చేసే ఖర్చు తగ్గించి ఆ మేరకు రక్షణ వ్యయాన్ని పెంచాలి. అప్పుడు ప్రజల్లో వ్యతిరేకత వస్తుంది. ఆ ప్రజలకు సర్దిచెప్పి తమ చర్యను సమర్ధించుకోడానికి "రష్యా దురాక్రమణ" ప్రచారాన్ని ముందుకు తెస్తున్నారు.

అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి భారీ ద్రవ్యలోటును ఆమోదించదు. అటువంటి లోటు వలన ఆర్థిక కార్య కలాపాలు మందగిస్తాయని, పెట్టుబడిదారీ స్వేచ్ఛకు భారీ ద్రవ్యలోటు ఆటంకం అని అది భావిస్తుంది. అయితే ఒక పొరుగు దేశం నుండి ప్రమాదం ముంచుకొస్తోందన్నప్పుడు ఇటువంటి అభ్యంతరానికి అంతగా బలం ఉండదు. పైగా యుద్ధ ప్రయత్నాలు కూడా ఆర్థిక కార్యకలాపాలను, ఉపాధిని పెంచుతాయి. అందుచేత ద్రవ్యలోటు పెంచడానికి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి గల అభ్యంతరాన్ని పక్కకు పెట్టవచ్చు. తాజాగా జర్మనీ తన రాజ్యాంగాన్ని సవరించి ప్రభుత్వ రుణ పరిమితిని పెంచుకోడానికి చట్టం చేసింది. యుద్ధ ప్రమాదం రష్యా నుండి పొంచివుందని ప్రచారం చేయడం ద్వారా సంక్షేమ చర్యలకు కోతలు పడినందువలన ప్రజల్లో తలెత్తే వ్యతిరేకతను కూడా చల్లార్చవచ్చు.

అయితే ఈ వాదన కొంతవరకూ సమంజసంగానే ఉన్నా ప్రస్తుత పరిస్థితిని పూర్తిగా వివరించడానికి ఇది సరిపోదు. రష్యాతో యుద్ధానికి కాలుదువ్వే ధోరణి యూరోపియన్ దేశాల్లో ట్రంప్ అధికారంలోకి రావడానికి మునుపే తలెత్తింది. పచ్చి మితవాద, నయా ఫాసిస్టు రాజకీయ కూటముల్లో కన్నా మధ్యేవాద ఉదార బూర్జువా కూటములే ఎక్కువగా ఈ రష్యన్ ప్రమాదం గురించి చాలా బలంగా ప్రచారం చేస్తున్నాయి. ఉదాహరణకు జర్మనీలోని పచ్చి మితవాద పార్టీ ఎఎఫ్‌డి జర్మనీని మరింత సైనికీకరణ చేయడానికి గాని, అణ్వాయుధాలను సమకూర్చుకోడానికి కాని వ్యతిరేకించదు. బలంగానే సమర్థిస్తుంది, కాని ఆ పార్టీ కన్నా ఎక్కువగా ఇప్పుడు అక్కడ అధికారంలో ఉన్న సోషల్ డెమోక్రాట్లు, ఫ్రీ డెమోక్రాట్లు, గ్రీన్స్, లేదా ఇటీవల విజయాలు సాధించిన క్రిస్టియన్ డెమోక్రాట్-క్రిస్టియన్ సోషల్ యూనియన్ కూటమి ఉక్రెయిన్ యుద్ధం విషయంలో ఎక్కువగా రెచ్చిపోతున్నాయి. ఇటలీలోని నయా ఫాసిస్టు మెలనీ కాని, హంగరీలోని నయా ఫాసిస్టు ఓర్బన్ కాని ఈ విషయంలో అంతగా రెచ్చిపోవడం లేదు.

దీన్ని బట్టి ఒక నిర్ధారణకు రావచ్చు. నయా ఫాసిస్టు రాజకీయ శక్తులు ఆర్థిక సంక్షోభ సమయంలో బడా పెట్టుబడి



అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి భారీ ద్రవ్యలోటును ఆమోదించదు. అటువంటి లోటు వలన ఆర్థిక కార్య కలాపాలు మందగిస్తాయని, పెట్టుబడిదారీ స్వేచ్ఛకు భారీ ద్రవ్యలోటు ఆటంకం అని అది భావిస్తుంది. అయితే ఒక పొరుగు దేశం నుండి ప్రమాదం ముంచుకొస్తోందన్నప్పుడు ఇటువంటి అభ్యంతరానికి అంతగా బలం ఉండదు. పైగా యుద్ధ ప్రయత్నాలు కూడా ఆర్థిక కార్యకలాపాలను, ఉపాధిని పెంచుతాయి. అందుచేత ద్రవ్యలోటు పెంచడానికి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి గల అభ్యంతరాన్ని పక్కకు పెట్టవచ్చు. తాజాగా జర్మనీ తన రాజ్యాంగాన్ని సవరించి ప్రభుత్వ రుణ పరిమితిని పెంచుకోడానికి చట్టం చేసింది. యుద్ధ ప్రమాదం రష్యా నుండి పొంచివుందని ప్రచారం చేయడం ద్వారా సంక్షేమ చర్యలకు కోతలు పడినందువలన ప్రజల్లో తలెత్తే వ్యతిరేకతను కూడా చల్లార్చవచ్చు.

ఆధిపత్యాన్ని నిలబెట్టడం కోసం ఏదో ఒక 'అంతర్గత' శత్రువును సృష్టించి (ఏదో ఒక మైనారిటీ తెగకు గాని మైనారిటీ మతానికి గాని చెందిన సమూహాన్ని) ప్రజల్లో ఆ శత్రువు పట్ల విద్వేష భావాన్ని రెచ్చగొట్టి వారి దృష్టిని ఆ వైపు మళ్లిస్తాయి. తద్వారా జీవన సమస్యల నుండి, నిరుద్యోగం వంటి సవాళ్లనుండి వారి దృష్టిని తప్పిస్తాయి. అదే మధ్యేవాద ఉదార బూర్జువా రాజకీయ శక్తులు 'బాహ్య శత్రువు' వైపు ప్రజల దృష్టిని మళ్లిస్తాయి. ఇప్పుడు యూరప్‌లో రష్యాను అటువంటి బాహ్య శత్రువుగా చిత్రిస్తున్నది అందుకే.

ఇది ఈ మధ్య తలెత్తిన ఒక కొత్త ధోరణిగా భావించవచ్చు.

ఈ మధ్యేవాద ఉదార బూర్జువా పార్టీలు తమ తమ దేశాల ఆర్థిక వ్యవస్థలను సంక్షోభంలోంచి బయటకు తేవడానికి ఇన్నాళ్లూ అనుసరిస్తూ వచ్చిన విధానాలు ఏవీ ఇప్పుడు పనిచేయడం లేదు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి వీలుగా ప్రభుత్వ వ్యయం పెంచుదామంటే అందుకు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నిబంధనలు అడ్డం వస్తున్నాయి. ఈ పార్టీలు కొన్ని దశాబ్దాల క్రితం ప్రవేశ పెట్టిన నయా ఉదారవాద విధానాల ఫలితంగా ప్రజల్లో పెరిగిన నిరుద్యోగం, పేదరికం వలన వాటి ప్రజామద్దతు తరిగిపోతోంది. ఆ మద్దతును ఏదో ఒక విధంగా మళ్లీ కూడగట్టుకోవాలి. అందుకే ఇప్పుడు వాళ్లు 'రష్యా ప్రమాదం' బూచిని చూపిస్తున్నారు.

దీనితోబాటు ఆయుధాల పరిశ్రమాధిపతుల ఒత్తిళ్లు కూడా పని చేస్తున్నాయి. ఇన్నాళ్లూ ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఆ పరిశ్రమలకు బాగా ఆర్డర్లు వచ్చాయి. ఇప్పుడు ఆ యుద్ధం ఆగిపోతే వారి లాభాలు తగ్గిపోతాయి. జర్మనీలోని ఒక ప్రముఖ ఆయుధ పరిశ్రమ సంస్థ రైన్ మెటల్‌కు ఇంతవరకూ చేతి నిండా ఆర్డర్లు ఉన్నాయి. ఇప్పుడు జర్మనీ రాజ్యాంగాన్ని సవరించి ఆయుధాల ఖర్చును పెంచడానికి పూనుకోవడం వలన ఆ సంస్థ మరికొన్ని సంవ త్సరాలపాటు ఆర్డర్లు పొందగలుగుతుంది. "రష్యన్ దురాక్రమణ" ప్రచారం అందుకు తోడ్పడుతుంది.

అయితే రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థ తనను తాను ఒక "మానవీయ" వ్యవస్థగా మలుచుకోగలిగినట్టు చెప్పుకుంటూ కొనసాగుతూ వచ్చింది. ప్రజాస్వామ్య విధానాన్ని బలపరిచిన వ్యవస్థగా, సార్వత్రిక ఓటు హక్కును కల్పించిన వ్యవస్థగా ప్రచారం చేసుకుంటూ వచ్చింది. సంక్షేమానికి గణనీయంగా ఖర్చు చేస్తూన్నట్టు ప్రచారం చేసుకుంది. వలస విధానం ఉనికిలో లేదు కనుక సామ్రాజ్యవాద దోపిడీ దుర్లక్షణాలు తనలో ఏవీ లేనట్టు చెప్పుకుంటూ వచ్చింది. పెట్టుబడిదారీ వ్యవస్థ తాను పూర్తిగా 'మారిపోయానని' చెప్పుకుంటూ కొనసాగింది.

కాని ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇటువంటి ప్రచారాలు చేసుకోడానికి సాధ్యం కావడంలేదు. ఎందు కంటే ఆ 'మానవీయ' లక్షణాలేవీ కొనసాగించడం సాధ్యం కావడం లేదు. పెట్టుబడిదారీ వ్యవస్థ మళ్లీ తన కల్తీ లేని భయంకరమైన వికృత రూపంతో ముందుకు వస్తోంది. పెట్టుబడిదారీ ప్రపంచంలో నయా ఫాసిస్టు అణచివేత అక్కడ ప్రజాస్వామ్యాన్ని పక్కకు నెట్టివేస్తోంది. ఈ పరిణామం పట్ల సోషల్ డెమాక్రటిక్ పార్టీలు చాలా ఉదాసీనంగా వ్యవ హరిస్తున్నాయి. సంక్షేమ రాజ్యం అనే భావనను తోసిరాజనే విధంగా ఇప్పుడు ఆయుధాల ఖర్చును పెంచే చర్యలు చట్టబద్ధత పొందుతున్నాయి. మూడవ ప్రపంచ దేశాల్లో ఉన్న సహజ వనరులపై, ముడి సరుకులపై సామ్రాజ్యవాద దేశాలు పట్టు చిక్కించుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నాయి. ట్రంప్ ఉక్రెయిన్‌ను, గ్రీన్‌ల్యాండ్‌ను తన ఆధీ నంలోకి తెచ్చుకోవాలని ప్రయత్నించడం, మరోపక్క గాజాను ఆక్రమించుకుని అక్కడ పర్యాటక పరిశ్రమను అభివృద్ధి చేస్తానంటూ ప్రకటించడం కూడా ఇందులో భాగమే. అందుచేత ఇప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థ మళ్లీ తన 'మానవీయ' రూపాన్ని సంతరించుకోగలుగుతుంది అని నమ్మడం అంటే సింహం గడ్డి మేస్తుందని నమ్మడం వంటిదే.

(స్వేచ్ఛానుసరణ)

కుల వివక్షను పౌర సమాజమే పారదోలాలి




టి.స్కైలాబ్ బాబు
9177549646

'ఇప్పుడంతా మారిపోయింది, అందరూ కలిసి తింటున్నారు, కలిసి తిరుగుతున్నారు, హోటళ్లలో, జాతరల్లో, ఉత్సవాల్లో అన్నింట్లో కలిసే ఉంటున్నారు. ఇంకెక్కడుంది కుల వివక్ష?' ఈ మధ్యకాలంలో ఇలాంటి వాదనలు తరచూ వినిపిస్తున్నాయి. దేశం చాలా మారిం దంటున్నారు. వివక్ష లేనేలేదం టున్నారు. కానీ, నేటికీ కులజాఢ్యం అణగారిన ప్రజల్ని పట్టి పీడిస్తూనే ఉంది. పల్లెల్లో ప్రత్యక్షంగా, పట్టణాల్లో పరోక్షంగా ఇది కనిపిస్తూనే ఉంది. అయితే గతంలో ఉన్నంత మాదిరిగా ఇప్పుడు లేకపోవచ్చు, కానీ, కులవివక్ష రూపం మార్చుకుని మరో రూపంలో కొనసాగుతున్నది.శాస్త్ర, సాంకేతిక రంగం ఇంత అభివృద్ధి సాధిస్తుంటే ఇదేం వివక్ష? అనుకోవచ్చు. దీన్ని స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తర్వాత కూడా కొనసాగడానికి అగ్రవర్ణాల ఆధిపత్యంతో నడిచే ప్రభుత్వాలే కారణం.

దేశవ్యాప్తంగా చూస్తే మనరాష్ట్రంలోనూ దళితులపై దాడులు, దౌర్జన్యాలు, లైంగికదాడులు, సాంఘిక బహిష్కరణలు ఎక్కువే. పండగలు, ఉత్సవాల్లో ఈ వివక్ష పాటించబడుతున్నది. పెద్దకులాలతో కలిసి బతుకమ్మ ఆడనీయకపోవడం, దసరా పండుగ సందర్భంగా జమ్మిచెట్టు ఆకు దళితులు తెంపితే దాడి చేయడం, దళి తులకు క్షవరం చేయనియ్యకపోవడం, వారి బట్టలు ఉతకని పరిస్థితి ఉంది. గ్రామాల్లో రచ్చ బండల మీద కూర్చోనీయకపోవడం పాఠ శాలల్లో మధ్యాహ్న భోజనం వంటలపై వివక్ష పాటించడం, గుడిలోకి రానీయకపోవడం, హోటళ్లలో రెండుగ్లాసుల పద్ధతి, ఇంకా అనేక రూపాల్లో కులవివక్ష కొనసాగుతున్నది. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలం గుందిమల్ల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న తోటి ఉపాధ్యాయులు భోజనం చేసే దగ్గర దళిత ఉపాధ్యాయుని పట్ల అంటరానితనం చూపించారు. అంటే ఇది చదువుకున్న వారిని సైతం ప్రభావితం చేస్తున్నది. సంగారెడ్డి మండలం ఎర్దనూరు గ్రామంలో పౌర హక్కుల దినం కార్యక్రమం నిర్వహించి అధికారుల సమక్షంలో దళితులను ఆలయ ప్రవేశం చేయిస్తే, ఆ గ్రామంలోని కొంతమంది పెత్తందారులు దళితులపై దౌర్జన్యానికి దిగడం కూడా అలాంటిదే. దీన్నిబట్టి గ్రామంలో మేం చెప్పిందే వినాలన్న ధోరణి ఇంకా నడుస్తున్నది. నారాయణఖేడ్, జహీ రాబాద్, అందోల్ ప్రాంతాల్లో నేటికీ దళితులకు ఆలయ ప్రవేశాలు లేవు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి నగరాల్లో ఇండ్లు శాఖహారులకు మాత్రమే అద్దెకిస్తారు. ఎస్సీ,ఎస్టీ, ముస్లిం మైనార్టీలకు ఇవ్వరు. పైగా 'బ్రాహ్మణులకు మాత్రమే ఇల్లు కిరాయికి ఇవ్వబడును' అని అగ్రకుల ఆధిపత్యం నింపుకున్న వ్యక్తులు తమ ఇంటి గోడలకు బోర్డులు పెడుతున్నారు.

నేటికీ అమలు చేయని జస్టిస్ పున్నయ్య సిఫారసులు

ఇలా అనేక కులవివక్షల్ని గుర్తించిన కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఉమ్మడి ఏపీలో, నేడు తెలంగాణలో వేలాది మంది కార్యకర్తలతో, వందలాది గ్రామాల్లో సర్వేచేసింది. అంటరానితనం, కులవివక్ష, రెండుగ్లాసుల పద్ధతిపై అనేక పోరాటాలు నిర్వహించింది. దీంతో ప్రభుత్వమే నాడు దిగొచ్చి హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ పున్నయ్యతో ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసింది. ఇది కేవీపీఎస్ సాధించిన విజయం. ఆ తర్వాత జస్టిస్ పున్నయ్య కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి 128 రకాల కులవివక్షలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. అయితే ఆ వివక్షలన్నీ కమిషన్ ఏర్పడగానే అంతమయ్యాయా? అంటే లేదు. కమిషన్ ఏర్పాటు చేసిన పాలకులు దాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలి కదా! నేటికీ పున్నయ్య సిఫారసు చేసిన నలభై అంశాల్ని సర్కార్ పట్టించుకోవడం లేదు. ఫలితంగా నేటికీ కులవివక్ష రూపాలు కొన సాగుతున్నాయి.పున్నయ్య కమిషన్ సిఫారసుల్లో ప్రధానమైనవి చూస్తే వారంలో ఒకరోజు ప్రభుత్వ అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కులవివక్షను గుర్తించి దాన్ని రూపుమాపడానికి ప్రయత్నించాలని పేర్కొన్నది. కానీ ఎక్కడా ఆ సిఫారసు అమలుకు నోచుకోవటం లేదు. 1955 పౌర హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రతి నెల చివరిరోజు కులవివక్ష, అంటరానితనంపై చైతన్య సదస్సులు నిర్వహించాలని పేర్కొ న్నది. కానీ దాన్ని ఎక్కడా



అమలు జరపటం లేదు. దళితులపై దాడులు, దౌర్జన్యాలు జరిగిన సందర్భంలో ఏకైక రక్షణ కవచంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పూర్తిగా నీరుగారుస్తున్నది. స్టేషన్ బెయిలిస్తూ దాడులు మరింతగా పెంచడానికి ఊతమిచ్చే విధంగా వ్యవహరిస్తున్నది.

మనువాదంతో పెరుగుతున్న కులవివక్ష

ఆరెస్సెస్-బీజేపీ మనువాద విధానాలు పల్లెలవాతవరణాన్ని చెదరగొడుతున్నాయి. కుల వివక్ష అంటరానితనాన్ని మరింతగా విస్తృత పరుస్తున్నాయి. చిన్న జీయర్‌స్వామి లాంటి ఆధ్యాత్మికవేత్త 'కులం ఉండాల్సిందే, కులం పోకూడదు. ఒక మనిషి శరీరానికి కాళ్లు రెక్కలు ఎంత అవసరమో, దేశానికి కులాలు అంత అవసరం' అని ప్రబోధిస్తున్నాడు. గ్రామ సీమల్లో దళితులు అంబేద్కర్ విగ్రహాలు నెలకొల్పడానికి ప్రయత్నిస్తే దానికి పోటీగా ఆరెస్సెస్ బీసీలను రెచ్చగొట్టి, శివాజీ విగ్రహాలను పెట్టి దళితులకు బీసీలకు మధ్య ఘర్షణలను సృష్టించడం ఎలా చూడాలి. అంటే కులాల కుంపటిని రగలించి రాజకీయాలు నడుపుతుందా? శివమాలలు వేసిన సందర్భంలో దేవాలయాలను ప్రత్యేకంగా ఆర్గనైజ్ చేస్తున్న ఆరెస్సెస్ దళితులు శివమాలలు వేసుకుని వచ్చినా బిక్షలో కూర్చోనీయట్లేదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15 కుల వివక్షత, అంటరానితనం, నేరం..చట్టవిరుద్ధం అని పేర్కొంటున్నాయి. కానీ దానిపై ప్రమాణం చేసి ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైనవారు కుల వివక్ష రూపుమాపడానికి ఎటువంటి ప్రయత్నం చేయకపోగా పరోక్షంగా దాన్ని బలపరుస్తుండటం బాధాకరం.

కేవీపీఎస్ ఉద్యమ క్యాంపెయిన్

పూలే, అంబేద్కర్ ఆశయాల గురించి పలువురు పలు విధాలుగా వ్యాఖ్యానిస్తుంటారు. అంబేద్కర్ జయంతి, వర్ధంతి సందర్భంగా దండలేసి దండాలు పెట్టి ఆయన ఆశయాలు నెరవేర్చినట్టు భావిస్తుంటారు.కానీ పూలే అంబేద్కర్ తమ వ్యక్తిగత జీవితంలో అనుభవించిన కుల వివక్షను పారదోలటానికి ప్రత్యక్ష ప్రతిఘటనా ఉద్యమాలు నిర్మించారు.ఆ మహనీయుల అడుగుజాడల్లో పయనిస్తున్న కేవీపీఎస్ నేటికీ కొనసాగుతున్న కులవివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటనా ఉద్యమాలకు శ్రీకారం చుట్టింది. అందుకు ఏప్రిల్

పూలే, అంబేద్కర్ ఆశయాల గురించి పలువురు పలు విధాలుగా వ్యాఖ్యానిస్తుంటారు. అంబేద్కర్ జయంతి, వర్ధంతి సందర్భంగా దండలేసి దండాలు పెట్టి ఆయన ఆశయాలు నెరవేర్చినట్లు భావిస్తుంటారు.కానీ పూలే అంబేద్కర్ తమ వ్యక్తిగత జీవితంలో అనుభవించిన కుల వివక్షను పారదోలటానికి ప్రత్యక్ష ప్రతిఘటనా ఉద్యమాలు నిర్మించారు.ఆ మహనీయుల అడుగుజాడల్లో పయనిస్తున్న కేవీపీఎస్ నేటికీ కొనసాగుతున్న కులవివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటనా ఉద్యమాలకు శ్రీకారం చుట్టింది. అందుకు ఏప్రిల్ నెల మొత్తాన్ని మహనీయుల మాసంగా పాటించాలని, పూలే అంబేద్కర్ స్ఫూర్తితో ఈ పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చింది.

నెల మొత్తాన్ని మహనీయుల మాసంగా పాటించాలని, పూలే అంబేద్కర్ స్ఫూర్తితో ఈ పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చింది. ఆ వెలుగులో ఏప్రిల్ 1నుండి 10వరకు క్షేత్రస్థాయిలో కుల వివక్షపై సమగ్ర సర్వేలు, ఏప్రిల్ 11 నుండి 14 వరకు పూలే అంబేద్కర్ జన జాతర సభలు, సెమినార్లు, సదస్సులు, ఏప్రిల్ 15 నుండి 30 వరకు కుల వివక్ష పై ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలు నిర్మించాలని సంఘం నిర్ణయించింది. సమాజహితం కోరుకునే వ్యక్తులు శక్తులు, ప్రజాసంఘాలు, సామాజిక సంఘాలు, రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగా సంపూర్ణంగా మద్దతు తెలియజేస్తూ ఈ ఉద్యమాల్లో పాలుపంచుకోవాలని కేవీపీఎస్ పిలుపునిస్తోంది. చాపకింద నీరులా సాగుతున్న మనువాద సంస్కృతి, కులవివక్ష, అంటరానితనం పూర్తిగా రూపుమాపబడాలంటే పౌర సమాజమే దీనికి పూనుకోవాలి. ఈ సామాజిక మహోద్యమంలో గురుతర బాధ్యతగా భాగస్వాములై కులవివక్షను పారదోలాలి.

రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందో

శ్వేతపత్రం ఇవ్వాలి

- కేంద్రమంత్రులకు మహేశ్‌కుమార్‌గౌడ్ సవాల్



నవతెలంగాణబ్యూరో -హైదరాబాద్

రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందో శ్వేతపత్రం ఇవ్వాలంటూ టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు సవాల్ విసిరారు. రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందో చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఒక్క చాన్స్ పేరుతో ప్రాధేయపడుతున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. పదకొండేండ్ల బీజేపీ పాలనలో ప్రధాని మోడీ ఏం ఉద్ధరించారో కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని చెప్పారు. లౌకికవాదాన్ని నమ్ముకున్న తెలంగాణ ప్రజలు బీజేపీని ఎట్టి పరిస్థితుల్లో ఆదరించబోరని తెలిపారు. అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ప్రగల్బాలు పలికిన మోడీ గురించి కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పదేండ్లలో బంగారం లాంటి ప్రభుత్వ భూములను బీఆర్ఎస్ అమ్మితే, బీజేపీ నేతల కండ్లు మూసుకుపోయాయా? అని ప్రశ్నించారు. బీసీల 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చేలా రాష్ట్ర బీజేపీ నేతలు ఎందుకు చొరవ తీసుకోవడం లేదన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ అప్పటి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెప్పులు మోసిన ఘటన మరిచిపోయావా? అని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్న బియ్యం పంపిణీని చేయాలని డిమాండ్ చేశారు. విభజన హామీల గురించి కేంద్ర మంత్రులు ఏనాడైనా మాట్లాడారా? అని నిలదీశారు. ప్రధాని మోడీ దేశాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. మత సామరస్యానికి ప్రతీక అయిన తెలంగాణలో మతతత్వ బీజేపీకి అధికారం పగటి కలే అన్నారు. భావోద్వేగాలను రెచ్చగొడుతూ లౌకికవాదానికి తిలోదకాలిస్తున్న బీజేపీకి తెలంగాణలో చోటే లేదని స్పష్టం చేశారు. తెలంగాణలో మతం పేరుతో గెలిచిన ఎనిమిది మంది బీజేపీ ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు ఉండి కూడా రాష్ట్రానికి తెచ్చిన నిధులు గుండు సున్నా అని ఎద్దేవా చేశారు. యమునా నదికి నిధులు కేటాయించిన కేంద్రం...హైదరాబాద్ మెట్రో, మూసీ రివర్‌ను ఎందుకు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సంఖ్యా బలం లేకపోయినా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరి అండ చూసుకుని అభ్యర్థిని బరిలోకి దించారని ప్రశ్నించారు.

యువతి పట్ల ఓ వ్యక్తి అసభ్యకర ప్రవర్తన

- రాళ్లతో దాడి చేసి తప్పించుకున్న యువతి
- కేసు నమోదు



నవతెలంగాణ-మేడ్చల్

యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. మేడ్చల్ సీఐ అద్దాని సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి 9గంటల సమయంలో ఓ యువతితో గుర్తు తెలియని వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. వెంటనే అప్రమత్తమైన సదరు యువతి ప్రతిఘటించి రాయితో అతన్ని కొట్టి తప్పించుకుంది. అనంతరం మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై 305 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. బాధితురాలి నుంచి పూర్తి వివరాలు సేకరించారు. అయితే ఈ ఘటన రైల్వే స్టేషన్ పరిధిలో జరగడంతో రైల్వే పోలీసులకు కేసును బదిలీ చేసినట్టు సీఐ తెలిపారు.

హెచ్‌సీయూ విద్యార్థులపై

కేసుల ఉపసంహరణ

(మొదటిపేజీ తరువాయి)

జరిపిన చర్చల అనంతరం భట్టి ఆదేశాలు జారీ చేశారు. జ్యూడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఇద్దరు విద్యార్థులకు సంబంధించి కేసుల ఉపసంహరణకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. కేసుల ఎత్తివేతలో న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ అధికారులకు తగు సూచనలు చేయవలసిందిగా న్యాయశాఖ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు సబ్‌కమిటీతో జరిగిన సమావేశంలో హైదరాబాద్ విశ్వవిద్యాలయ ఉపాధ్యాయ సంఘం (యూహెచ్‌టీఏ) పౌర సంఘాల ప్రతినిధులు సమావేశమై పలు డిమాండ్లను మంత్రుల కమిటీ దృష్టికి తెచ్చారు. ప్రతిపాదిత డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకపోవడంతో విద్యార్థి జాయింట్ యాక్షన్ కమిటీ ఈ సమావేశానికి హాజరు కాలేదని సివిల్ సొసైటీ సభ్యులు పేర్కొన్నారు.

డిమాండ్లు నెరవేర్చిన తర్వాతే విద్యార్థులు మంత్రుల కమిటీ నిర్వహించే సమావేశానికి హాజరవుతారని వారు సబ్‌కమిటీకి తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచందర్ రెడ్డి, హెచ్‌సీయూ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు ప్రొఫెసర్ సౌమ్య దేచమ్మ, ప్రొఫెసర్ శ్రీపర్ణదాస్, ప్రొఫెసర్ భంగ్య భూక్య, పౌర సంఘాల ప్రతినిధులు విస్సా కిరణ్‌కుమార్, సంధ్య, సజయ, ఇమ్రాన్ సిద్ధిఖీ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సొసైటీ ప్రతినిధుల డిమాండ్లు

1. హెచ్‌సీయూ క్యాంపస్ నుంచి పోలీసు బలగాలను వెంటనే ఉపసంహరించుకోవడంతో పాటు నిషేధాజ్ఞలను వెనక్కి తీసుకోవాలి.
2. ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై ఇటీవల నమోదు చేసిన అన్ని కేసులను ఉపసంహరించుకోవాలి. పోలీసు కస్టడీలో ఉన్న ఇద్దరు విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి.
3. కేంద్ర సాధికార కమిటీ క్యాంపస్‌ను సందర్శించే ముందు 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూమిలో నష్టం అంచనా, జీవవైవిధ్య సర్వే నిర్వహించడానికి నిపుణులైన అధ్యాపకులు, పరిశోధకులకు అనుమతివ్వాలి.

మంత్రుల కమిటీ స్పందన

1. సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం 400 ఎకరాల భూమిని రక్షించడానికి పోలీసుల పహారా తప్పనిసరి.
2. క్యాంపస్‌లోని మిగిలిన ప్రాంతాల నుంచి పోలీసులను ఉపసంహరించుకోవాలనే అంశం గురించి ప్రభుత్వం తరపున వీసీకి లేఖ రాస్తాం. విద్యార్థులు, వసతి గృహాల భద్రత గురించి వీసీ హామీ ఇచ్చిన తర్వాత, 400 ఎకరాల్లో మినహా, క్యాంపస్ నుంచి పోలీసులను ఉపసంహరించుకుంటాం.
3. విద్యార్థులపై దాఖలైన కేసుల పట్ల సానుభూతితో కూడిన దృక్పథానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. సాధ్యమైనంత త్వరగా కేసుల ఉపసంహరణకు పోలీసు, న్యాయశాఖతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటాం
4. సుప్రీంకోర్టు తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు అధ్యాపకులు, విద్యార్థులు సహా ఎవరిని 400 ఎకరాల్లో సర్వేకు అనుమతించం.
5. విద్యార్థులు కోరిన విధంగా యూనివర్సిటీని సందర్శించడానికి కమిటీ సానుకూలంగా ఉంది, కానీ సుప్రీంకోర్టులో కేసు కొనసాగుతున్నందున న్యాయపరమైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికిప్పుడు హెచ్‌సీయూకి మంత్రుల బృందం రాలేదు. అయితే ఈ విషయంపై విద్యార్థుల సూచనలు, సలహాలు వినడానికి మంత్రుల కమిటీ సిద్ధంగా ఉంది.

ధాన్యం కొనుగోళ్లకు ఎదురుచూపులు

పూర్తిగా తెరుచుకోని కేంద్రాలు

- నల్లగొండలో పాక్షికంగా ప్రారంభం
- సూర్యాపేట, యాదాద్రిలో ఏర్పాట్లకే పరిమితం



నవతెలంగాణ-నల్లగొండప్రాంతీయ ప్రతినిధి

అనావృష్టి, పెరిగిన ఉష్ణోగ్రతలతో భూగర్భ జలాలు పడిపోయి సకాలంలో నీరందక అష్ట కష్టాలు పడితే చివరకు చేతికందని పంటలను అమ్ముకోవడానికి రైతులు ఎదురు చూడాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లు ఇంకా పూర్తికాలేదు. కేంద్రాలు పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 871 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేసింది. అయినప్పటికీ నల్లగొండ మినహా సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో ఇంకా కొనుగోళ్ల ప్రారంభం కాలేదు. వానాకాలం నుంచి సన్నాలకు రూ.500 బోనస్ అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఉమ్మడి జిల్లాలో 871 కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు చేస్తున్నట్టు అధికారులు చెప్పినప్పటికీ క్షేత్రస్థాయిలో ఇంకా పూర్తిగా కేంద్రాలు తెరుచుకోలేదు.

నల్లగొండలో పాక్షికంగా ప్రారంభం.. మిగతా చోట్ల లేవు

రాష్ట్రంలోని మొట్టమొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రోడ్డు భవనాలు సినిమా ఫొటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పదేపదే అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశిస్తున్నప్పటికీ చాలా మండలాల్లో సగం కేంద్రాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 375 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 304 కేంద్రాలు దొడ్డు ధాన్యం కొనుగోలుకు, 71 కేంద్రాలు సన్న ధాన్యం కొనుగోలుకు వినియోగించనున్నారు. మార్కెట్‌కు వచ్చే ధాన్యం ఆధారంగా మరిన్ని కొనుగోలు కేంద్రాలను పెంచుతామని కలెక్టర్ స్పష్టం చేశారు. రబీలో జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 5 వేల హెక్టార్లలో వరి సాగవ్వగా, 12 లక్షల 14449 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేసినట్టు తెలిపారు. మార్కెట్‌కు 11 లక్షల 26021 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉండగా.. ఇందులో మిల్లర్లు 5,68,152 మెట్రిక్ టన్నులు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా 5,57,869 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. కాగా నేటికి 250 కేంద్రాలు మాత్రమే ప్రారంభమైనట్టు అధికారులు చెప్పారు.

సూర్యాపేట జిల్లాలో 4,73,739 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో సన్న రకం 2,63,250 ఎకరాల్లో సాగు చేయగా 6,58,125 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. దొడ్డు రకం 2,10,489 ఎకరాలకుగాను 5,47,271 మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా కాగా, రెండు రకాలు కలిపి మొత్తం 12 లక్షల 5396 మెట్రిక్ టన్నుల పంట దిగుబడి రానున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే 25 లక్షల గన్ని బ్యాగులు సిద్ధంగా ఉండగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయ్యే నాటికి మరో 10 లక్షల గన్ని బ్యాగులను సేకరించే అవకాశం ఉంది.

కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

నేను పండించిన 700 బస్తాల ధాన్యాన్ని మూడ్రోజుల కిందట అనపర్తి కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చా. కానీ ఇంతవరకు కొనుగోళ్లు ప్రారంభించలేదు. కేంద్రంలో ఎలాంటి సౌకర్యాలూ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలి.

- రైతు ఏర్పుల మల్లారెడ్డి, అనపర్తి

ఇంకా ఏర్పాట్లలోనే..

భువనగిరి యాదాద్రి జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతంలో ఆలస్యంగా నాట్లు వేయడం వల్ల వరి కోతలు కూడా ఆలస్యం అవుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఇంకా కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లలోనే ఉన్నారు.

ప్రయివేటు మిల్లులకు రైతుల మొగ్గు

ప్రభుత్వం ధాన్యం క్వింటాకు రూ.2,300 రూపాయల మద్దతు ధర ప్రకటించింది. అంతేకాకుండా సన్నధాన్యానికి ప్రోత్సాహకంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించింది. పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో మిర్యాలగూడ ప్రాంతంలో రైతులు ప్రయివేటు మిల్లర్లకు అమ్ముకోవడానికి సిద్ధపడుతున్నారు. ఇదే అదనుగా మిల్లర్లు కొర్రీలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు ధాన్యం రాకుండా చెక్‌పోస్టుల ఏర్పాటుతోపాటు, ఇంటర్ చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ ప్రకటించినప్పటికీ మిర్యాలగూడ ప్రాంతంలో ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం వాహనాలు వచ్చి ఉన్నాయి.



జనాభా ప్రాతిపదికన పార్లమెంటు నియోజకవర్గాల

పునర్విభజనతో దక్షిణాదికి తీవ్ర నష్టం

- వీసీకే జాతీయ అధ్యక్షులు డాక్టర్ తిరుమావళవన్
- పునర్విభజనపై టీజేఎస్ సదస్సు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జనాభా ప్రాతిపదికన పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని విడుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే) జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ తిరుమావళవన్ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అధ్యక్షతన సోమవారం హైదరాబాద్‌లో "పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన-దక్షిణ భారత భవిష్యత్తు" అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాది రాష్ట్రాల్లో లోక్ సభ సీట్లను భారీగా పెంచుకుని పార్లమెంటులో ఆధిపత్యంతో బీజేపీ తన రాజకీయ ఎజెండాను అమలు చేయాలని చూస్తున్నదని హెచ్చరించారు. దీంతో దక్షిణాది రాజకీయ ప్రాతినిధ్యం తగ్గి వాటి అవసరం లేకుండానే పార్లమెంటులో చట్టాలు రూపొందించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. దళితులు, ఆదివాసీలు, ముస్లింల ఓట్లు అధికంగా ఉన్న నియోజకవర్గాలను విభజన చేసి, అశాస్త్రీయంగా వాటి సరిహద్దులను కూడా మార్చడానికి కుట్రలు చేయబోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ సీట్లను పెంచకుండా యథాతథంగా ఉంచాలన్న డిమాండ్‌కు తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు మద్దతునివ్వాలని ఆయన కోరారు. తమిళనాడు విల్లుపురం ఎంపీ డి.రవి కుమార్ మాట్లాడుతూ ఆర్‌ఎస్ఎస్, బీజేపీ అంతిమ లక్ష్యం హిందూ రాష్ట్రంగా దేశాన్ని ప్రకటించేందుకే పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనను ఆయుధంగా మలుచుకుంటున్నదని హెచ్చరించారు. గత ఎన్నికల్లో 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మార్చాలని ఆశించిందని గుర్తుచేశారు. ఇందుకోసం పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజార్టీ అవసరమనీ, అందుకోసమే ఉత్తరాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల పెంపునకు ప్రయత్నిస్తున్నదని తెలిపారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల ప్రజాస్వామిక ప్రాతినిథ్యాన్ని నెమ్మదిగా తగ్గించాలనే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని ఎదుర్కొనేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, విద్యావంతులు, సమాజ బలగాలు అన్నీ కలిసి పోరాటం చేయాలని సూచించారు. టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మతం పేరుతో శాశ్వతంగా రాజకీయాల్లో ఉండాలని బీజేపీ ప్రయత్నిస్తున్నదనీ, దాన్ని అడ్డుకునేందుకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎంతకైనా పోరాడుతామని హెచ్చరించారు. దక్షిణాది రాష్ట్రాలకు 35 శాతం అధికంగా నియోజకవర్గాలను కేటాయించాలనీ, లేదా 25 ఏండ్ల పాటు పునర్విభజనను వాయిదా వేయాలని కోరారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్విభజనను శాస్త్రీయ పద్ధతిన చేపట్టాలని కోరారు. దక్షిణాదికి నష్టం జరగకుండా చూడాలని ఆకాంక్షించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్యపద్మ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా, నియంతత్వంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సుధాకర్, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జీలకర శ్రీనివాస్, సీపీఐ(ఎం.ఎల్.)న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్, దళిత బహుజన ఫ్రంట్ నాయకులు కొరివి వినయ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, టీజేఎస్ పార్టీ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు, అంబటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు ధర్మార్జున్, బైరి రమేష్, పల్లె వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉసురుతీస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

వారిలో ఇది సుమారు 72 శాతం. అదే ఏడాది 4,234 మంది (28 శాతం) మహిళలు ఆత్మహత్య చేసుకున్నారు. అనారోగ్య సమస్యలతో మహిళలు ఆత్మహత్య చేసుకుంటు న్నప్పటికీ వాటిని ప్రమాదాలుగానో లేదా సహజ మరణాలుగానో చూపుతున్నారని 'ఇండియా స్పెండ్' అనే సంస్థ నివేదిక తెలిపింది. 2021లో ఆత్మహత్య చేసుకున్న మహిళలలో సగానికి పైగా గృహిణులే. 26 శాతం మంది విషం తీసుకొని చనిపోయారు. చట్టపరమైన లేదా సామాజిక ఒత్తిడులు, వరకట్న సంబంధమైన ఆరోపణల భయం కారణంగా అనేక కుటుంబాలు వీటిని ఆత్మహత్యలుగా చెప్పేందుకు వెనకడుగు వేస్తున్నాయి.

టెలీ-మానస్ ద్వారా కౌన్సిలింగ్

2022 అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం నేషనల్ టెలీ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ (ఎన్‌టీఎంహెచ్‌పీ)ని ప్రకటించింది. దీనినే టెలీ-మానస్ అంటున్నారు. దీని ద్వారా మానసిక ఆరోగ్య సమస్యలతో బాధ పడేవారికి కౌన్సిలింగ్ ఇస్తారు. ఈ సేవలు 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని 53 కేంద్రాల ద్వారా 20 భాషలలో అందుబాటులో ఉంటాయి. గత మూడు సంవత్సరాలలో కేంద్రం దీని విస్తరణ, నిర్వహణ కోసం రూ.363 కోట్లు కేటాయించింది.

వీరిలోనే అధికం


2022లో వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకున్న వారిలో 18-30 సంవత్సరాల మధ్య వయస్కులు అధిక సంఖ్యలో (59,108) ఉన్నారు. తర్వాతి స్థానంలో 30-45 సంవత్సరాల మధ్య వయసున్న వారు 54,351 మంది ఉన్నారు. ఆ ఏడాది ఆత్మహత్య చేసుకున్న ప్రతి ముగ్గురిలో ఇద్దరు ఈ రెండు గ్రూపులకూ చెందిన వారే కావడం గమనార్హం. 18-30 సంవత్సరాల వారు విద్యాపరమైన ఒత్తిడి, ఉద్యోగ అనిశ్చితి, నిద్రలేమి కారణంగా తీవ్ర నిరాశకు లోనవుతారని మానసిక ఆరోగ్య నిపుణుడు రౌత్ తెలిపారు. ముఖ్యంగా యువత నిరాశానిస్పృహలకు గురవడం చాలా తేలిక అని, తమకు తెలియకుండానే వారు ఆ స్థితిలోని వెళతారని ఆయన చెప్పారు. మానసిక ఆరోగ్య సమస్యలను తొలగించే విషయంపై తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని 2024-25 ఆర్థిక సర్వే సూచించింది. ఆర్థిక పరమైన ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో 53.05 శాతం మంది 20-24, 25-29, 30-34 వయో గ్రూపుల వారేనని ఓ అధ్యయనం చెబుతోంది.

కల్తీకల్లుకు బానిసై వింత చేష్టలు

- 20 మందికి పైగా ఆస్పత్రి పాలు
- ముగ్గురి పరిస్థితి విషమం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల్లో కల్తీకల్లు తాగి ప్రజలు వింత చేష్టలు చేస్తూ ఆస్పత్రి పాలయ్యారు. ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. రైతులు, కూలీలు కల్లుకు బానిసై కల్తీకల్లు తాగి ఆస్పత్రి పాలైనా అధికారులు, పాలకనేతలు పట్టించుకోవడం లేదని, కనీసం వారిపై చర్యలు తీసుకోకపోవడం ఏమిటని బాధిత కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని బీర్కూర్ మండలం దామరంచ, రైతునగర్ గ్రామాలకు చెందిన ఎనిమిది మంది దామరంచ గ్రామంలోని కల్లు దుకాణంలో కల్లు తాగి వింత చేష్టలు చేయడంతో పాటు కేకలు, చిందులు వేస్తూ కిందపడిపోయారు. దాంతో స్థానికులు 108కు ఫోన్ చేసి ఆస్పత్రికి తరలించారు. అలాగే నసురుల్లాబాద్ మండలం అంకోల్ తండాలో ఇద్దరు, దుర్కి గ్రామానికి చెందిన ఐదుగురు వింత చేష్టలు చేయడంతో బాన్సువాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇందులో ముగ్గురు పరిస్థితి విషమించడంతో నిజామాబాద్ జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే కల్లులో మత్తు పదార్థాల మోతాదు పెరగడం, తగ్గడంతో గ్రామాల్లో అటూ ఇటూ తిరుగుతూ పిచ్చిగా అరవడం, కేకలు, చిందులు వేసినట్టు తెలుస్తోంది.



మోతాదుకు మించి మత్తుమందు..?

బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్ మండలంలోని రైతునగర్, దామరంచ, నసురుల్లాబాద్ మండలంలోని అంకోల్, అంకోల్ తండా, దుర్కి గ్రామాలకు కల్లు సరఫరా చేసే ఓ ముస్తేదర్‌కు అధికారుల, రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా కల్లు వ్యాపారం కొనసాగుతోంది. ఓ వైపు అధికారులు కల్తీకల్లు, మత్తుమందు నిషేధం కోసం దాడులు నిర్వహిస్తున్నప్పటికీ, నసురుల్లాబాద్ మండలంలో కొందరు ముస్తేదారులు రాజకీయ నాయకుల అండదండలు చూసుకొని వారికి ఇష్టం వచ్చినట్టు కల్తీకల్లు సరఫరా చేస్తున్నట్టు అధికార సిబ్బందే చెప్పుకొస్తున్నారు. గ్రామీణ ప్రాంత కూలీలు ప్రతి రోజు పని ముగించుకొని సాయంత్రం ఒక సీసా కల్లు తాగడం అలవాటు. పేదల కష్టాన్ని ఆసరా చేసుకుని కల్తీకల్లు విక్రయించడం, అందులో మత్తు పదార్థాల మోతాదు పెంచడం, తగ్గడంతో మనిషి ప్రవర్తనలో మార్పు వస్తుందని వైద్యులు చెబుతున్నారు. కల్తీకల్లు, అధిక మత్తు పదార్థాలు కలపడం వల్ల ఇలా జరిగిందంటూ గ్రామస్తులు అధికారులను ప్రశ్నించగా.. 'కల్తీకల్లు లేదు. మత్తు పదార్థాలు లేవు. వడదెబ్బతో ఇలా జరిగింది.' అంటూ ఎక్సైజ్ అధికారులు దాటవేసినట్టు ప్రజలు తెలిపారు.

బాధితులను పరామర్శించిన సబ్ కలెక్టర్..

బాన్సువాడ డివిజన్ పరిధిలోని నసురుల్లాబాద్, బీర్కూర్ మండలంలో కల్తీకల్లుకు బానిసై వింత చేష్టలు చేస్తూ ఆస్పత్రి పాలైన బాధితులను బాన్సువాడ సబ్ కలెక్టర్ పరామర్శించారు. బాధితులందరికీ మెరుగైన చికిత్స అందించాలంటూ వైద్య సిబ్బందిని ఆదేశించారు.

భవిష్యత్ ఏఐదే

- ఎమర్జింగ్ టెక్నాలజీ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం : ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భవిష్యత్ అంతా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌దేనని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కాన్సులేట్ జనరల్ ఆఫ్ సింగపూర్ 'ఎడ్గర్ పాంగ్' నేతృత్వంలో ఆ దేశ ప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. 'ఎమర్జింగ్ టెక్నాలజీస్' కు హబ్ గా తెలంగాణను మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు వారికి వివరించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం నుంచి రెండు లక్షల మంది ఏఐ ఇంజినీర్లను తయారు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేయబోతున్న ఏఐ యూనివర్సిటీ గురించి వారికి వివరించారు. ఫ్యూచర్ సిటీలో భాగస్వామ్యమయ్యేందుకు అనేక అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చాయని పేర్కొన్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ)కు హబ్‌గా హైదరాబాద్ మారుతుందన్నారు. ఏడాది వ్యవధిలోనే ఐటీ, హాస్పిటాలిటీ, ఇతర రంగాలకు చెందిన 70 జీసీసీలు ప్రారంభమయ్యాయని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటును ఒక్క హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా వరంగల్, కరీంనగర్ లాంటి టూటైర్ నగరాలకు విస్తరించేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలపై స్థానిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలని ప్రతినిధుల బృందాన్ని మంత్రి కోరారు. టెక్నాలజీ, స్కిల్ డెవలెప్ మెంట్, ఇతర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో కాన్సూల్ వైష్ణవి వాసుదేవన్, ఫస్ట్ సెక్రటరీ(ఎకానమిక్) వివేక్ రఘు రామన్, ఎంటర్ ప్రైజ్ సింగపూర్ రీజినల్ డైరెక్టర్(ఇండియా సౌత్) డేనిస్ టాం తదితరులు పాల్గొన్నారు.

సివిల్ కేసులను

క్రిమినల్ కేసులుగా ఎలా మారుస్తారు !

(మొదటిపేజీ తరువాయి)

సివిల్ వివాదాలు క్రిమినల్ కేసులుగా మారిపోతున్నాయి. ఇది చాలా అసంబద్ధం. సివిల్ అంశాలపై తలెత్తిన వివాదాలను నేరాలుగా మార్చరాదు. ఉత్తరప్రదేశ్‌లో చట్టబద్ధ పాలన పూర్తిగా ధ్వంసమైంది. సివిల్ అంశాన్ని క్రిమినల్ కేసుగా మార్చడాన్ని ఆమోదించేది లేదు." అని చీఫ్ జస్టిస్ ఖన్నా వ్యాఖ్యానించారు. దేబూ సింగ్, దీపక్ సింగ్ అనే ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఖన్నా నేతృత్వంలో బెంచ్ విచారణ సందర్భంగా ఖన్నా ఈ వ్యాఖ్యలు చేశారు. తమపై నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేయడానికి నిరాకరిస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆ ఇద్దరు సుప్రీంను ఆశ్రయించారు. వారిద్దరు చెక్ బౌన్స్ కేసును ఎదుర్కొంటున్నారు. కానీ అకస్మాత్తుగా వారిపై క్రిమినల్ నేరాలకు చార్జిషీట్‌ను తెరిచినట్టు తెలుసుకున్నారు. విశ్వాస ఉల్లంఘన, బెదిరింపులు, క్రిమినల్ కుట్ర వంటి ఆరోపణలను కూడా ఎదుర్కొన్నారు. సివిల్ వివాదాలను పరిష్కరించడానికి దీర్ఘకాలం పడుతున్నందున సత్వర పరిష్కారం కోసం కుట్రతో క్రిమినల్ కేసులుగా నమోదు చేస్తున్నారని వారి తరపు న్యాయవాది పేర్కొన్నారు. వారిద్దరిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్‌పై బెంచ్ స్టే ఇచ్చింది. అయితే చెక్ బౌన్స్‌కేసు వారిపై కొనసాగుతుందని తెలిపింది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారి విచారణ సందర్భంగా బోనులో నిలబడి తన చర్యను వివరించాల్సి వుందని, చెక్ బౌన్స్ కేసును ఎలా క్రిమినల్ కేసుగా మార్చారో చెప్పాలని చీఫ్ జస్టిస్ పేర్కొన్నారు. తద్వారా ఆ అధికారి గుణపాఠం నేర్చుకోవాలన్నారు. చార్జిషీట్‌లను దాఖలు చేయాల్సిన పద్ధతి ఇది కాదని తెలుసుకోవాలన్నారు. యుపిలో ఇలాంటి సంఘటనలు రోజు రోజుకు జరగడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. సివిల్ జ్యూరిస్‌డిక్షన్ కూడా వుందని లాయర్లు మర్చిపోతున్నారని చీఫ్ జస్టిస్ వ్యాఖ్యానించారు. రెండు వారాల్లోగా అఫిడవిట్లు దాఖలు చేయాల్సిందిగా డిజిపిని, దర్యాప్తు అధికారిని కోర్టు ఆదేశించింది. ఇద్దరు వ్యక్తులపై సివిల్ వివాదంలోకి క్రిమినల్ చట్టాన్ని తీసుకు రావడానికి కారణాలు చెప్పాలని కోరింది. ఈ కేసుపై విచారణను మే 5న వాయిదా వేసింది.

12 శాతం మంది మాత్రమే

(మొదటిపేజీ తరువాయి)

స్వల్పంగానే ఉన్నది. 12 శాతం మంది మాత్రమే తమ వివరాలను బహిర్గతం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 25 హైకోర్టులలో 769 మంది జడ్జీలు ఉన్నారు. వీరిలో 95 మంది మాత్రమే, అంటే 12.35 శాతం మంది తమ ఆస్తులు, అప్పుల వివరాలను తమ అధికారిక వెబ్‌సైట్‌లలో బహిర్గతం చేయటానికి నిర్ణయించుకున్నారు. ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో కాలిన నోట్ల కట్టలు భారీ మొత్తంలో బయటపడటం భారత న్యాయవ్యవస్థలో పారదర్శకతపై చర్చలు తీవ్రమయ్యాయి. ఈ అంశం భారత ఉన్నత న్యాయవ్యవస్థలోని జడ్జిల ఆస్తుల బహిర్గతం అంశం తెర మీదకు వచ్చింది. దీనికి స్పందనగా సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో తమ ఆస్తుల వివరాలను బహిర్గతం చేయటం కోసం ఈనెల 1న ఫుల్ కోర్ట్ మీటింగ్‌లో సుప్రీంకోర్టు 33 మంది జడ్జిలందరూ ఒప్పుకున్నారు. ప్రస్తుతం ఆరు హైకోర్టులకు చెందిన జడ్జిలు తమ ఆస్తుల వివరాలు ప్రకటించారు. ఇందులో అత్యధికంగా కేరళ హైకోర్టు నుంచి ఉన్నారు. ఈ హైకోర్టుకు చెందిన 44 జడ్జిలలో 41 మంది (93.18 శాతం) తమ ఆస్తుల వివరాలను వెల్లడించారు. ఆ తర్వాత స్థానంలో హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ఉన్నది. ఇక్కడ 12 మందిలో 11 మంది జడ్జిలు (91.66 శాతం) ఆస్తుల వివరాలను ప్రకటించారు. ఇందుకు విరుద్ధంగా కొన్ని హైకోర్టులలో ఆస్తులను వెల్లడించిన రేటు గణనీయంగా తక్కువగా ఉన్నది. ఛత్తీస్‌గఢ్ హైకోర్టులోని 16 మంది జడ్జిలలో ఒక్కరు మాత్రమే ఆస్తుల వివరాలను వెల్లడించారు. మద్రాసు హైకోర్టులో 65 మందికి గానూ ఐదుగురే వివరాలు బహిర్గతపర్చారు. ఇక ఢిల్లీ హైకోర్టుకు చెందిన 38 మంది జడ్జిలలో ఏడుగురు మాత్రమే సమాచారాన్ని వెల్లడించారు. 2018తో పోలిస్తే ఇది చాలా తక్కువ. అప్పుడు 35 మంది జడ్జిలకు గానూ 29 మంది తమ ఆస్తుల వివరాలను ప్రకటించారు. ఇక ప్రస్తుతం సుప్రీంకోర్టులోని 33 మంది సర్వింగ్ జడ్జిలలో ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సంజీవ్ ఖన్నాతో కలుపుకొని 30 మంది తమ ఆస్తుల డిక్లరేషన్‌ను అందించినట్టు అధికారిక వెబ్‌సైట్ చూపెడుతున్నది. అయితే, సాంకేతిక సమస్యలు క్లియర్ అయ్యాక వారి డిక్లరేషన్లు కనబడనున్నాయి.

సుప్రీం నిర్ణయం తర్వాతే విచారణ

కంచ గచ్చిబౌలి భూములపై హైకోర్టు స్పష్టీకరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై సుప్రీం కోర్టు విచారణలో ఉన్నందున తాము విచారణ చేయడం సబబు కాదని హైకోర్టు పేర్కొంది. సుప్రీం కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున అక్కడ నిర్ణయం వెలువడిన తర్వాతే తాము విచారణ చేపడతామని స్పష్టం చేసింది. దీంతో విచారణను ఈనెల 24కి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. ఈలోగా ప్రభుత్వంతోపాటు ప్రతివాదులు కౌంటర్లు దాఖలు చేయాలని కోరింది. కంచ గచ్చిబౌలి సర్వే నెంబర్ 25లో 400 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వ జీవో 54ను సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన వాటా ఫౌండేషన్, కె బాబూరావు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల యూనియన్‌లు, తాజాగా ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఏ పాల్ వేసిన పిల్స్‌ను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ యారా రేణుకలతో కూడిన బెంచ్ సోమవారం విచారించింది. వారి తరపున న్యాయవాది వాదిస్తూ, సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందనీ, ఈ వ్యవహారం ప్రస్తుతం సుప్రీం కోర్టు విచారణ చేపట్టినందున ఇక్కడి కేసు విచారణను వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అటవీశాఖ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి వాదనలు వినిపిస్తూ భూకేటాయింపును వ్యతిరేకిస్తున్న వాళ్లు నెమళ్లు, జింకలు పారిపోతున్నట్టు ఫేక్ వీడియోలు, ఫొటోలను సృష్టించి తప్పుడు ప్రచారం చేసిన ఘటనపై పోలీసులతో దర్యాప్తు చేయించి ప్రాథమిక నివేదిక తెప్పించుకోవాలని సూచించారు. సుప్రీం కోర్టు విచారణ నేపథ్యంలో ఉత్తర్వులు ఇవ్వమన్న కారణంగా హైకోర్టు విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది.

ఫోన్‌ట్యాపింగ్ కేసులో కీలక సూత్రధారి ప్రభాకర్‌రావే : హైకోర్టులో పోలీసులు కౌంటర్

ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు టి ప్రభాకర్‌రావు కీలక సూత్రధారి అని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతిపక్ష నేతలు, వాళ్ల కుటుంబ సభ్యులు, జర్నలిస్టులు, హైకోర్టు జడ్జీలు, న్యాయాధికారులు, వ్యాపారులు, అధికారులు, ఇతరులకు చెందిన ఫోన్లపై అనధికారిక నిఘా పెట్టి ఫోన్ ట్యాపింగ్ చేయించారని పోలీసులు తెలిపారు. ఫోన్‌ట్యాపింగ్ కేసును కొట్టేయాలనీ, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ ప్రధాన నిందితుడైన టి ప్రభాకర్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జె శ్రీనివాసరావు సోమవారం విచారణ చేపట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదిస్తూ, ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే కీలక ఆధారాలైన హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేయించారనీ, ఎఫ్ఐఆర్ దాఖలు అవ్వగానే అమెరికా పారిపోయారనీ, ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని కోరారు. అనారోగ్యమంటూ ఇప్పుడు చెబుతున్న ప్రభాకర్‌రావు రెండుసార్లు సర్వీస్ పొడిగింపులో విధులు నిర్వహించారని వివరించారు. ఉద్యోగ విరమణ చేసినా ఐపీఎస్ క్యాడర్ నిబంధనలకు విరుద్ధంగా రెండుసార్లు సర్వీసు పొడిగింపుతోపాటు కీలకమైన నిఘా విభాగానికి అర్నెల్లు ఇన్‌ఛార్జిగా పూర్తి బాధ్యతలను నిర్వహించారని తెలిపారు. హైదరాబాద్ వదిలే ముందే ఇంటిలో ఎలాంటి ఆధారాలు లభించకుండా చేయడంతో సోదాలు నిర్వహించినా అవి లభించలేదన్నారు. పిటిషనర్ తరపు న్యాయవాది సమాధానం కోసం హైకోర్టు విచారణను ఈనెల 15వ తేదీకి వాయిదా వేసింది.

దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్లపై నేడు తీర్పు

దిల్‌షుక్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో మంగళవారం హైకోర్టు తీర్పు వెలువరించనుంది. 2013 ఫిబ్రవరి 21న బస్టాప్‌లోను, మిర్చిపాయింట్ దగ్గర రెండు పేలుళ్ల ఘటనలు జరిగాయి. 18 మంది చనిపోగా, 131 మంది గాయపడ్డారు. ఈ కేసులో ఎన్ఐఏ కోర్టు ఐదుగురికి ఉరిశిక్ష విధిస్తూ 2016 డిసెంబరు 13న తీర్పు చెప్పింది. ఏ1 మహమ్మద్ రియాజ్ అలియాస్ రియాజ్ భత్కల్ పరారీలో ఉన్నారు. అసదుల్లా అక్తర్, జియా ఉర్ రహమాన్, మహ్మద్ తహసీన్ అక్తర్, మహమ్మద్ అహ్మద్ సిద్ధి, అజాజ్ షేక్‌లకు మరణ శిక్ష విధించింది. దీన్ని నిర్ధారించే నిమిత్తం ఈ వ్యవహారం హైకోర్టుకు చేరింది. ఐదుగురు కూడా అప్పీల్ దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కె లక్ష్మణ్, జస్టిస్ పి శ్రీసుధలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం తీర్పు చెప్పనుంది.

అశ్రునయనాల మధ్య గోపాల్‌రావు అంత్యక్రియలు

అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన కార్మికులు, నేతలు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ఏఐడీఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి జి.టి.గోపాల్‌రావు అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య ముగిశాయి. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామం నుంచి బడంగ్‌పేట్ శ్మశానవాటిక వరకు సాగిన అంతిమయాత్రకు వివిధ కార్మిక సంఘాల నేతలు, కార్మికులు తరలివచ్చారు. అమర్ రహే కామ్రేడ్ జి.టి.గోపాల్‌రావు అంటూ నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం శ్మశానవాటికలో గోపాల్‌రావు పెద్ద కుమారుడు జి.టి.వాసు చేతుల మీదుగా అంత్యక్రియలు జరిగాయి.

అంతకుముందు గోపాల్‌రావు మృతదేహానికి నాదర్‌గుల్ గ్రామంలోని ఆయన పెద్ద కుమారుడు ఇంటి వద్ద పలువురు నాయకులు నివాళ్లర్పించారు. సీపీఐ(ఎం), సీఐటీయూ, బీడీఎల్, డీఎల్ఆర్ఎల్, డీఆర్‌డీఓ ఏఐడీఈఎఫ్, టాప్రా, ఏఐడీఎఫ్, టీయూడబ్ల్యూఎఫ్ జర్నలిస్టు సంఘం నాయకులు నివాళులర్పించారు. ఆయన జీవిత కాలమంతా ఉద్యోగుల, కార్మిక సంఘాల సమస్యల పరిష్కారం పోరాటం చేసిన గొప్ప నాయకుడని వారు కొనియాడారు. ఆయన మరణం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యమానికి ముఖ్యంగా రక్షణ రంగానికి పెద్ద నష్టమన్నారు. అంతిమయాత్రలో సీపీఐ(ఎం) సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల కార్యదర్శులు జయరాజ్, యాదయ్య సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఆఫీస్ బేరర్లు జె.వెంకటేష్, జె.మల్లికార్జున్, ఎం.పద్మశ్రీ, కూరపాటి రమేష్, బీరం మల్లేష్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, హైదరాబాద్ సౌత్ జోన్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రావణ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, నాయకులు తిరుపతయ్య, వై.సుబ్బారావు, టప్రా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎం.ఎస్.రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, హైదరాబాద్ అధ్యక్షులు పి.శివలింగం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై 12న మంత్రివర్గ ఉపసంఘం సమావేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న 57 సమస్యల పరిష్కారం కోసం రూపొందించిన కార్యాచరణతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను సోమవారం హైదరాబాద్‌లో ఉద్యోగ జేఏసీ నేతలు కలిసి వివరించారు. సమస్యల పరిష్కారం కోసం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశాన్ని వెంటనే నిర్వహించి సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఉపముఖ్యమంత్రి భట్టి ఈనెల 12న మధ్యాహ్నం 12 గంటలకు ఉద్యోగ జేఏసీతో మంత్రివర్గ ఉపసంఘం సమావేశాన్ని నిర్వహించేందుకు అంగీకరించారు. ఈ సమావేశంలో చర్చించి ఉద్యోగుల సమస్యలతో పాటు తహసీల్దార్లు, ఎంపీడీవోల తిరుగు బదిలీల విషయాన్ని పరిష్కరించడం చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, కో చైర్మెన్ వంగా రవీందర్ రెడ్డి, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్, టీజీవో ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ, నాయకులు పరమేశ్వర్ రెడ్డి, కృష్ణ యాదవ్, జ్ఞానేశ్వర్, రామారావు, శ్రీరామ్ రెడ్డి, రాజ్‌కుమార్, రమన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టెరాయిడ్ ఇంజెక్షన్ల విక్రయాలు

రూ.1,80,000 విలువగల ఇంజెక్షన్స్, మాత్రలు స్వాధీనం

ముగ్గురు నిందితుల అరెస్ట్



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, మాత్రలను అక్రమంగా విక్రయిస్తున్న ముగ్గురిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,80,000 విలువగల ఇంజెక్షన్స్, మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం అదనపు డీసీపీ ఏ.శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. యాకుత్‌పురాకు చెందిన ఎండీ నజీర్ సప్లిమెంట్ స్టోర్ వ్యాపారం చేస్తున్నాడు. గౌలిపురాకు చెందిన ఆర్.సంజీవ్, హకీంపేట్‌కు చెందిన ఇమ్రాన్‌ఖాన్‌తో కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. సులువుగా డబ్బులు సంపాదించాలని స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, మాత్రలను జిమ్‌లకు, తెలిసిన వారికి, మార్కెట్‌లో కావాల్సిన వారికి సప్లయ్ చేస్తున్నారు. సమాచారం అందుకున్న సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక నిఘా వేసి ముగ్గురిని అరెస్టు చేశారు. స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, మాత్రలు డాక్టర్ల ప్రిస్క్రిప్షన్స్ మేరకు విక్రయించాలని, అయితే ఈ ముఠా అక్రమంగా విక్రయిస్తోందని అదనపు డీసీపీ తెలిపారు.

2024-25 లిక్కర్ సేల్స్ రూ.34,600 కోట్లు

2023-24లో రూ.34,800 కోట్లు

గతేడాదితో పోల్చితే పెరగని అమ్మకాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 34,600 కోట్లు మద్యం ద్వారా ఆర్జించింది. ఈ మేరకు ఆబ్కారీ శాఖ రాష్ట్ర వార్షిక గణాంకాలు విడుదల చేసింది. గతేడాది మద్యం ద్వారా రూ.34,800 కోట్ల అమ్మకాలు జరిపింది. అయితే 2023-24లో కొత్త మద్యం దుకాణాల కోసం దరఖాస్తుల రూపంలో వచ్చిన రూ.264.50 కోట్ల ఆదాయన్ని మినహాయిస్తే, 2024-25లో ఏడు శాతం అమ్మకాలు పెరిగాయని పేర్కొంది. ఇందులో పన్నుల రూపంలో రూ.7,000 కోట్లు వచ్చాయని తెలిపింది.

2023-24లో 548 లక్షల కేసుల బీర్లు, 262 లక్షల కేసుల లిక్కర్ అమ్మకాలు జరగగా, 2024-25లో 531 లక్షల కేసుల బీర్లు, 369 కేసుల లిక్కర్ అమ్మకాలు జరిగాయని గణాంకాలు తెలిపాయి. గతేడాది కంటే 3 శాతం బీర్ల అమ్మకాలు తగ్గగా, రెండు శాతం లిక్కర్ అమ్మకాలు పెరిగాయని ఆబ్కారీ శాఖ పేర్కొంది. 15 రోజుల పాటు బీర్ల సరఫరా నిలిపివేయడం, ధరలు పెంచడంతో అమ్మకాలు తగ్గాయని తెలిపింది.

సిరిసిల్లలో నేత కార్మికుల 24గంటల దీక్ష

నేతన్నలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు టి.స్కైలాబ్ బాబు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / సిరిసిల్ల టౌన్

సిరిసిల్లలో ప్రభుత్వ చీరల ఆర్డర్‌కు సంబంధించి పవర్‌లూమ్, వార్పిన్, వైపని కార్మికులకు మెరుగైన వేతనాలు వచ్చే విధంగా ప్రభుత్వమే కూలి నిర్ణయించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఏప్రిల్ 1 నుంచి చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద నేతన్నలు 24గంటల దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. సిరిసిల్ల నేతన్నల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలి.. సమస్యలను పరిష్కరించి సమ్మె విరమింపజేయాలి.. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి మత విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప కార్మికుల సమస్యలు పట్టవా..' అని ప్రశ్నించారు. పవర్‌లూమ్ కార్మికులకు కనీస వేతనం లేదని, విద్యుత్ సరఫరా అంతరాయం కాకుండా చూడటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నేతన్నలు కుటుంబాలను పోషించుకోలేని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆర్డర్ చీరలకు సంబంధించి పవర్‌లూమ్, వార్పిన్, వైపని కార్మికులకు మెరుగైన వేతనాలు వచ్చే విధంగా ప్రభుత్వమే కూలి నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పాలిస్టర్ వస్త్రానికి కార్మికులకు కూలి ఒప్పందం ప్రకారం చెల్లించాలని, 2023 బతుకమ్మ చీరల 10 శాతం యారన్ సబ్సిడీని వెంటనే అందించాలని అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రధానమంత్రి మోడీతో మాట్లాడి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, నేతన్నల ఉపాధి, సంక్షేమం కోసం పనిచేయాలని హితవు పలికారు.

దీక్ష ప్రారంభం మాత్రమే.. : నేతలు

'మీ పోరాటం వృథా కాదు, ఈ దీక్ష ఒక ప్రారంభం మాత్రమే.. మనం ఏకమైతే, ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి మన హక్కులను సాధించుకోవచ్చు.. మేము మీతో ఉన్నాము. ఈ ఉద్యమం ఆగదు' అని నేతలు చెప్పారు. దీక్షలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎం.రమేష్, నాయకులు కోడం రమణ, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, నక్క దేవదాస్, ఉడుత రవి, ఎలిగేటి శ్రీనివాస్, గుండు రమేష్, బూట్ల వెంకటేశ్వర్లు, అవధూత హరిదాస్, బాస శ్రీధర్, మేకల బాలరాజు, కస్తూరి సతీష్ కూర్చున్నారు. దీక్షకు జిందం చక్రపాణి, పలువురు బీఆర్ఎస్ నాయకులు, బీఎస్పీ పట్టణ అధ్యక్షులు ఆరుకాల రమేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

గిరిజన సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి గృహనిర్బంధం



- ప్రజల పక్షాన పోరాడే వారిని నిర్బంధించి ఉద్యమాలు ఆపలేరు : జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం
- చలో హైదరాబాద్ గిరిజన సంక్షేమ భవన్ ముట్టడికి వెళ్లనీయకుండా ముందస్తు చర్యలు
- అక్రమ అరెస్టులను ఖండించిన సీపీఐ(ఎం) నేతలు

నవతెలంగాణ-వైరాటౌన్

ప్రజల పక్షాన పోరాడే వారిని నిర్బంధించి ప్రజా ఉద్యమాలను ఆపలేరని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. గిరిజన ట్రైకర్ రుణాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చలో గిరిజన సంక్షేమ భవన్, హైదరాబాద్ ముట్టడి పిలుపునిచ్చింది. దాంతో హైదరాబాద్‌కు వెళ్లాల్సిన భూక్యా వీరభద్రంను వైరా పోలీసులు సోమవారం తెల్లవారుజాము నుంచి గృహ నిర్బంధం చేసి అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ.. మూడేండ్ల కింద 30 వేలమంది గిరిజనులకు మంజూరైన రూ.219 కోట్ల ట్రైకార్ రుణాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసిందన్నారు. ఈ చర్య ద్వారా గిరిజన నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టారన్నారు. ఇందుకు నిరసనగా తలపెట్టిన చలో హైదరాబాద్ ప్రయత్నాన్ని ఆపేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసులనుపయోగించి అక్రమంగా గృహనిర్బంధం చేసి అరెస్ట్ చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజల పక్షాన పోరాడే వాళ్లను రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా అడ్డుకోవడం, నిర్బంధం ప్రయోగించడం ఏమాత్రం మంచిది కాదన్నారు. ఎన్నికల సందర్భంగా ఆరు గ్యారంటీలతో పాటు ఏడో గ్యారంటీ ప్రజాస్వామ్యం కాపాడుతామని ఇచ్చిన మాటను నిర్బంధాల ద్వారా తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. ప్రజా ఉద్యమాలను, పోరాటాలను, అరెస్టులు, నిర్బంధాలతో అడ్డుకోలేరని, ప్రభుత్వంలో మార్పు రాకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. భూక్య వీరభద్రంను అక్రమ అరెస్టు, గృహనిర్బంధం చేయడాన్ని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా టౌన్, రూరల్ కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, బాణాల శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న భూక్యా వీరభద్రంను పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా పట్టణ నాయకులు గుడిమెట్ల మోహన్ రావు, అమరనేని కృష్ణ సందర్శించి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై ఆయన్ను విడుదల చేశారు.

అభాగ్యుల అభ్యున్నతిలో తెలంగాణ రోల్‌మోడల్

సామాజిక న్యాయ సాధన దిశలోనే ప్రతి పైసా ఖర్చు : డెహ్రాడూన్ చింతన్ శివిర్‌లో మంత్రి సీతక్క



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అభాగ్యుల అభ్యున్నతిలో దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ నిలుస్తున్నదనీ, సామాజిక న్యాయ సాధన దిశలోనే ప్రజా ప్రభుత్వం ప్రతి పైసా ఖర్చు చేస్తోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) నొక్కి చెప్పారు. సామాజిక న్యాయం, సాధికారతపై కేంద్ర సామాజిక న్యాయ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ అధ్యక్షతన సోమవారం డెహ్రాడూన్‌లో జరిగిన చింతన్ శివిర్ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. తెలంగాణలో వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం చేస్తున్న కృషిని, పథకాలను వివరించారు.

సామాజిక, ఆర్థిక, రాజకీయ అవకాశాల్లో అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించడమే సామాజిక న్యాయమనీ, ఆ దిశలో రెండు కీలక బిల్లులకు తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీకవంగా ఆమోద ముద్ర వేసిందని తెలిపారు. బీసీ వర్గాలకు జనాభా ప్రాతిపదికన విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లను 42 శాతం వరకు పెంచడంతో పాటు, 30 ఏండ్లుగా పెండింగ్ లో ఉన్న ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించినట్టు వివరించారు. ఆ రెండు బిల్లులు సామాజిక న్యాయ అమలు దిశలో గొప్ప మైలురాయిగా నిలువబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

రేషన్ షాపుల ద్వారా దేశంలోనే పేదలకు సన్న బియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని సభ దృష్టికి తీసుకెళ్లారు. పేదలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రూ.500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తున్న తీరును వివరించారు. 'దళితులు, ఆదివాసీలు, మహిళలు చారిత్రాత్మకంగా అణచివేయబడ్డారు. వివక్షకు వ్యతిరేకంగా చాలా కాలంగా పోరాడుతున్నారు. సీనియర్ సిటిజన్లు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఇప్పటికీ నిర్లక్ష్యానికి గురవుతున్నారు. భారత రాజ్యాంగం ఈ అన్యాయాలను గుర్తించి న్యాయమైన, సమ్మిళిత సమాజం కోసం కృషి చేస్తోంది. అందుకే నిజమైన సామాజిక న్యాయం వైపు సమిష్టిగా కదలడం మన విధి" అని చెప్పారు. తెలంగాణలో రూ. 300 కోట్లతో రాజీవ్ యువ వికాసం ద్వారా 25 వేల మందికి స్వయం ఉపాధి కల్పించబోతున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంతో పాటు ప్రతి రంగంలోనూ దివ్యాంగులకు జనాభా ప్రాతిపదికన నిధులు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. ట్రాన్స్ జెండర్ల సంక్షేమం కోసం ప్రతి జిల్లాలో మైత్రి క్లినిక్ ల ఏర్పాటుతో పాటు 44 మందిని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించామనీ, రూ.2 లక్షల సబ్సిడీతో 72 మందికి ఉపాధి కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ల సాధికార శాఖ జాయింట్ డైరెక్టర్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.



విజయశాంతి



అద్దంకి దయాకర్



శంకర్ నాయక్



నెల్లికంటి సత్యం



ప్రమాణస్వీకారం చేస్తున్న పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కొమురయ్య

కొత్త ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్యే కోటాలో గెలిచిన ఎమ్మెల్సీలతోపాటు ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి విజయం సాధించిన కాంగ్రెస్, బీజేపీ, సీపీఐకి చెందిన ఏడుగురు ఎమ్మెల్సీలు ప్రమాణం స్వీకారం చేశారు. సోమవారం కొత్త ఎమ్మెల్సీలతో శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తన చాంబర్‌లో ప్రమాణం చేయించారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా కాంగ్రెస్ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, నెల్లికంటి సత్యంతో చైర్మెన్ ప్రమాణ స్వీకారం చేయించారు. పీఆర్‌టీయూ నుంచి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి గెలిచిన మల్కా కొమురయ్య, అంజిరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సీపీఐ నుంచి పల్లా వెంకట్‌రెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు, ఉజ్జిని రత్నాకర్‌రావు, వల్లా నర్సింహరెడ్డి, నెల్లికంటి సత్యం భార్య అన్నపూర్ణ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీలు లక్ష్మణ్, రఘునందన్‌రావు తదితరులు ఉన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్సీలకు పలువురు నేతలు అభినందనలు తెలిపారు.



రామయ్యకి పట్టాభిషేకం

- హాజరైన గవర్నర్ జిష్ణుదేవ వర్మ
- స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పణ
- భద్రాద్రిలో మిన్నంటిన రామనామస్మరణలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలోని మిథిలా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన శ్రీరామ పట్టాభిషేకం వేడుక భక్తులను అలరించింది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ వర్మ ఈ మహోత్సవ వేడుకకు హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తొలుత రామాలయ భద్రుని మండపంలో అర్చకులు స్వామివారి పాదుకలకు అభిషేకం జరిపారు. రాజ లాంఛనాలతో పవిత్ర పావన గౌతమీ నదీ తీరం నుంచి తీర్థములు తీసుకొచ్చారు. భాజాభజంత్రీల సందడి, సన్నాయి మేళాలు భక్తుల కోలాటంతో శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని ఊరేగింపుగా తీసుకురాగా.. కళ్యాణ మండపంపై స్వామివారు ఆసీనులయ్యారు. శ్రీరామ నామ స్మరణలతో మిథిలా ప్రాంగణం ప్రతిధ్వనించింది. పట్టాభిషేకం అనంతరం భక్తులపై అర్చక స్వాములు పుణ్య నదీ జలాలను చల్లారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ మహోత్సవాన్ని ఆద్యాంతం తిలకించారు. తొలుత రామాలయంలో స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం, ఇల్లందు ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్, రామాలయం ఈవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో ముఖ్య వేడుకలైన శ్రీ సీతారాముల వారి కళ్యాణం, శ్రీ రామ పట్టాభిషేకానికి దేశ నలుమూలల నుంచి హాజరైన భక్తజనం తీపి జ్ఞాపకాలతో వెనుదిరిగారు. ఈ వేడుకల విజయవంతంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కీలక భూమిక పోషించారు.

మైనర్ ఇరిగేషన్ సీఈగా రఘునాథరావు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

మైనర్ ఇరిగేషన్, కాడా చీఫ్ ఇంజినీర్‌గా సెలవు నుంచి తిరిగొచ్చిన వి. రఘునాథరావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా సోమవారం సర్క్యులర్ జారీ చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఈఎన్సీ జనరల్ అనిల్‌కుమార్‌ను ఆదేశించారు.

14న గిరిజన శక్తి రాజ్యాంగ రక్షణ ర్యాలీ



- గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు డా.వెంకటేష్ చౌహాన్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఈ నెల 14న అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని బషీర్ బాగ్ చౌరస్తా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ట్యాంక్ బండ్, సచివాలయం పక్కన ఉన్న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలు, ప్రజా, విద్యార్థి సంఘాలు, కళాకారులతో భారీ ఎత్తున గిరిజన శక్తి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ రక్షణకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు డా.వెంకటేష్ చౌహాన్ తెలిపారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం నేడు ప్రమాదంలో ఉందని, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పేద, అణగారిన, గిరిజన దళిత బహుజన వర్గాలకు అన్యాయం చేస్తూ భవిష్యత్తులో వారికి రిజర్వేషన్లను లేకుండా చేయాలని కుట్ర చేస్తున్నదన్నారు. అదే విధంగా గిరిజనుల భాషలను గుర్తించకుండా అవమానిస్తుందని, ఎన్నో ఏండ్ల నుంచి బంజారా భాష "గోర్ భోలి"ని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని రక్షించాల్సిన బాధ్యత ఈ దేశంలో ఉండే సబ్బండ వర్గాల ప్రజలపై ఉందన్నారు. ఈ రాజ్యాంగ రక్షణ ర్యాలీ కార్యక్రమానికి వచ్చే ప్రతిఒక్కరు గౌరవప్రదమైన సూటు, కోటు వేసుకుని, రాజ్యాంగాన్ని చేత పట్టుకుని రావాలని ఆయన కోరారు. గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ డా.రాజేష్ నాయక్, గిరిజన శక్తి రాష్ట్ర నాయకులు కార్తీక్ నాయక్, భరత్, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి చిరంజీవి నాయక్, మున్నా నాయక్, శంకర్ నాయక్, శ్రీమన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి

- మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- నాలా నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో నిత్యం ప్రజా సమస్యల పరిష్కారాని తన వంతు కృషి చేస్తున్నానన్నారు. సోమవారం జల్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని నబీల్ కాలనీలో ఉన్న ఎస్ఎన్ డీపీ నాలా నిర్మాణ పనులను స్థానిక కమిషనర్ బి. వెంకట్రాంతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో కోట్లాది రూపాయల నిధులను ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనుల కోసం మంజూరు చేసినట్టు తెలిపారు. నియోజకవర్గంలో నాలా నిర్మాణ పనుల కోసం రూ.850కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. మొదటి విడతలో మంజూరైన నిధులతో దాదాపు పనులు పూర్తి కావటం జరిగిందని, ఇంకా రెండో విడుతలో విడుదలైన నిధులతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. రానున్న వర్షా కాలం లోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న కొత్తపేట్ ప్రధాన రహదారి సుల్తాన్ మెడికల్ హాల్ పక్కన బీఆర్ ఎస్ జల్ పల్లి మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు అబ్దుల్లా బిన్ గాలిబ్ నూతనంగా నిర్మించిన బిన్ గాలిబ్ స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈ అయేషా, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు ఖైసర్ బాం, మాజీ కౌన్సిలర్ పల్లపు శంకర్, షేక్ హమీద అఫ్జల్, బీఆర్ఎస్ మున్సిపల్ వర్కింగ్ ప్రసిడెంట్,మాజీ ఎంపీటీసీ జనార్ధన్, యూత్ అధ్యక్షులు యంజాల అర్జున్,అబ్దుల్లా గాలిబ్, నిరంజన్ పటేల్, పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలను ప్రజలకు అందించడమే ధ్యేయం

- రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుతాం
- మంత్రి దుద్దిళ్ల శధర్ బాబు
- రూ. 110 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి.





నవతెలంగాణ-కొత్తపేట

గోదావరి జలాలు ప్రజలకు అందించాలన్నదే తమ ధ్యేయమేని మంత్రి దుద్దిళ్ల శధర్ బాబు అన్నారు. కొత్తపేట డివిజన్ సప్తగిరి కాలనీలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్ వద్ద కొత్తపేట, చైతన్యపురి, గడ్డి అన్నారం మూడు డివిజన్ల పరిధిలో జరగబోయే రూ. 110 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్రయినేజీల సదుపాయం, తాగునీరు సీసీ రోడ్లు, ప్రజలకు అందిస్తామన్నారు. హెచ్‌సీయూ గురించి న్యాయ స్థానంలో కేసు నడుస్తున్నదన్నారు. తాము న్యాయస్థానాన్ని గౌరవిస్తామని అన్నారు. ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ బలంగా ఉందని రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ నాయి కోటి పవన్ కుమార్, చైతన్యపురి కార్పొరేటర్ రంగ నరసింహ గుప్తా, బీజేపీ నాయకులు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కొంతమంది బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేయడంతోపాటు వాగ్వాదానికి దిగారు. దాంతో పోలీసులు కలుగజేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్, డిప్యూటీ కమిషనర్ సుజాత, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రూ.5.30 కోట్ల వ్యయంతో శంకుస్థాపన

హయత్ నగర్ : మన్సూరాబాద్ డివిజన్ లో వివిధ కాలనీలకు సంబంధించి అభివద్ధి పనులకు మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డితో కలిసి సహారా రోడ్ వివేకానంద మార్గ వద్ద రూ. 5 కోట్ల 30 లక్షల 56 వేల నిధుల వ్యయంతో శంకుస్థాపన చేశారు.

సహారా స్టేట్స్ లోని బాక్స్ డ్రెన్ నాలా నిర్మాణ నిధుల వ్యయం: 199.50 లక్షలు. సెంట్రల్ బ్యాంక్ కాలనీ శివాలయం రోడ్ - సీసీ రోడ్, జడ్జస్ కాలనీ సహారా రెండవ గేట్ రోడ్ భారత్ పెట్రోల్ పంప్ లేన్ నిర్మాణ నిధుల వ్యయం: 86.10 లక్షలు. వివేకానంద నగర్ కాలనీ సీసీ రోడ్ నిర్మాణ నిధుల వ్యయం: 47.50 లక్షలు. జడ్జస్ కాలనీ ఓపెన్ ప్లేస్ అభివృద్ధి పనుల నిధుల వ్యయం: 5.56 లక్షలు. కాస్మోపాలిటన్ కాలనీ ఓపెన్ జిమ్ పార్క్ ప్లేస్ బ్యాలెన్స్ అభివృద్ధి పనుల నిధుల వ్యయం: 7.60 లక్షలు. అనిత నగర్ కాలనీ సంక్షేమ భవన ప్రారంభోత్సవ నిధుల వ్యయం: 34.50 లక్షలు. సీఆర్ ఎన్‌క్లేవ్ కాలనీ సంక్షేమ భవన ప్రారంభోత్సవ నిధుల వ్యయం: 22.00 లక్షలు. ఎల్లా రెడ్డి కాలనీ సీ. సీ రోడ్ నిర్మాణ నిధుల వ్యయం: 39.80 లక్షలు. లక్ష్మీ నగర్ కాలనీలో సీసీ రోడ్డు నిధుల వ్యయం: 25.00 లక్షలు. కామినేని జంక్షన్ అభివద్ధి పనుల నిధుల వ్యయం: 63.00 లక్షలు. మొత్తం ఐదు కోట్ల, 30 లక్షల 56 వేల రూపాయలు. ఈ కార్యక్రమంలో రోడ్డు కార్పొరేషన్ చైర్మెన్ రామ్ రెడ్డి,మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, ఆయా కాలనీల సంక్షేమ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



- నాగోల్ సీఐ సూర్యానాయక్

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారుతాయని నాగోల్ సీ.ఐ సూర్యానాయక్ అన్నారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలం పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ, గౌరెల్లి గ్రామ పరిధిలోని స్వర్ణగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం సీ.ఐ సీ.సీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దేవాలయంతో పాటు భక్తుల భద్రతకు నిఘా నేత్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఆలయానికి వచ్చే మహిళలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అపరిచిత/ అనుమానితా వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాల వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో గుండం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా దేవాలయ అలంకరణ పనులకు దాత బచ్చిరెడ్డి ఐదు లక్షల రూపాయల విలువైన చెక్కును ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నవీన్‌కుమార్, ఎస్సైలు శివనాగ ప్రసాద్, రమేశ్, ఆలయ కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు, వైస్ చైర్మెన్ చెంచల శ్రీనివాస్, డైరెక్టర్లు దివ్యదాసు, రాజు, రాజేశ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల ర్యాలీ



నవతెలంగాణ-బడంగ్‌పేట్

కేంద్ర ప్రభుత్వం ముస్లిం వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ వక్ఫ్ భూములను అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నిస్తున్నదని పలువురు ముస్లిం మత పెద్దలు ఆరోపించారు. పార్లమెంట్‌లో ఆమోదించిన వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా సోమవారం బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షాహీన్ నగర్‌లో శాంతియుతంగా ర్యాలీని షాహీన్ నగర్ నుంచి ఎర్రకుంట చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులపై దాడి చేస్తూ ముస్లింలను భయభ్రాంతులకు గురి చేస్తున్నదన్నారు.కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.దేశవ్యాప్తంగా ముస్లింలు ఏకమై ఈ బిల్లుకు వ్యతిరేకంగా తమ స్వరం వినిపించాలని కోరారు. ఏప్రిల్ 13న హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ర్యాలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ నేతత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ గ్రామంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద జగ్జీవనరామ్ 118వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాకారమైన వేళ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తొలి దశ ఉద్యమకారులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించిందన్నారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన భరత్ భూషణ్ ఐఆర్‌టీసీ రిటైర్డ్ ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రాగడి సత్యం, మద్దిలేటి మాదిగ, శంకర్రావు మనం నరసింహ మాదిగలు పాల్గొన్నారు. బాలాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ తొలిదశ ఉద్యమకారులకు దాదాపు 22 మందికి పూల మాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిమ్మని గిరీష్,బాబు జగ్జీవన్ రాం యువజన సంఘం నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



- వాకింగ్, ఆరోగ్య సూత్రాలను పాటించాలి
- హైదరాబాద్ డీఎంహెచ్ఓ డాక్టర్ జె.వెంకటి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై దష్టి పెట్టాలనీ, మానసిక ఒత్తిళ్లు దరిచేరకుండా వాకింగ్, ఆరోగ్య సూత్రాలను పాటించి ఆరోగ్యకరమైన జీవనాన్ని గడపాలని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.వెంకటి కోరారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాన్ని సోమవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ఉద్యోగస్తులు ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన అలవాట్లను అనుసరించి మానసిక ఒత్తిళ్లు లేకుండా, ప్రశాంతమైన వాతావరణంలో విధులు నిర్వహించడానికి వాకింగ్, యోగ, నిత్య జీవితంలో అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నినాదం 'ఆరోగ్యకరమైన ఆరంభాలు - ఆశాజనక భవితవ్యాలు' అని తెలిపారు. ప్రజా ఆరోగ్యానికి మూల స్తంభం తల్లి బిడ్డ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం అత్యంత అవసరమని తెలిపారు. ఒక శిశువు చక్కటి ఆరోగ్యంతో పుట్టి పెరగడం అనేది ఆయుష్కాలం మొత్తానికి బలమైన పునాది అన్నారు. తల్లుల ఆరోగ్య సంరక్షణ, పోషణ, శిశువు వైద్యం అత్యంత ప్రాముఖ్యమైనదని చెప్పారు. అన్ని సమాజాలకు అవసరమైన ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండి ముఖ్యంగా మాతా శిశు మరణాలు తగ్గించడానికి అందరం నాణ్యమైన సేవలందించాలని కోరారు. నాన్ కమ్యూనికేబుల్ డిసీస్‌పై సిబ్బంది, వైద్యులు దృష్టి పెట్టి సర్వే చేసి సకాలంలో రోగులను గుర్తించి చికిత్స అందించి నాన్ కమ్యూనికేప్ డిసీస్‌ను నియంత్రణకు తోడ్పడాలని సూచించారు. మన ఆరోగ్యం మన సంపద అనీ, అందరితో కలిసి, అందరికీ ఆరోగ్యం అందించడమే మన లక్ష్యం కావాలని కోరారు. మాతా శిశు మరణాలను నివారించేందుకు, వారి ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు బహుముఖ విధానం అవసరమని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడం, ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం, అందుబాటులో అందరికీ ఆరోగ్య కేంద్రాలు, సేవలు ఉండటం వల్ల తల్లీ బిడ్డకు ఏ సమస్య వచ్చినా ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండటం వల్ల మాతా శిశు మరణాలను తగ్గించి సుఖవంతమైన ప్రసవం జరగడానికి, తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడుతుందని చెప్పారు నాణ్యమైన ప్రసవ పూర్వ సేవలు అందించడం వల్ల మరణాలను గణనీయంగా తగ్గించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ శ్రీధర్, ఏఓ డాక్టర్ సాయిబాబా, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ అశ్రితారెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి జక్కుల రాములు, డిప్యూటీ డెమోలు అంజయ్య, నర్సింహ్మ వైద్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో ఆనందంగా జీవించాలని ఉపశమన కేంద్రం



- లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సీఈఓ రెబెకా దావు
- బాటసింగారంలో నిర్మాణ పనుల పరిశీలన

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

వృద్ధాప్యంలో, అనారోగ్యంతో బాధపడుతున్న వారు వారి జీవితంలో ఆనందంగా జీవనం సాగాలని లయన్స్ పావని హాస్పిస్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేసినట్టు లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సీఈఓ రెబేకా దావు అన్నారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలం బాట సింగారంలో లయన్స్ పావని హాస్పస్ ఉపశమన కేంద్రం నిర్మాణ పనులను ట్రస్ట్ సభ్యులతో కలిసి వారు సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చివరి దశ జీవిత అనుభవి స్తున్న వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు మంతన కలిగించడంతోపాటు, విశ్రాంతి జీవితాన్ని అందించడానికి ఉపశమన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నా మన్నారు. మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ప్రకాశ్ రావు ఉపశమన కేంద్రం కోసం ఒక గొప్ప నిర్ణయం తీసుకొని, నిర్మాణ పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల వివరాలను మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ప్రకాశ్ రావు వారికి వివరించారు. శరవేగంగా ప్రాజెక్ట్ పనులను పూర్తి చేసి వచ్చే ఏడాదికల్లా పూర్తి స్థాయి సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేయనున్నట్టు తెలిపారు వృద్ధాప్యంతో, అనారోగ్యంతో ఉన్న వారు సంతో షంగా, సంతృప్తికరంగా జీవనం సాగించడానికి సేవా సంస్థను ముందుకు తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబు రావు, పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్లు సునీల్ కుమార్, విజయ కుమార్ రాజు, లయన్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కళాశాల వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-హయత్ నగర్

హయత్ నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షిక క్రీడా దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 150 మందికి పైగా విద్యార్థులు పాల్గొని 2025 మార్చి 5 నుంచి 18 వరకు నిర్వహించిన ఆటలు, క్రీడలకు బహుమతులు అందుకున్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, క్రికెట్, అథ్లెటిక్స్ 100 మీటర్లు, 400 మీటర్లు, 1500 మీటర్లు, లాంగ్ జంప్, షాట్ పుట్, చెస్, క్యారమ్స్‌లలో బాలురు, బాలికలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ బాబు పాల్గొని విజేతలను అభినందించి బహుమతులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసురెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ అనిత, ఇందిర, డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ అపర్ణ, విద్యా సమన్వయకర్త డాక్టర్ బి. నర్సింహ, ఇతర బోధనా సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ - ధూల్ పేట్

న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు పి. నవీన్ కుమార్ అన్నారు. సిటీ సివిల్ కోర్ట్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం అధికారికంగా భాధ్యతలను చేపట్టింది. ఇటీవల జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో న్యాయవాదులు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షులుగా ఏ. ఎన్. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఏ.అజయ్, కార్యదర్శిగా బి.రాజి, రెడ్డి,కోశాధికారిగా వి. నిర్మల, లైబ్రరీ కార్యదర్శిగా రాకేష్ కులకర్ణి, స్పోర్ట్స్ కల్చరల్ కార్యదర్శి గా మొహమ్మద్ అఫ్జల్ పాషా, మహిళ సభ్యురాలిగా రేణుక గంగాతో పాటుగా ఏ ప్రణతి లక్ష్మి, ఇ శ్రీనివాస్ రెడ్డి, పి వినయ్ శంకర్, భానుచందర్, సందీప్ సింగ్, రాజశేఖర్ యాదవ్, సామ్రాట్ కేనెట్ పాల్‌లుకమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన వివిధ ప్రయోజనాలను అందించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



డీఈవో ఆఫీస్‌లో మెగా బ్లడ్ క్యాంప్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 11న నాంపల్లి గృహ కల్పలో టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్, టీఎన్జీవోస్ హైదరాబాద్, జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించ తలపెట్టారు. ఈ రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలన్న టీఎన్జీవోస్ సెంట్రల్ యూని యన్ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి పిలుపుమేరకు సోమవారం గన్‌ఫ్రౌండీలోని డీఈవో కార్యాలయంలో ఆ సంఘం హైదరాబాద్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్, స్కూల్ ఎడ్యూకేషన్ డిపార్టుమెంట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, ఎం.భాస్కర్, వారి కార్యవర్గం ఆధ్వర్యం లో మెగా రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.ఆర్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ టీఎన్జీవోస్ స్కూల్ ఎడ్యూకేషన్ ప్రాథమిక సభ్యులు, ఉద్యోగులు, ఆఫీస్ సబార్డినేట్స్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఈ రక్తదాన శిబిరంలో పెద్దసంఖ్యలో పాల్గొని రక్తదానం చేసిన తలసేమి యా, క్యాన్సర్ రోగులకు అండగా నిలువాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రుగేష్, జాయింట్ సెక్రటరీ జయంతి రెడ్డి, ప్రచార కార్యదర్శి ఫెరోస్ అహ్మద్, ఈసీ ప్రియా, ముజాహీద్, మోయిన్, వారి కార్యవర్గంతో పాటు ఫోరం జాయింట్ సెక్రటరీ రమేష్, కల్చరల్ సెక్రటరీ ఆకీల్ అహ్మద్, ఈసీ శివరాజ్, పవన్, పెంటేష్, బాబు రావు, జి. రాజ్ కుమార్, అర్చన, రాజేందర్, బేసర్, సీపీ రెడ్డి, ఇమ్రాన్, ఖాజా సోహేల్ అహ్మద్, మంజు, రాణి, శశిరత్న, రేణుక, గిరి జ, నర్సింహ, హేమావతి, సంతోష్, వెంకటేష్, మధుకర్, దేవిప్రసాద్ జంబయ్య, చైతన్య, కృష్ణ, గౌసియా, అనిల్, శ్రీకాంత్(ఎండీఎం), రాజేందర్, పరమేష్, ఐజాజ్, పూర్ణిమ, దామోదర్, శశికళ, మధు, రవి, రవికాంత్, గౌస్ పాల్గొన్నారు.

ధనాన్ని సద్వినియోగిస్తే జీవితం ధన్యం

- జస్టిస్ నాగ మారుతీ శర్మ



నవతెలంగాణ-కల్చరల్

సంపాదించిన ధనాన్ని సద్వినియోగం చేస్తే వారి జీవితం ధన్యం అని సీబీఐ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగ మారుతీ శర్మ అన్నారు. ఫ్రిజ్ లో రోజుల తరబడి మిగిలిన పదార్థాలు దాచుకుని తిని అనారోగ్యం పాలయ్యే బదులు పేదలకే పంచితే వారి దీవెనలు పుణ్య సంపద అని చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా లలిత కళా వేదిక పై కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో శ్రీ రామ నీ నామ ఎంతో రుచిరా అనే శీర్షికన భక్తి గీతాలు గానం జరిగింది. చింతలపాటి మూర్తి లక్ష్మీ రమ, రాజ్య లక్ష్మి ఓరుగంటి , ఫణి, రమణి లు మధురమైన పాటలతో ప్రేక్షకులను పరవసు లను చేశారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ నాగ మారుతీ శర్మ మాట్లాడుతూ రాముడు ఆదర్శ వంతునిగా యుగాలుగా నిలిచి ఉండడానికి కారణం ధర్మాన్ని ఆచరించటం అన్నారు. గాయకుడు మూర్తి మాట్లాడుతూ బెయిల్ కోసం లక్షలు ఇవ్వజూపినా తిరస్కరించిన వ్యక్తి నాగ మారుతీ శర్మ అని, ఆయన ధర్మాన్ని చెప్పటం కాదు పాటిస్తారని వివ రించారు. అధ్యక్షత వహించిన కిన్నెర రఘురాం మాట్లాడుతూ నాగ మారుతీ శర్మ లాంటి న్యాయ మూర్తులు ఏ కొందరు ఉన్నా సమాజ పరిస్థితులు మారుతాయి అన్నారు.

నృత్య సంగీత రంగాలలో భారత్ ఆర్ట్స్ అకాడెమీ కృషి విశేషం





నవతెలంగాణ-కల్చరల్

గత పన్నెండు సంవత్సరాలుగా నృత్య సంగీత రంగాలలో భారత్ ఆర్ట్స్ అకాడమీ చేస్తున్న కృషి విశేషం అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మెన్ కోలేటి దామోదర్ అన్నారు.ఆయా రంగాలలో బాలలను యువతను ప్రోత్సహిస్తూ వారికి వేదిక కలిపిస్తూ సాంస్కృతిక రంగం లో విశిష్టత పొందిందని పేర్కొన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై భారత్ ఆర్ట్స్ అకాడమీ పన్నెండు సంవత్సరాలు వార్షిక ఉత్సవంతో పాటు శ్రీ రామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన కొలెటి దామోదర్ పాల్గొని బాల రాముని పురస్కారాలు సంగీత నృత్య బాలలకు బహుకరించి మాట్లాడారు. బాలల్లో ప్రతిభను గుర్తించి వారిలోని కళా భావనను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, విద్య నేర్పుతున్న గురువులు సంస్కృతిని పరిరక్షించడంలో వారు తొలి వరుసలో ఉంటారని పేర్కొన్నారు. నాట్య గురువులు సుష్మ సరిత నిషిత శివని సౌమ్య లావణ్య, భరణి, మైథిలి తదితరులు సంగీత గురువులు గంగాధర్, భారతి తదితరులు శిష్య బృందం రెండు వందల మంది నృత్య సంగీత ప్రదర్శనతో రవీంద్ర భారతి వేదిక రామ నామ పాటలతో రంజిల్లింది. సంస్థ అధ్యక్షులు లలితా రావు స్వాగతం పలికిన సభలో సీరియల్స్ దర్శకుడు నాగ బాల సురేష్ కుమార్, నటి శైలజ తదితరులు పాల్గొనగా భారత్ వరల్డ్ రికార్డ్స్ అధినేత రమణా రావు అధ్యక్షత వహించారు

మహిళల సందడి లేని పండుగలు ఉండవు

- నటుడు తనికెళ్ళ భరణి



నవతెలంగాణ-కల్చరల్

మహిళల సందడి లేని పండుగలు ఉండవని ప్రముఖ నటుడు తనికెళ్ళ భరణి అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం లోని ఎన్‌టీఆర్ కళా వేదిక పై అక్షజ్ఞ ప్రచురణ సంస్థ నిర్వహణ లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖ మహిళామణులు ను విశ్వా వసు ఉగాది పురస్కారాలతో సత్కరించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న తనికెళ్ళ భరణి పురస్కారాలను రచయిత్రి కుప్పిలి పద్మ కవి ఇనంపూడి శ్రీ లక్ష్మీ, నటి ఝాన్సీ, జర్నలిస్టు స్వప్న, గాయని సునీత, నర్తకి హిమాన్షిలకు బహుకరించి మాట్లాడారు.అవార్డ్ గ్రహీత లందరూ వారి వారి రంగాలలో విశేష కృషి తో ఉన్నత స్థానానికి చేరారని అభినందించారు వేదిక పై యువ కళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ, నృత్య గురువు డాక్టర్ భారతి, దూరదర్శన్ విశ్రాంత న్యూస్ రీడర్ విజయ దుర్గ, విద్యా వేత్త కృష్ణా రావు తదితరులు పాల్గొన్నారు. ప్రచురణ కర్త

రాజీవ్ యువ వికాసం ద్వారా నిరుద్యోగులకు లబ్ది

నవతెలంగాణ - చర్లపల్లి



నిరుద్యోగ యువతీ యువకులు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువవికాసం పథకం ద్వారా మేలు పొందాలని మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు విక్టరీ జోస్ తెలిపారు. ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6వేలు కోట్లు మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ ఏడాది మొత్తం 5 లక్షల మంది నిరుద్యోగ యువతకు రాయితీ రుణాలు అందనున్నాయని వెల్లడించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని తెలిపారు. యువత ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకొని అభివృద్ధి చెందాలన్నారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-ఉప్పల్



చిల్కానగర్ డివిజన్‌లోని బీరప్ప గడ్డ ప్రాంతంలో డ్రయినేజీ నిత్యం పొంగుతూఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని బీరప్పగడ్డ ఫేజ్-2 వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పెద్ద స్వామి ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ నాయకులు పెద్ద స్వామి మాట్లాడుతూ కాలనీవాసులు ఎన్నాళ్ళు మురుగుతో అవస్థలు పడాలని ప్రశ్నించారు. తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఉప కమిషనర్‌కు విన్నవించారు.

చలివేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లోని ఆర్య సమాజ్, తపస్య ఫౌండేషన్ ఉప్పల్ ఆచార్య వేదసింధు ఆధ్వర్యంలో పిస్తా హౌస్ చౌరస్తాలో సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహర్షి దయానంద సరస్వతి 200వ జయంతి, 150వ ఆర్య సమాజ్ స్థాపన సంవత్సర సందర్భంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ప్రతి ఏడాది ప్రజల దాహార్తిని తీర్చడానికి ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్న ఆర్యసమాజ్, తపస్య ఫౌండేషన్ వారిని అభినందిస్తున్నానని తెలిపారు. పేదల ఆకలి, దాహార్తిని తీర్చడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కాగా 1000 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్ రెడ్డి ,కోకొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, మహమూద్, వేణు గోపాల్ రెడ్డి, ఫోటో బాలు, శ్యామ్ తపస్య ఫౌండేషన్ సభ్యులు మహేందర్, ఇపకాయల నరసయ్య, సత్యవతి, దాతలు జీఎస్ఎన్ మూర్తి, సకినాల ప్రకాష్, విజయ్ కుమార్,పద్మ విట్టల్, శివ నారాయణ, పాల్గొన్నారు.

మన అలవాట్లే ఆరోగ్యాన్ని కాపాడుతాయి

- కిరణ్ స్కూల్ ఆధ్వర్యంలో 'హమ్ ఫిట్‌తో భారత్ ఫిట్'
- జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

మనం ఆరోగ్యంగా ఉంటే దేశం ఆరోగ్యంగా ఉంటుందని అందుకే ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని ఆరోగ్యం కోసం కేటాయించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. సోమవారం ప్రపంచ అరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్, హైదరాబాదు సైక్లోతాన్ గ్రుపు ఆధ్వర్యంలో 5 కిలోమీటర్ల సైక్లింగ్ పోటీలను వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేటి పోటీ ప్రపంచంలో అన్ని సాధించాలనే ఉద్దేశ్యంతో అరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, ఎన్ని సాధించినా ఆరోగ్యం సహకరించకపోతే మనిషి జీవితంలో చాలా కోల్పోతారని అన్నారు. రోజువారీ దిన చర్యలో ఖచ్చితంగా శారీరక శ్రమ ఉండేలా చూసుకోవాలని సూచించారు. కేవలం మార్కులు ర్యాంకులకే ప్రాధాన్యం ఇస్తున్న నేటి కార్పొరేట్ స్కూళ్ళు ఉన్న ఈ విద్యా వ్యవస్థలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించిన కిరణ్ స్కూల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ రితిష్ కుమార్, హైదరాబాదు సైక్లోతాన్ గ్రుపు వ్యవస్థాపకులు రవిందర్,మిస్ ఆంధ్ర యూనివర్స్ చందన జైరాం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళ ప్రదర్శనలు

సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కిరణ్ స్కూల్ విద్యార్థులు బోడుప్పల్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రదర్శించిన కళారూపాలు అహుతులను ఆకట్టుకున్నాయి. నేటితరం విద్యార్థులు సెల్ వాడకం వలన ఏ విధంగా నష్టపోతున్నారో అ ప్రదర్శనలో కళ్లకు కట్టినట్లు చూపించే ప్రయత్నం చేశారు. పౌష్టికాహారం తీసుకోవడం, నిత్యం వ్యాయామం చేయాడం లాంటి కార్యక్రమాలకు దూరంగా ఉండడం మూలంగా చిన్నతనం నుండే పిల్లల్లో వచ్చే అనారోగ్య సమస్యలను తెలియజేశారు. మనం ఎంత ఆరోగ్యంగా ఉంటే దేశం అంత అభివృద్ధి సాధిస్తుందనే సందేశం అ నాటకం ద్వారా తెలియజేశారు.

శ్రీ దత్తాత్రేయ స్వామి 15వ వార్షికోత్సవం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

శ్రీ దత్తాత్రేయ స్వామివారి 15వ వార్షికోత్సవం సందర్భంగా గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని వాణి నగర్‌లోని దత్తాత్రేయ స్వామి దేవాలయంలో సోమవారం గర్భాలయంలో స్వామివార్లకు పంచామృతాలచే విశేష అభిషేకంను నిర్వహించారు. 108 లీటర్ల పాలతో శ్రీ దత్తాత్రేయ స్వామి వారి ఉత్సవ మూర్తికి సామూహికంగా భక్తులచే స్వయంగా అభిషేకంతో పాటు స్వామి వారికి విశేష పూల అలంకరణ, అర్చనలు, హారతి, మంత్రపుష్పం తీర్థ ప్రసాదం వితరణ చేశారు. అనంతరం భిక్ష సమర్పణతో పాటు, అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధి కమిటీ, కార్య నిర్వహణా అధికారి మాట్లాడుతూ పల్లకి సేవ ను నిర్వహించడం జరిగిందని, శ్రీ పాద శ్రీ వల్లభ శ్రీ నరసింహ సరస్వతి సహిత శ్రీ అవధూత దత్తాత్రేయ స్వామి వారి అనుగ్రహానికి పాత్రులు కాగలరని, స్వామివారి పూల అలంకరణకు మహా ప్రసాదానికి సహకరించు దాతలు ముందుకు రాగలరని తెలిపారు.

అనుకృష్ణ హాస్పిటల్ సీజ్

- రూ.5లక్షల జరిమానా,
- 2 నెలలపాటు తాత్కాలికంగా రిజిస్ట్రేషన్ రద్దు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరిలోని అనుకృష్ణ హాస్పిటల్‌పై చర్యలు తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించినందుకుగాను హాస్పిటల్‌ను సీజ్ చేస్తూ, యాజమాన్యానికి రూ.5లక్షల జరిమానా విధిస్తూ, రిజిస్ట్రేషన్‌ను రెండు నెలలపాటు తాత్కాలికంగా రద్దు చేస్తూ, హాస్పిటల్ యాజమాన్యంపై కేసులు నమోదు చేసేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి. హాస్పిటల్‌ను కొనసాగించకుండా అన్ని వైద్య పరికరాలు, డయగ్నోస్టిక్ ఉపకరణాలను జప్తు చేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు తీసుకున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరీ తెలిపారు. సోమవారం మల్కాజిగిరిలో ఉన్న అనుకృష్ణ హాస్పిటల్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ బృందం తనిఖీలు చేసింది. హాస్పిటల్ గడువు ముగిసిశాక పీడీ-పీఎన్‌డీటీ సర్టిఫికేట్‌తో సేవలు కొనసాగిస్తున్నట్టు గుర్తించారు. నూతన సర్టిఫికెట్ పొందకుండానే పాత సర్టిఫికెట్ ఆధారంగా వైద్య సేవలు కొనసాగిస్తున్నట్టు తనిఖీల్లో బయట పడింది. టారిఫ్ జాబితా ప్రదర్శించకపోవడం, ప్రజలకు అవసరమైన ధరల జాబితాను బహిరంగంగా ప్రదర్శించకపోవడం ద్వారా పారదర్శకతకు భంగం కలగడం, డాక్టర్ల జాబితాలో తప్పుదోవ పట్టించే సమాచారం ఉండటం, హాస్పిటల్‌లో పని చేస్తున్న వైద్యుల వివరాల్లో అసత్య సమాచారం ఇవ్వడం ద్వారా రోగులను తప్పుదోవ పట్టించడం, పీసీ-పీఎన్‌డీటీ సర్టిఫికెట్ రెన్యువల్ సంబంధించి తప్పు సమాచారం ఉండటం, సర్టిఫికెట్ రెన్యువల్‌పై అసత్యంగా నివేదించడం వంటి డొల్ల బయట పడింది. అనధికారికంగా అల్ట్రాసౌండ్ యంత్రం వినియోగం, రెన్యువల్ లేకుండా అల్ట్రాసౌండ్ యంత్రాన్ని వినియోగించడం ద్వారా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, పాలీక్లినిక్‌లో అనధికారిక వైద్య ప్రాక్టీస్, సంబంధిత అనుమతుల లేకుండా వైద్య సేవలు అందించడం, లైసెన్స్ పొందిన పారా మెడికల్ సిబ్బందిని నియమించకపోవడం వంటి కారణాలతో అనుకృష్ణ హాస్పిటల్‌పై చర్యలు తీసుకున్నట్టు డీఎంఅండ్‌హెచ్‌ఓ తెలిపారు. రెవెన్యూశాఖ, పోలీసు అధికారుల సమక్షంలో హాస్పిటల్‌లోని ఉల్లంఘనల ఆధారంగా, జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఈ తక్షణ చర్యలు తీసుకున్నట్టు వారు చెప్పారు.

ఘనంగా ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ వేడుకలు



నవతెలంగాణ - చర్లపల్లి

దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నాచారంలోని అన్నపూర్ణ కాలనీ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచారు. దళిత సంఘాల జేఏసీ కన్వీనర్ కరాటే శ్రీరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్ హాజరై మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ నెలరోజులు జిల్లా అంతటా ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాచారం దళిత సంఘాల జేఏసీ వ్యవస్థాపకులు నల్ల రాధకృష్ణ, మాకుల సంజన్న, అంజి మాదిగ, నల్ల బాబు, దేవులపల్లి యాదగిరి, ఏళ్ల సంతోష్, బొడ్డు శివ, కుంటి రమేష్, రామచందర్, కొమ్మగాళ్ళ వెంకటేష్, ఆకేపోగు ప్రమోద్ మహారాజ్, చింత మధు తదితరులు పాల్గొన్నారు.

నాగలక్ష్మీ నగర్‌లో చలివేంద్రం ప్రారంభం



నవతెలంగాణ -చర్లపల్లి

మల్లాపూర్ డివిజన్‌లోని నాగలక్ష్మీ నగర్ కాలనీలో కాంగ్రెస్ నాయకుడు కోయలకొండ రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రేటర్ కాంగ్రెస్ నేత నెమలి అనిల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవికాలంలో ఎండల తీవ్రత అధికంగా ఉండటం వల్ల అనేక పనుల కోసం ప్రజలు బయటికి వచ్చి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారు తాగుట కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీసెల్ అడ్వైజర్ పీజీ సుదర్శన్, మల్లాపూర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బండి సంపత్ గౌడ్, మల్లాపూర్ డివిజన్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు బాతరాజు రాహుల్, మల్లాపూర్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మైథిలీ రింకు, సాయితేజ, నవీన్, యాసీన్, సాయి రామ్ గౌడ్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పేకాటాడిన 17మందిపై కేసు నమోదు

- రూ.4లక్షల 52వేల,335, 16 సెల్ ఫోన్లు స్వాధీనం
- రేంజ్ రోవర్, థార్ వంటి విలువైన కార్లు, ఖరీదైన మందు బాటిళ్లు పట్టివేత



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధి పూడూరులోని సర్వే నంబర్ 312 ఓ ఫామ్ హౌస్‌లో పేకాట ఆడుతూ పట్టుబడ్డ 17మందిపై గేమింగ్ యాక్ట్ కింద మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో రూ.4లక్షల 52 వేల 335 నగదును,1 6 సెల్ ఫోన్ లు,రేంజ్ రోవర్,థార్ వంటి విలువైన కార్లు, ఖరీదైన మందు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఫామ్ హౌస్ యజమాని సంగీ శ్రీనివాస్ రావునుఏ-1గా చేర్చారు.

కుక్కలే కాపలా?

ఫామ్ హౌస్‌లో పేకాట ఆడుతుండగా కొత్తవారు లోపలికి రాకుండా ఉండేందుకు ఫామ్ హౌస్ ఎదుట కుక్కలను కాపల పెట్టినట్లు తెలుస్తోంది. ఎస్‌వోటీ పోలీసులు ఫామ్ హౌస్ వద్దకు చేరుకోగానే కుక్క లు పోలీసులను ఫామ్ హౌస్‌లోకి వెళ్లనీయకుండా అడ్డుకున్నట్లు సమాచారం. చివరకు పోలీసుల వార్నింగ్‌తో ఫామ్ హౌస్ లోకి ఎస్ వో టి పోలీసులను అనుమతినిచ్చినట్టు తెలుస్తుంది.ఒక పథకం ప్రకారమే ఫామ్ హౌస్ లో పేకాట ఆడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఫామ్ హౌస్ లో పేకాటడం ఇదే మొదటిసారి కాదని వారాంతపు సమయాల్లో మందు పేకాటలతో జల్సా పార్టీలు జరగడం సర్వసాధారణమని పేరు చెప్పడాని కి ఇష్టపడని గ్రామస్తుడోకరు తెలిపారు. కాగా ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్న సమయంలో 18మంది ఉన్నారని వార్తలు రాగ ఎఫ్ఐఆర్‌లో మాత్రం 17మందిని మాత్రమే చేర్చడం చర్చనీయాంశంగా మారింది.

వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా యాదగిరిరెడ్డి ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ - చర్లపల్లి

కుషాయిగూడ శ్రీ పద్మావతి వెంకటేశ్వర దేవస్థానం చైర్మెన్‌గా ఉప్పల యాదగిరి రెడ్డి ముచ్చటగా నాలుగో సారి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్ స్పెక్టర్ ప్రణీత్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ ఈఓ మఠం వీరేశం, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, పల్లె సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన సీఐ



నవతెలంగాణ- మేడ్చల్

ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలోని ప్రధాన మార్కెట్ రోడ్డు చౌరస్తాలో ఏర్పాటు చేసిన మజ్జిగ, చలివేంద్రాన్ని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు శ్రావణ్, ఉపాధ్యక్షుడు శేఖర్, కోశాధికారి శ్రీధర్‌లు మాట్లాడుతూ వేసవి కాలంలో చలివేంద్రాలు ప్రజల దాహార్తిని తీర్చడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య యువజన సంఘ నాయకులకు సీఐ అభినందించారు. అనంతరం యూత్ అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని పిలవగానే వచ్చిన సీఐ హనుమాన్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు రాగం సంగీత, ప్రధాన కార్యదర్శి సునీత కోశాధికారి సవిత, నీలిమ, స్వప్న మున్సిపల్ అధ్యక్షులు సఖిలం చంద్రమౌళి, సఖిలం వెంకటేష్, ఆర్యవైశ్య యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కజ్జం నాగేష్, కోశాధి కారి లింగ అవినాష్ ఉపాధ్యక్షులు అఖిల్,పురం సందీప్, అరుణ్, దేమబాలేష్, నాగేష్, హరీష్, శ్రీకర్, మనిసార్థక్, లింగ వినయ్, అమర్, నాగేందర్, ప్రణవ్, వరుణ్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో మంచినీరు సరఫరా సమస్యలను పరిష్కరించాలని జలమండలి జీఎం సంతోష్‌కు స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్‌సోమవారం వినతి పత్రం అందజేశారు. మీర్‌పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని మంగా పురం వెంకటేశ్వర స్వామీ ఆలయం, రాజీవ్ నగర్, కృష్ణానగర్ రోడ్నం1,7 డ్రయినేజీ, ఇంద్రనగర్ ఫేజ్-1 గాంధీ విగ్రహం వెనకాల, వేసవి కాల దృష్ట్యా మెరుగైన మంచినీటి సరఫరా కోసం మరి కొన్ని జంక్షన్ల ఏర్పాటు చేయాలని, కాలనీలలో మంచినీరు సరఫరా, డ్రయినేజీ సమస్యలపై జలమండలి జీఎంకు ప్రజావాణి లో వినతి పత్రం అందజేశారు. తాగునీటి సరఫరా సక్రమంగా రావడం లేదని, మల్కా జిగిరి జలమండలి వారు మెయింటెనెన్స్ చేయకపోవడం వల్ల రాఘవేంద్ర నగర్, జవహర్ నగర్ డ్రయినేజీ పైప్ లైన్ ఓవర్ ఫ్లో అయి హెచ్ బీ కాలనీ ఫేజ్-1, వెంకటేశ్వరనగర్ కాలనీ రోడ్లపై చేరి కాలనీవాసుల ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. హెచ్ బీ కాలనీ ఫేజ్-2 మురుగు నీటితో కలుషితంగా వస్తున్నాయని తెలిపారు.ఈ సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం సతీష్, ఏఈ వేణుగోపాల్, హెచ్‌బీ కాలనీ ఫేజ్-1, ఫేజ్-2 కాలనీల అధ్యక్షులు శివరాం ప్రసాద్ వెంకటాచారి, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కందికంటి అశోక్ కుమార్ గౌడ్‌ను కలిసిన నాయకులు



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ తెలుగు దేశం పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మాజీ అధ్యక్షుడు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ కందికంటి అశోక్ కుమార్ గౌడ్‌ను సోమవారం వారి నివాసంలో పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్తమాన రాజకీయాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి, ఉప్పల్ అడహక్ కమిటీ మెంబర్ నీరుకొండ సతీష్ బాబు, టీయన్ఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ జనరల్ సెక్రటరీ శివనంద్, తెలుగుదేశం నాయకులు నాగేశ్వరావు, గొట్టిపాటి వెంకటేశ్వరరావు, నాగరాజు, కోటేశ్వరరావు, హరి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న మేడ్చల్ బీజేపీ నాయకులు



నవతెలంగాణ- మేడ్చల్

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు జెల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల,ప్రభుత్వ ఆస్పత్రిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో పేరుకుపోయిన ముళ్ళ పొదలు, చెత్తాచెదారని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ పరిసరాల అశుభ్రత వల్ల సంక్రమించే వ్యాధులను నివారణ చేయడం ద్వారా సంవత్సరానికి దాదాపు రూ.20 వేల కోట్లను ఆదా చేయగలమని తెలిపారు.ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం ద్వారా దేశ అభివృద్ధికి దోహదం చేసుకోగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాతూరి ప్రభాకర్ రెడ్డి, జకట ప్రేమ్ దాస్, లవంగ శ్రీకాంత్, శ్రీనివాస్ గౌడ్,హేమలత రెడ్డి, వెంకటేష్ ముదిరాజ్, నర్సింగ్ రావు, బాబురాజ్, యువ నాయకులు రాగం అర్జున్, వంశీధర్ రెడ్డి, గౌలీకర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
9
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
మంగళవారం | ఏప్రిల్ 08, 2025 | www.navatelangana.com

ప్రజావాణికి 10 ఫిర్యాదులు..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిల్‌ల పరిధిలో సోమవారం ప్రజావాణిలో మొత్తం 10 ఫిర్యాదులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 6 ఫిర్యాదులో అందాయి. వాటిలో ఇంజనీరింగ్ 2, టౌన్ ప్లానింగ్ 3, ఎలక్ట్రికల్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. అలాగే గాజుల రామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో 4 ఫిర్యా దులు వచ్చాయి. టౌన్ ప్లానింగ్ 1, ఎలక్ట్రికల్ 2 ,ఇంజనీరింగ్ విభాగానికి 1 వచ్చాయి. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత అధికారులకు అర్జీలు పంపిస్తున్నట్టు తెలిపారు.

గోపాలరావు మరణం ఉద్యమానికి తీరనిలోటు

- నివాళ్లర్పించిన బి.ఎన్. సుదర్శన్



నవతెలంగాణ-బాలానగర్

ఏఐడీఈఎఫ్ నాయకులు కామ్రేడ్ జి.టి.గోపాలరావు మరణం అఖిలభారత డిఫెన్స్ ఉద్యోగుల ఉద్యమానికే కాకుండా హైదరాబాద్ ట్రైడ్ యూనియన్ ఉద్యమానికీ నష్టమని రంగారెడ్డి జిల్లా హెచ్ఏఎల్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి బి.ఎన్. సుదర్శన్ అన్నారు. సోమవారం ఆయన గోపాలరావుకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బి.ఎన్. సుదర్శన్ మాట్లాడుతూ జి.టి.గోపాలరావు ఉద్యమంలో అందరినీ ఆకట్టుకుని కలుపుకొని వేలుశ్తా వయస్సు నిమిత్తం లేకుండా కార్మికులకు సేవలందించారని, ఆయన మరణం కార్మిక ఉద్యమానికి తీరనిలోటు అన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

గత పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ ప్రభు త్వంలో చేరుతున్నామని నాయకులు తెలిపారు. సోమ వారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, బాలనగర్ డివిజన్ ఇందిరానగర్ కాలనీకి సంబంధించిన కాంగ్రెస్ నాయకులు పుట్టపాగ మధు, బాలరాజు, కురు మయ్య 50 మంది, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు గిరి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే పార్టీ కండు వా కప్పి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని, గత పది సంవత్సరాల్లోనే బీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధిలో ఎం తో ఆదర్శంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఎమ్మెల్యే సమ క్షంలో, కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలని నిర్ణయిం చుకున్నామని తెలిపారు.

దాసాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో షెడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే

కూకట్‌పల్లి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం యొక్క అనుబంధాలయమైన, శ్రీ దాసాంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణ ముందు భాగంలో, రేకుల షెడ్డును, కూకట్‌పల్లి నియోజకవర్గం శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ రావుతో కలిసి ప్రారం భోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో కురుమయ్యగారి కొండల రావు, గొట్టుముక్కల వెంగళరావు, కురుమయ్య గారి నర్సింగ్ రావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, రామాలయం చైర్మెన్ తులసి రావు, మాజీదేవస్థాన చైర్మెన్లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



సఫ్దర్ నగర్‌లో మెడికల్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే..

కేపీహెచ్‌బీ : అల్లాపూర్ డివిజన్ సఫ్దర్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్ షాప్‌ను సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు, స్థానిక కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్లు పాల్గొని ప్రారంభించారు.



శ్రమ దోపిడీ, సామాజిక అణచివేత, వివక్ష అంతానికి పోరాడుదాం

- సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్‌ను జయప్రదం చేద్దాం
- సామాజిక ఉద్యమాలకు విరాళాలిచ్చి అండగా నిలుద్దాం
- సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.అశోక్, జె.చంద్రశేఖర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ మన దేశంలోనే ఉన్నదనీ, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతో పురోభివృద్ధి సాధించినప్పటికీ సాటి మనిషిని, మనిషిలాగా చూడలేని దుర్మార్గపు స్థితి నేటికీ కొనసాగడం అమానుషం అని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.అశోక్, జె.చంద్రశేఖర్ అన్నారు. కొండె కెనాల్ వద్ద ఉన్న సీఐటీయూ కార్యకర్తలు సామాజిక ఉద్యమ నిధి రూ.2,935 సోమవారం వసూలు చేశారు. ఈ సందర్భంగా అశోక్, చంద్రశేఖర్ మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం, లింగ బేధం లాంటి సామాజిక రుగ్మతలు మన దేశంలో ప్రజల్ని కార్మికవర్గాన్ని ఐక్యం కానివ్వకుండా దారికడ్డంగా, ముళ్ళ కంచెలా ఉన్నాయన్నారు. దోపిడీ వర్గాల ప్రయోజనాల కోసం పాలక వర్గాలు కార్మికవర్గంలో సున్నితమైన ఈ అంశాలను ముందుకు తెస్తుండటంతో కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేసి దోపిడీ వర్గాలు తమ ప్రయోజనాలను కాపాడుకుంటున్నాయన్నారు. (సీఐటీయూ 16వ అఖిల భారత మహాసభల సామాజిక సమస్యలపై రూపొందించిన కమిషన్ పేపర్ నుంచి) సమాజంలో అన్ని రకాల దోపిడీ, అణచివేత, వివక్షలకు వ్యతిరేకంగా పోరాడి వీటి నుంచి శ్రామిక వర్గాన్ని విముక్తి చేసి, పెట్టుబడిదారీ సమాజానికి ప్రత్యామ్నాయంగా కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతో సీఐటీయూ తన ఆవిర్భావం నుంచి పని చేస్తున్నదన్నారు. సామాజిక అణచివేత, వివక్ష దోపిడీలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలతో శ్రామికవర్గ ఐక్యత కోసం కృషి చేస్తున్నదన్నారు. అందులో భాగంగా ఈ నెల 6 నుంచి 14 వరకు రాష్ట్రంలో సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్ నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈ క్యాంపెయిన్‌లో సీఐటీయూ అనుబంధ సంఘాలన్నీ భాగస్వాములు కావాలనీ, రాష్ట్ర కార్మికవర్గంలో సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ పిలుపునిస్తున్నదని తెలిపారు. ఈ నెల 6న కార్మికోద్యమ నేత సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులు బీటీ రణదివే వర్ధంతి, 18న శ్రామిక మహిళా సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన ఉద్యమనేత రావిమల రణదివే జయంతి, 11న భారతీయ సామాజిక సంఘసంస్కర్త జ్యోతిరావ్ పూలే జయంతి, 14న భారత రాజ్యాంగ నిర్మాత, సామాజికోద్యమకారుడు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతులు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపునిస్తున్నది. రాష్ట్రంలో నేటికీ ఇంకా అక్కడక్కడ పరిశ్రమలు, విద్యాలయాలు, పని ప్రదేశాల్లో చాప కింద నీరులా కులవివక్ష కొనసాగుతున్నదన్నారు. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీ ఉద్యోగులూ వివక్ష దాడులకు గురవుతూనే ఉన్నారని తెలిపారు. సమాజంలో ఉన్న వివక్ష, సహచర ఉద్యోగులు, కార్మికులు పాటిస్తున్న వివక్ష ఈ రెండింటినీ వారు అనుభవిస్తున్నారనీ, డ్యూటీ చేస్తున్న పని ప్రదేశాలు మధ్యాహ్నం లంచ్ చేసే దగ్గర కూడా వివక్ష కొనసాగుతుందని తెలిపారు.

ప్రగతి నగర్ సమస్యలను పరిష్కరించండి

- డివిజన్ నాయకులు ఉప్పు జస్వంత్

నవతెలంగాణ-నిజాంపేట్

ప్రగతి నగర్‌లో ప్రధాన సమస్యలను పరిష్కరించాలని సోమవారం నాలుగవ డివిజన్‌కు చెందిన ఉప్పు జస్వంత్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. స్థానికులకు, స్మశాన వాటిక స్థలాన్ని కేటాయించాలని, ప్రగతి నగర్‌లో ఉన్న అంబీర్ చెరువును కాపాడాలని వినతి పత్రంలో కోరారు. ప్రగతి నగర్‌లో సుమారుగా లక్ష జనాభా నివాసం ఉంటున్న ఇక్కడ స్మశాన వాటిక లేకపోవడం కారణంగా చాలా ఇబ్బందికరంగా ఉందని వివరించారు. 2000 సంవత్సరంలో అప్పటి ప్రగతి నగర్ గ్రామపంచాయతీ వారు స్థానిక స్మశాన వాటికకు, డీఆర్‌సీ సెంటర్‌ను నిర్మించడానికి 60 లక్షలకు పైగా నిధులను ఖర్చు చేశారని ఆయన గుర్తు చేశారు. రెండు సంవత్సరాల క్రితం వరకు అక్కడ స్మశాన వాటిక, డీఆర్‌సీ సెంటర్ నిర్వహించారని ఆయన తెలిపారు. అయితే స్మశాన వాటిక డీఆర్‌సీ సెంటర్ నిర్వహిస్తున్న స్థలం ప్రయివేటు ప్రాపర్టీ అంటూ కొంతమంది వచ్చి ఆ స్థలాన్ని పూర్తిగా వారి ఆధీనంలోకి తీసుకున్నారని ఆయన వివరించారు. 2023 జూలై 17న తర్వాత ప్రగతి నగర్‌కు స్మశాన వాటిక అందుబాటులోకి లేకుండా పోయిందని ఆయన వాపోయారు. స్థానిక అంబీర్ చెరువులో చికెన్, మటన్, తదితర వ్యర్థాలను చెరువులో అక్రమంగా డంపింగ్ చేస్తూ వ్యర్థాలతో నింపుతున్నారని దాన్ని నివారించడానికి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అంబీర్ చెరువు విషయమై కూకట్‌పల్లి, బాచుపల్లి, మండలాల తాసిల్దార్లకు, ఇరిగేషన్ అధికారులకు తగిన సూచనలు చేసి అంబీర్ చెరువుని పరిరక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పదునైన ఆలోచనలతోనే ప్రతిభావంతులవుతారు



- హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయ్ కుమార్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యార్థులు చిన్ననాటి నుంచే పదునైన ఆలోచన విధానం అలవర్చుకుంటే భవిష్యత్తులో ప్రతిభావంతులు అవుతారని హెల్పింగ్ హార్ట్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయకుమార్ అన్నారు. సోమవారం హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ, కేజీఎస్ ఫార్మసీ సంయుక్త ఆధ్వర్యంలో గాజుల రామారం డివిజన్, ప్రకాశంపంతులు నగర్‌లోని ఎఎంఎస్ పాఠశాలలో విద్యార్థులకు "వ్యాస రచన, వక్తృత్వ పోటీలు" నిర్వహించారు. ఈ పోటీలకు హాజరైన సందర్భంగా ప్రముఖ సామాజిక వేత్త మధుబాబు చికిలే మాట్లాడుతూ ఐక్య రాజ్య సమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు -3, మంచి ఆరోగ్యం క్షేమం పైన ప్రపంచ ఆరోగ్య సంస్థ పనిచేస్తుంది అన్నారు. ఆరోగ్యకరమైన ప్రారంభాలు -ఆశాజనక భవిష్యత్తులు,అలాగే పిల్లలకు చక్కటి పోషకఆహారం విలువ,ఆరోగ్య అక్షరాస్యత విలువ గూర్చి తెలిపారు. ఈ తరం విద్యార్థులు శీతల పానీయాలకు, జంక్ ఆహారానికి (నూనె పదార్థాలు) దూరంగా ఉండాలన్నారు. ఆరోగ్యయమే మహాభాగ్యమని సూచించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రకటించారు. ఈ మేరకు షాపూర్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ నవనీతను ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ సభ్యులు నగేష్,పాఠశాల కరెస్పాండంట్ సయ్యద్ ఇమ్రాన్, పట్టణ కేంద్రం సిబ్బంది దేవి, అమృత, శ్యామల, లావణ్య పద్మ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

'దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం'



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడుతాయని సేవ్ ఎ లైఫ్ (సేఫ్టీ ఫర్ హ్యుమానిటీ)" సంస్థ అధ్యక్షుడు రాణా ప్రతాప్ సూరగన అన్నారు. సోమవారం కేపీహెచ్‌బీ డివిజన్‌లోని వసంత్ నగర్ కాలనీలో బస్ స్టాప్ వద్ద వసంత్ నగర్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన పాల్గొని ప్రారంభించారు. నిజాంపేట్‌లోని ఎకెసీ క్లాసెస్ (ఐఐటీ ఇనిస్టిట్యూట్) వారు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవి కాలంలో ఎండలో తిరిగే ప్రజల దాహం తీర్చడానికి, కాలనీ మహిళా మండలి చలివేంద్రం నిర్వహిస్తున్నారన్నారు. దాతల సహకారంతో ఈ చలివేంద్రంలో మంచినీళ్ళు, మజ్జిగ ఇస్తున్నారన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమంలో తోచినంత విరాళం ఇచ్చి ఎవరైనా భాగం పంచుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో బాల, సుబ్బారావు దంపతులు, సీత మనోహరి పాల్గొన్నారు.

ఆల్విన్ కాలనీలో లవకుశ నాటక ప్రదర్శన



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీలోని ఈస్ట్ సాయి నగర్‌లో శ్రీ షిరిడి సాయిబాబా మందిర ప్రాంగణంలో, లవకుశ పౌరాణిక నాటక ప్రదర్శన నిర్వహించారు. లవకుశ నాటకాన్ని తిలకించేందుకు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం 7-12 గంటల వరకు లవకుశ నాటకాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో తిలకించిన భక్తులు పాత్రధారులను అభినందించారు. లవకుశ నాటకంలోని రాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడు, విభీషణుడు, పాత్రధారులకు సురభి రమేష్ రావు జ్ఞాపికలు అందజేసి శాలువలతో ఘనంగా సత్కరించారు.

బీటీ రణదివె స్ఫూర్తితో ఉద్యమించాలి



- సీఐటీయూ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

బీటీ రణదివె స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. ఆదివారం బీటీ రణదివె వర్ధంతి సందర్భంగా షాపూర్ నగర్ సీఐటీయూ కార్యాలయంలో బీటీ రణదివె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పసుల అంజయ్య మాట్లాడుతూ...ఈ దేశంలో కార్మిక సంఘాలకు కేంద్రబిందువుగా ఉన్న విప్లవకర ట్రేడ్ యూనియన్ సీఐటీయూని స్థాపించడంలో రణదివె ప్రముఖ పాత్ర వహించారని అన్నారు. ఆర్థిక పోరాటాలతో పాటు సామాజిక సాధన కోసం కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటాల నిర్వహించాలని అన్నారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధన కోసం, కనీస వేతనాల కోసం, ఎనిమిది గంటల పని దినం కోసం పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు డి.కరుణాకర్, కే.శీను, మధు, మల్లారెడ్డి, యాదవ రెడ్డి, భాషా, వీరేష్, దుర్గా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పిల్లల వైద్య శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కేపీ హెచ్‌బీ



ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కూకట్‌పల్లిలోని రాందేవ్ రావు ఆస్పత్రిలో ఆరోగ్యాకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అనే నినాదంతో తల్లి పిల్లల వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. గైనెకలజీ కన్సల్టేషన్, పెడియాట్రిక్ కన్సల్టెషన్, మామోగ్రఫీ (రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్), హెచ్పివి వాక్సినేషన్ (1వ దోస్ మాత్రమే), జీఆర్బిఎస్, పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ క్యాంపు నందు 60 మంది చిన్న పిల్లలకు 40 మంది పెద్దలకు హెచ్‌పీవీ వాక్సిన్ ఉచితంగా అందజేశారు. రాందేవ్ రావు హాస్పిటల్ యాజమాన్యం విక్రందేవ్ రావు, మీరా రావ్, ప్రశాంత్ రెడ్డి, అపర్ణ రావ్, హాస్పిటల్ ఎండి. డాక్టర్ కె.కమలాకర్, డాక్టర్.ఛాయా దేవి, డాక్టర్ భవాని దివ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది. తద్వారా ఆ కుటుంబం, దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య సంస్థ వారు తల్లి పిల్లల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అనే నినాదంతో పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని ఉచిత హెచ్‌పీవీ వాక్సినేషన్ ఇవ్వడం ద్వారా పిల్లలకు సర్వైకల్, ఇతర క్యాన్సర్‌ని నివారించవచ్చు అని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాన్ని రాందేవ్ రావు హాస్పిటల్ చేయడం ఆనందంగా ఉందని తెలిపారు.

ఫంక్షన్ హాల్ పనుల పరిశీలన



నవతెలంగాణ-కూకట్‌పల్లి

అందరికీ అందుబాటులో ఆమోదయోగ్యమైన ఫంక్షన్ హాల్ పీజేఆర్ నగర్ ప్రజలకు త్వరలో అందుబాటులోకి రానుందని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని, పీజేఆర్ నగర్‌లో రూ. 2 కోట్ల అంచనావ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను ఒక్క కోటి రూపాయల అంచనావ్యయంతో చేపట్టబోయే, చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులను, డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, ఎఈ శ్రావణి తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పీజేఆర్ నగర్ కాలనీలో నిర్మిస్తున్న మల్టి పర్పస్ ఫంక్షన్ హాల్ మరియు చైల్డ్రెన్స్ పార్క్ నిర్మాణ పనుల్లో భాగంగా, ప్రహరీ గోడ, ఫంక్షన్ హాల్ బేస్మెంట్ నిర్మాణాలు పూర్తయ్యాయని అన్నారు. ఇప్పుడు బేస్మెంట్ కు పిల్లర్లు నిర్మిస్తున్నారని తెలియచేశారు. పీజేఆర్ నగర్ కాలనీ వాసుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరుతుందన్నారు. ఫంక్షన్ హాల్, చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, శ్యాముల్, మహేష్, ఖలీమ్, సుధాకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ పాల్గొన్నారు.

శ్రీ రామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని, కూకట్‌పల్లి గ్రామంలోని రామాలయంలో, సీతారామచంద్రులను కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గూడెపు నాగరాజు, మేకల రమేష్, మాధవరం శ్రీనివాసరావు, మల్లేష్ యాదవ్, రాజు యాదవ్, శివ చౌదరి, సంజీవ రావు, కృష్ణవేణి, జ్యోతి పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి



ప్రజావాణికి 82 ఫిర్యాదులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను డీఆర్ఓ హరిప్రియతో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 82 ఫిర్యాదులు అందినట్టు అదనపు కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖల్లో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణికి ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిచస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజాభవన్ నుంచి ఆన్ లైన్‌లో వచ్చిన దరఖాస్తులను తిప్పి పంపే సమయంలో ఎందుకు తిప్పి పంపుతున్నారో వివరంగా సమాచారమిస్తూ దరఖాస్తుదారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మొద్దులు, కొమ్మలు.!



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికుల, పాదాచారుల పాలిట శాపంగా మారింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లకు అడ్డువస్తున్న చెట్ల కొమ్మలను, మొద్దులను నరికి వేయించి, అసంపూర్తిగా వదిలేశారు. తాజాగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దుమ్ నగర్ మూలమలకు చౌరస్తా వద్ద ప్రమాద భరితంగా చెక్క మొద్దు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఇటు ప్రయాణికులు, అటు పాదాచారులు ఆందోళన చెందుతున్నారు. ఆదమరిస్తే ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చెస్తూన్నారు. గత కొన్ని రోజులుగా ప్రమాద భరితంగా ఉన్న చెట్టు మొద్దును తొలగించాలని స్థానిక సబ్ స్టేషన్ లోని విద్యుత్ అధికారికి ఎన్నిసార్లు ఈ విషయం గురించి చెప్పిన పెడచెవిన పెట్టి నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. మా ప్రాణాలంటే లెక్కే లేదా అని అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే ఎటువంటి ముప్పు వాటిల్లకుండా చెట్టు మొద్దును తొలగించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని పలువురు వాహనదారులు, పాదాచారులు హెచ్చరించారు.



కూకట్‌పల్లి గ్రామంలో గల శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో, కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో.. జరుగుతున్న, బ్రహ్మోత్సవాలు సీతారామచంద్రస్వామి సామ్రాజ్య పట్టాభిషేకంలో శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు సతీమణి మాధవరం లక్ష్మీబాయి, చైర్మెన్ తులసిరావు దంపతులు , స్థానిక భక్తులతో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

10

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్

మంగళవారం | ఏప్రిల్ 08, 2025 | www.navatelangana.com

రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగించుకోవాలి

- కాంగ్రెస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అదం సంతోష్ కుమార్



నవతెలంగాణ-ఓయూ

రాజీవ్ యువ వికాస పథకం కింద దరఖాస్తు చేసుకునే తేదీని ఏప్రిల్ 14 వరకు పొడగించినందున, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదం సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓబీసీ, ఈబీసీ యువత రాజీవ్ యువ వికాసం కింద స్వయం ఉపాధి పొందేందుకు అధికారులందరు ఈ పథకంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అమలు చేయాలని, క్షేత్ర స్థాయి వరకు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని, రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రజలకు తెలిసే విధంగా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన పథకాన్ని నూతనంగా ప్రారంభించిందని, ఈ పథకం కింద అన్ని కార్పొరేషన్‌లకు సంబంధించిన మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిందని సంతోష్ తెలిపారు.



ఎన్టీఆర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ అధ్యక్షుడు ఎన్నికల్లో గెలుపొందిన వాసు ప్రమాణస్వీకారంలో బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య పాల్గొన్నారు. అనంతరం వాసుకి శాలువాతో సత్కరించి కమిటీ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కాప్రా

విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగకూడదు



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

ప్రతిభావంతులైన విద్యార్థుల చదువులు మధ్యలోనే నిలిచిపోవద్దని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన కార్యాలయంలో ముగ్గురు పేద విద్యార్థులకు సనత్‌నగర్‌కు చెందిన సంకేత్ సోషల్ అవేర్ నెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూ.2.45 లక్షలు ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. గిర్కాల శ్రావణి ఎంఎస్ మొదటి సంవత్సరం చదువు కోసం రూ.2 లక్షల, దత్తా ఇంటర్మీడియట్ కోసం రూ.20 వేలు, వీరు ఇంటర్మీడియట్ చదువు కోసం రూ.25 వేల చొప్పున ఆర్థిక సహాయం లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు, పేదరికం కారణంగా అనేకమంది మధ్యలోనే తమ చదువులకు ముగింపు చెబుతున్నారని, ఇది బాధాకరం అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి విద్యావంతులను చేయడం ద్వారా వారికి బంగారు భవిష్యత్‌ను అందించిన వారవుతారని చెప్పారు. పేద విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఆర్థిక సహాయం అందిస్తున్న సంకేత్ ఆర్గనైజేషన్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ఫౌండర్ మురళి, అధ్యక్షులు మమత, ఉపాధ్యక్షులు ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఓయూ

బౌద్ధనగర్ డివిజన్ స్థానిక కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్థానిక వార్డ్ ఆఫీస్‌లోని సోమవారం ఘనంగా మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావు గౌడ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మీడియాతో మాట్లాడుతూ.. పద్మారావు గౌడ్ ఇంకా ఎన్నో ఇలాంటి జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆ యొక్క భగవంతుని ఆశీస్సులు ఆయనకు ఎల్లప్పుడూ ఉండాలని, సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఎన్నో ఉన్నత పదవులు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యువకులు మహిళలు పాల్గొన్నారు.

కార్పొరేటర్ డా. సామల హేమ ఆధ్వర్యంలో

సీతాఫల్‌మండీ కార్పొరేటర్ డా. సామల హేమ ఆధ్వర్యంలో



సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నామలగుండులోని శ్రీ అభయాంజనేయ ఆలయంలో పద్మారావు గౌడ్ పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రాహ్మణ బస్తీలోని ఎస్-ఎల్ ఓల్డేజ్ హోంలో వృద్ధులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం వారికి దుస్తులతో పాటు పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి మొక్కను నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తనకి రాజకీయ జీవితాన్ని ఇచ్చిన గొప్ప వ్యక్తి ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. ఆయన నిండు నూరేండ్లు ప్రజా సేవలో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల మనసును గెలిచి 4 సార్లు ఎమ్మెల్యేగా గెలిచి సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరాటే రాజు, రాజా సుందర్ శైలెందర్, శరణ్, దుర్గ ప్రసాద్ సాప రాజు, మహేష్, పోతారం శ్రీనివాస్ మహిళ నాయకురాలు మణి మంజరి, లక్ష్మి, కాంతమ్మ, అనిత, లలిత, అరుణ, భాగ్య పాల్గొన్నారు.

తెలంగాణ యువతలో ప్రతిభకు కొదవ లేదు..

- యువతను నైపుణ్య మానవ వనరులుగా తీర్చి దిద్దుతాం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



నవతెలంగాణ-సిటీబ్యూరో

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను అన్ని రంగాల్లో అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులుగా తీర్చి దిద్దుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ ఆఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ)లో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం యూనివర్సిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులకు చిరునామాగా తెలంగాణను మార్చాలనే సంకల్పంతోనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ యువతలో ప్రతిభకు కొదవ లేదని మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్మెంట్‌లో శిక్షణ అందిస్తే మరింత మెరుగ్గా తయారవుతారన్నారు. పరిశ్రమలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ కోర్సుల రూపకల్పనలో పరిశ్రమలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న కోర్సులపై ప్రధానంగా దష్టి సారించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు సాఫ్ట్ స్కిల్స్ లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. కోర్సు పూర్తయ్యే నాటికి అభ్యర్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చి దిద్దాలన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ విద్యా, పరిశోధన, టాస్క్, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ(డీఈఈటీ) తదితర సంస్థలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, డిప్యూటీ సెక్రటరీ భవేష్ మిశ్రా, స్కిల్ యూనివర్సిటీ వీసీ సుబ్బారావు, ఇఎస్‌సీఐ డైరెక్టర్ డాక్టర్.జీ.రామేశ్వర్‌రావు, ఓఎస్డీ చమాన్ మెహతాతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలి

- కమిషనర్ ఇలంబర్తి
- జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా ప్రజావాణికి 120 అర్జీలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన విన్నపాల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులకు సూచించారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ నగరం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల విన్నపాలు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించి అక్కడిక్కడే పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇల్లంబర్తి మాట్లాడుతూ.. నగర ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, సమస్య పరిష్కారం కానట్లయితే అందుకు గల కారణాలను స్పష్టంగా వారికి తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 41 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 19, ట్యాక్స్ సెక్షన్ 5, ఇంజినీరింగ్ విభాగం, అడ్మినిస్ట్రేషన్, ఎస్టేట్స్, విజిలెన్స్, వెటర్నరీ, ఫైనాన్స్, హౌసింగ్ విభాగాలకు ఒకటి చొప్పున, ల్యాండ్ అక్విజిషన్, స్పోర్ట్స్ విభాగాలకు మూడు చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 4 ఫిర్యాదులు అందాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 79 అర్జీలు వచ్చాయి.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, వేణుగోపాల్, రఘు ప్రసాద్, చంద్రకాంత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గీతా రాధిక, అడిషనల్ సీసీపీ ప్రదీప్, వాటర్ వర్క్స్ జీఎం సాయి రమణ, డిప్యూటీ సీఈలు వనస రెడ్డి సునంద చీఫ్ వెటర్నరీ అధికారి డా. అబ్దుల్ వకీల్, వాల్యూయేషన్ అధికారి మహేష్ కులకర్ణి, యూబీడీ డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



- జీఓ నెంబర్ 21ని రద్దు చేయాలి
- ఔట సీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎ. పరశురాం

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 21 జీవో రద్దు చేయాలని ఔటసీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎ. పరశురాం కోరారు. సోమవారం మధ్యాహ్నం ఔటసీ ఆధ్వర్యంలో వారు ఓయూ వీసీ ప్రొ. కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొనేండ్ల నుంచి రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నట్టు చెప్పారు. అడ్మినిస్ట్రేటీవ్ పనుల్లో కూడా తమ సేవాలు ఉన్నాయని, ఇలా జీవో నెంబర్ 21ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. తమని మొదటి రెగ్యులరైజ్ చేసిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఇతర ఆలోచనలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఓయూ కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రతి పదిమందిలో ఒకరు భారత దేశం మానసిక సమస్యలతో బాధ పడుతున్నారని ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు డా. శ్రీ చందన చెప్పారు. ప్రవర్తన్ సామాజిక సేవా సంస్థ నిర్వహణలో జరిగిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా డా. చందన సంస్థ కార్యలయంలో క్వాంటమ్ హీలింగ్ గురించి అవగాహన ప్రసంగం చేశారు. మానసిక సమస్యలు వల్ల కుంగుబాటు ఆత్రుత దీనిద్వారా బి పి షుగర్ వంటి వ్యాధులు బారిన అధిక సంఖ్యలో బాధ పడుతున్నారని ఆమె వివ రించారు. క్వాంటమ్ హీలింగ్ ఆధునిక వైద్య రంగం లో ప్రపంచ వ్యాప్తం గా గుర్తింపు పొందుతోంది అని తెలిపారు. నవతెలంగాణ-కల్చరల్

జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించాలి

- భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యంగౌడ్
- సీతాఫల్‌మండీలో జర్నలిస్టుల సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించాలని భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యంగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్‌మండీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం సత్యంగౌడ్ ఆధ్వర్యంలో 13న సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరగనున్న 'తెలంగాణ జర్నలిస్టుల సమ్మేళనం పోస్టర్‌ను' ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర పోషించిన జర్నలిస్టుల పరిస్థితి నేడు ఆగమ్యగోచరంగా మారిందని, తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు వార్తలు రాసి ఉద్యమాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న జర్నలిస్టులతో పాటు, ఉద్యమ వార్తలు రాసిన జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, ఫోటో, వీడియో, డెస్క్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో తెలిపిన విధంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. తెలంగాణ జర్నలిస్టుల సమ్మేళనం కార్యక్రమంకు ఫోటో, వీడియో, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు మోహన్ బైరాగి, టీయూ జేఏసీ సెక్రెటరీ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, చర్పల చంద్రన్న ప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు బ్రహ్మం, చికోటి శ్రీనివాస్, భాస్కర్, సాక్షి శ్రీనివాస్, మహేందర్, మున్నూరు చందు, కల్పన, డిజిటల్ మీడియా జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు కే రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు అమర్‌నాథ్ లింగంపల్లి, యశ్వంత్ (నాని), మద్దెర్ల కిరణ్, గిరి గౌడ్, మాణిక్యం, శ్యామ్, శ్రీనివాస్ గౌడ్ ఉద్యమ కళాకారుల వేదిక అధ్యక్షులు వేదిక డోలక్ యాదగిరి, సాయిలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభించిన డా.కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

సనతనగర్ నియోజకవర్గంలోని బన్సీలాల్ పేట్ డివిజన్ కట్టెలమండిలో సౌరవ్, అన్ను జైస్వాల్ తండ్రి రాధేశ్యామ్ జైస్వాల్ స్మృత్యార్థం చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సనతనగర్ ఇన్‌చార్జి డా. కోటా నీలిమ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ చలివేంద్రం ముఖ్య ఉద్దేశం ప్రజలకు మంచి శుద్ధమైన తాగు నీరు అందించడమేనని, దానాల్లోకెల్లా జలదానం శ్రేష్టమైనదని డా.నీలిమ అన్నారు. మండుటెండలలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ముందుకువచ్చిన సౌరవ్, అన్నులను ఈ సందర్భంగా కొనియాడుతూ.. వారి తండ్రిపేరు చిరస్మరణీయమౌతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బన్సీలాల్‌పేట్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కమిటీ హాల్ నిర్మాణానికి కార్పొరేటర్ శంకుస్థాపన



నవతెలంగాణ-కంటోన్మెంట్

నల్ల పోచమ్మ దేవాలయం ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సోమవారం కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ దంపతులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి కమిటీ సభ్యులు లింగాల బాలమ్మ, మక్కల మహేష్, లింగాల రవి, ధ్యాగల శ్యాంసుందర్, మోహన్ ముదిరాజ్, మక్కల పరమేష్, విట్టల్, నరేష్, నాగేందర్, మధు, శ్రీనివాస్, సీనియర్ నాయకులు కర్రె జంగయ్య, మార్కెట్ మాజీ వైస్ చైర్మెన్ మన్నె ఉదయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు

- 7 నుంచి మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీలు
- ఎస్సార్ నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

మైనర్‌లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని, ఏప్రిల్ 7 నుంచి మైనర్‌లు నడిపే వాహనాలపై ప్రత్యేక తనిఖీలు చేసి వాహనాలు సీజ్ చేస్తామని, వాహన యజమానులను మైనర్‌లను ఎస్సార్ నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు హెచ్చరించారు. చాలా ప్రమాదాలు సరైన డ్రైవింగ్ అవగాహన, లైసెన్సు లేని మైనర్‌లు నడపడం వల్లనే జరుగుతుయ్యాన్నారు. బంగారు భవిష్యత్తు ఉన్న చిన్నారులు, తాత్కాలిక ఆనందం లేదా అవసరం నిమిత్తం వాహనాలు నడుపుతూ.. ప్రమాదాలకు కారణం అవడమే కాకుండా, ఎదుటి వారి జీవితాలను కూడా ప్రమాదాల భారిన పడేలా చేస్తున్నారు. తద్వారా జీవితాలను చీకటి మయం చేసుకుంటున్నారు. 7వ తేది నుంచి అన్ని సెంటర్‌ల వద్ద ప్రత్యేక తనిఖీల ద్వారా బాల, బాలికలు నడిపే వాహనాలను గుర్తించి జప్తు చేసుకొని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మైనర్‌లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులు, వాహన యజమానులపై కూడా చర్యలు ఉంటాయి. యజమానులు తమ వాహనాలను ఎవరికైనా ఇచ్చే ముందు లైసెన్సు తనిఖీ చేసి ఇవ్వాలి, అలాగే తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై తగిన దృష్టి పెట్టి వాహనాలు నడపకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు వాహనదారులను హెచ్చరించారు.

బీజేపీ మత రాజకీయాలు దేశాన్ని ముక్కలు చేస్తోంది

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

బీజేపీ చేస్తున్న మత రాజకీయాలు దేశాన్ని ముక్కలు చేస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. సోమవారం నాలుగో వార్డ్ గాంధీనగర్‌లో జై బాపు, జై భీమ్, సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహి ంచారు. బీజేపీ దేశవ్యాప్తంగా అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ పాదయాత్రను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ పాదయాత్ర గాంధీ విగ్రహం నుంచి పికెట్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ.. బీజేపీ చేస్తున్న మత రాజకీయాలు దేశాన్ని ముక్కలు చేస్తుందని, జనాలను మభ్యపెడుతూ ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేస్తుందన్నారు. ఆ పార్టీ స్వార్థ రాజకీయాల కోసం అత్యంత పవిత్రమైన రాజ్యాంగాన్ని, రాజ్యాంగ రచయితను అవమానపరుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ దళిత రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్య పరచడమే ఈ పాదయాత్ర ఉద్దేశ్యమన్నారు. ప్రజాస్వామ్యాన్ని తూట్లు పొడుస్తూ కంటోన్మెంట్‌లో బోర్డు ఎన్నికలు నిర్వహించకుండా ఐదేండ్లకు పైగా కేంద్ర ప్రభుత్వం నామినేటెడ్ మెంబర్‌తో పరిపాలన సాగిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతోందని ఎమ్మెల్యే శ్రీగణేష్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అబి. యాన్ కంటోన్మెంట్ కోఆర్డినేటర్ వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తాత్కాలిక అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

- యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ



నవతెలంగాణ-బంజారాహిల్స్

జీవో 21 రద్దు చేయాలి తాత్కాలిక అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత, ఇంక్రిమెంట్ కల్పించి నోటిఫికేషన్‌లు విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీ కాంట్రాక్టర్ అధ్యాపకుల జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ధర్మతేజ, పరశురామ్, ఉపేందర్ రావు, ఆశ్లేషాతో కలిసి మాట్లాడారు. 70 నుంచి 80 శాతం మంది తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న సుమారు 1270 మంది 12 యూనివర్సిటీలలో విద్యానందిస్తున్నమన్నారు. భారత దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఉన్న ఈ సమస్య పట్ల ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్న కేవలం వారి స్వలాభం కోసం ప్రస్తుతం ఈ కమిటీకి చైర్మెన్‌గా వ్యవహరిస్తున్న గంట చక్రపాణి కావలనే ప్రభుత్వానికి తప్పుడు సంకేతలనూ అందిస్తూన్నారన్నారు. గత ప్రభుత్వంలో కూడా ఆయన చేసిన అనేక తప్పిదాలు ప్రభుత్వానికి తెలియంది కాదని ఆరోపించారు. ఈ విషయంపై ప్రస్తుత మంత్రి శ్రీధర్ బాబు అసంబ్లి సాక్షిగా ప్రశ్నించినా విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 21 అమలు చేయించడాన్ని తప్పుబడుతూ దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. విద్య కమిషన్ నివేదిక ఆధారంగా చేసుకుని నిర్ణనాయన్ని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ.. 25 నుంచి 30 ఏండ్లుగా పనిచేస్తున్నాం కాబట్టే న్యాక్ లాంటి గుర్తింపు వచ్చిందనీ చెప్పారు. ఈ జీవో యూజీసీ నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. నోటిఫికేషన్‌లు జారీ చేసి తమ డిమాండ్లను పరిగణంలోకి తీసుకోకుంటే యూనివర్సిటీలను స్తాంబింపజేస్తామని హెచ్చరించారు. సెల్ఫ్ ఫైనాన్స్ అధ్యాపకులు 360 మంది ఉన్నారనీ అధ్యక్షులు తల్లపల్లి వెంకటేష్ సవితి తల్లి ప్రేమ చూపవద్దను కోరారు. ఈ సమావేశంలో వేల్పుల కుమార్, శనిష్, కనకయ్య, విజేందర్ రెడ్డి, కృష్ణయ్యలు తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్‌లో రోబో వైద్యసేవలు ప్రారంభం



నవతెలంగాణ-బేగంపేట్

రోబోటిక్ టెక్నాలజీ వల్ల రోగికి మెరుగైన, ఖచ్చితమైన, సేఫ్టీతో కూడిన శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు అవకాశం, కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్‌లో ఎక్కడ లేని విధంగా ఆరు రోబోలు అందుబాటులో ఉన్నాయని, నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చిన రోబోటిక్ డావించీ సాయంతో జనరల్ సర్జరీ, గైనకాలజీ, యూరాలజీలతో పాటే.మ్స్ సన్ షైన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ వి గురవారెడ్డి తెలిపారు. సోమవారం బేగంపేట్ కిమ్స్ అండ్ షైన్ హాస్పిటల్‌లో అత్యధిక శాస్త్ర చికిత్స రోబోటిక్ డావించీ సిస్టంను డా. ఏవి గురవారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ కన్సల్టెంట్, హెడ్ ఆఫ్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, రోబోటిక్ సర్జన్ డా. విమలాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు వస్తున్న టెక్నాలజీని అందిపిచ్చుకుంటూ రోగికి మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా ముందుకు సాగుతున్నామని, అందులో భాగంగానే డావించీ రోబోను అందుబాటులోకి తీసుకు వచ్చామని తెలిపారు. ఈ రోబో సాయంతో జివి, విపుల్, క్యాన్సర్, జీర్ణ వ్యవస్థకు సంబంధించిన క్యాన్సర్లు ప్యాంక్రియాటిక్ పైత్య గొట్టాలు, పెద్ద పేగు క్యాన్సర్ ఇలా కడుపు లోపలి భాగంలో ఎక్కడైనా శాస్త్ర చికిత్సలు నిర్వహించవచ్చని తెలిపారు. యూరాలజీ, సర్వైకల్, లాంగ్ అండ్ కార్డియాక్ చికిత్సలో కూడా ఈ రోబోను ఉపయోగించి నిర్వహించవచ్చని సందర్భంగా డా. విమలాకర్ రెడ్డి పేర్కొన్నారు. రోబో సాయంతో నిర్వహించిన ఎర్నియా శాస్త్ర చికిత్స వీడియోను ఆయన ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో కార్డియో థోరాసిక్ సర్జన్ డా. పీఎస్ రావు, యూరాలజిస్ట్ డా. నందకుమార్, డా. శ్రీహర్ష సర్జికల్ అంకాలజిస్ట్ డా. పృథ్వీరాజ్, గైనకాలజిస్ట్ డా. హవ్యలతో పాటు కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్స్ సీఓఓ సుధాకర్ జాదవ్, హాస్పిటల్ లోని వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
మంగళవారం | ఏప్రిల్ 08, 2025 | www.navatelangana.com

స్టాలియన్ పవర్‌లిఫ్టింగ్ ఫినాలే విజేతలకు బహుమతులు అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్టాలియన్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ అసమానమైన శక్తి, ధైర్యం గొప్పతనంతో ముగిసింది. వెయ్యి మందికిపైగా ఉత్సాహభరితమైన పాల్గొన్నారు. ప్రేక్షకులను ఆకర్షించింది. 30 రోజులకు పైగా ప్రదర్శించబడింది. 10 శక్తివంతమైన ఈవెంట్‌లను కలిగి ఉంది. శాట్స్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మెన్‌కు ఓస్‌డీ డాక్టర్ నరసయ్య డీవైఎస్‌ఓ అండ్ తెలంగాణ ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట నుంచి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ సుధాకర్, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రుతిరావు వంటి ప్రముఖులు ఈ ఫినాలేకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారితో పాటు లైఫ్‌స్పాన్ ప్రయివేటు లిమిటెడ్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర రామ్, లైఫ్‌స్పాన్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రేమ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేంద్ర రామ్ మాట్లాడుతూ "అధునాతన పోషక ఉత్పత్తులతో మాత్రమే కాకుండా, ఆరోగ్యం, ఫిట్‌నెస్ ప్రాముఖ్యతను నొక్కి చెప్పే సమాజాన్ని పెంపొందించడం ద్వారా అథ్లెట్లను శక్తివంతం చేయడమే మా లక్ష్యం. స్టాలియన్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు మద్దతు ఇవ్వడానికి మేం సంతోషిస్తున్నాం. మా పాల్గొనేవారి ఫిట్‌నెస్ ప్రయాణానికి తోడ్పడటం గర్వంగా ఉంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛాంపియన్‌షిప్ సందర్భంగా వివిధ ఉత్పత్తులను ఆవిష్కరించారు. ప్రముఖ అథ్లెట్లు, ప్రముఖులు ప్రీ-వర్కౌట్, వర్కౌట్ సమయంలో, పోస్ట్-వర్కౌట్‌లను ఆవిష్కరించారు. విభిన్న బరువు విభాగాల్లో ఎనిమిది మంది విజేతలకు లైఫ్‌స్పాన్ రూ.లక్ష విలువైన గిఫ్ట్ హాంపర్లు ప్రదానం చేసింది.

శాటిలైట్ ఇమేజీలతో ఎఫ్‌టీఎల్ నిర్ధారణ



- ఎఫ్‌టీఎల్ నిర్ధారణతో సమస్యలకు పరిష్కారం
- ప్రజల అభ్యంతరాలను పరిగణించాలన్న హైడ్రా కమిషనర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ పూర్తి అయితే చాలా సమస్యలకు పరిష్కారం చూపినట్టవుతుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారుకలకు దిశానిర్దేశం చేశారు. సంబంధిత శాఖల నుంచి సేకరించిన సమాచారంతో పాటు.. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎఫ్‌టీఎల్ నిర్ధారిస్తున్న వేళ ప్రజల అభ్యంతరాలను కూడా స్వీకరించాలన్నారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు ఉద్దేశించి రూపొందిస్తున్న 'లేక్ ఎన్యూమరేషన్'యాప్‌లో అభ్యంతరాలు చెప్పడానికి ప్రత్యేక కాలమ్‌ను పెట్టాలన్నారు. సోమవారం హైడ్రా ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఇదే అంశంపై ఎక్కువ మొత్తంలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఏవీ రంగనాథ్ ఎఫ్‌టీఎల్ నిర్ధారణ ప్రాధాన్యతను వివరించారు. చెరువుల్లో ఓ వైపు నుంచి మట్టిని నింపడంతోపాటు మురుగు నీరు నిరంతరంగా వచ్చి చేరడంతో ఎఫ్‌టీఎల్ పరిధులు మారిపోతున్న నేపథ్యంలో ఎఫ్‌టీఎల్ నిర్ధారణ వేగంగా జరగాల్సి ఉందన్నారు. గ్రామ, రెవెన్యూ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, సర్వే ఆఫ్ ఇండియా రికార్డులతో పాటు ఎన్.ఆర్.ఎస్.సీ శాటిలైట్ ఇమేజీలతో ఎఫ్‌టీఎల్ నిర్ధారణ జరుగుతోందన్నారు. ప్రత్యేకంగా ఒక నిపుణుల కమిటీని కూడా వేసి.. ఎలాంటి అపోహలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఫిర్యాదుదారులకు వివరించారు. అలాగే పలు కాలనీల మధ్య రహదారులకు ఆటంకాలు కలిగించడం, పాత లే ఔట్ల హద్దులను పట్టించుకోకుండా కబ్జా చేయడం, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను ప్లాట్లుగా చేసి అమ్మేయడం వంటి ఫిర్యాదులు అందాయి. సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 57 ఫిర్యాదులురావడంతో కమిషనరే నేరుగా స్వీకరించి సంబంధిత అధికారులకు వాటి పరిష్కార బాధ్యతలను అప్పగించారు.

పార్కు స్థలంతో పాటు, ఆ పక్కనే ప్రభుత్వస్థలం కబ్జా

-మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్‌బుల్లాపూర్ మండలం మెట్టుకాని గూడ, గాజులరామారం గ్రామంలో సర్వే నంబరు 161లో ఉన్న పార్కు స్థలంతో పాటు, ఆ పక్కనే ప్రభుత్వస్థలాన్ని కూడా కబ్జా చేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు.

-కాప్రా చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ అయ్యిందని, ఫెన్సింగ్‌ను తొలగించి కొంతమంది అక్కడ చెరువులోపలకి వచ్చి కబ్జా చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు.

-మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మున్సిపాలిటీలోని మల్లంపేటలో హైరైజ్ పీవీఆర్ మెడోస్ వాళ్లు ఇతర కాలనీలకు వెళ్లే మార్గాలను మూసేశారని మల్లంపేట నివాసితులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

-పటాన్‌చెరువులో తిమ్మక్క చెరువుకు నీరందించే పెద్దవాగును ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ కబ్జా చేసిందని, 30 మీటర్ల వెడల్పువాగుకుతోడు ఇరువైపుల 9 మీటర్ల చొప్పున బఫర్ ఉండాల్సిన విస్తీర్ణం కుంచించుకుపోయిందని స్థానికులు ఫిర్యాదు చేశారు.

-ఉప్పల్, ఫిర్జాదిగూడ మున్సిపాలిటీ పర్వతిపురి గ్రామంలో 3 ఎకరాల సమాధుల భూమి తమదంటూ పట్టాలు సష్టించి కబ్జా చేస్తున్నారని మరో ఫిర్యాదు అందింది.

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

131 డివిజన్ కుత్బుల్లాపూర్ జై బాబు , జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం.అధ్యక్షులు ఎండీ.జాకీర్ అధ్వర్యంలో సోమవారం కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని చింతల్ బస్సు స్టాప్ నుంచి ద్వారకా నగర్, మార్కెట్ యార్డ్, కాకతీయ నగర్, మాణిక్య నగర్, అంబేడ్కర్ నగర్, శ్రీనివాస్ నగర్, సంజీవయ్య నగర్, రామ కృష్ణ నగర్, బాపు నగర్, శ్రీ రామ్ నగర్, పద్మ నగర్ ఫేస్ -2 వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కేంద్రంలో ఉన్న భాజపా ప్రభుత్వం దేశ రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ రచయిత అంబేడ్కర్ త్యాగాలను తెలిపారు. ప్రజలను చైతన్యవంతం చేయడం కోసమే ఈ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి,131 డివిజన్ మాజీ అధ్యక్షులు కృష్ణ యాదవ్, రాధ కృష్ణ, పెంటయ్య ముదిరాజ్ సిద్దయ్య, 131 డివిజన్ మహిళ అధ్యక్షురాలు సుజాత, మహిళా నాయకురాలు సుజాత, అశ్విని, హేమావతి, తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట: కాంగ్రెస్ హస్తం పేద ప్రజల నేస్తమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు.ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు జై బాపు..జై భీమ్..జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం వల్లభయ్ పటేల్ నగర్ నుంచి వివేకానందనగర్ వరకు చేపట్టిన పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యే తోపాటు కుత్బుల్లాపూర్ కోఆర్డినేటర్ ఉస్మాన్ షాకీర్,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి,డివిజన్ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పర్యటించారు.అనంతరం వివేకానందనగర్ రేషన్ షాపులో ప్రజకు సన్నబియ్యం పంపిణీ చేస్తూ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకం పేదప్రజలకు కడుపు నిండుగా ఆకలి తీరుస్తుందన్నారు.కుల,మత,ప్రాంత,లింగ,ధనిక,పేద లాంటి ఏ భేదాలు లేకుండా అందరికీ సమాన హక్కులు,బాధ్యతలు కల్పించిన ఈ గొప్ప రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అన్నారు.బీజేపీ పార్టీ మహాత్మ గాంధీ వారసత్వాన్ని,డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ను అవమా నపరచడం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవం తం చెయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పండరి రావు, మహిళ అధ్యక్షురాలు కమల, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అమీర్ సుల్తాన్, జేమ్స్, టిల్లు, కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.



పెరుగుతున్న బీపీ, షుగర్ బాధితులు

- అపోలో హాస్పిటల్స్ ఐదో ఎడిషన్‌లో వెల్లడి


నవతెలంగాణ-సిటీబ్యూరో

హెల్త్ ఆఫ్ ది నేషన్-2025 పేరిట అపోలో హాస్పిటల్స్ ఐదో ఎడిషన్‌ని విడుదల చేసింది. ఇందులో దేశ ప్రజల ఆరోగ్యానికి సంబంధించి కొన్ని కీలకమైన అంశాలు వెల్లడయ్యాయి. "లక్షణాల కోసం ఎదురు చూడకండి - నివారణ ఆరోగ్యాన్ని మీ ప్రాధాన్యతగా చేసుకోండి" అనే మెసేజ్‌తో ఈ నివేదికను విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 25 లక్షల మంది ఆరోగ్యాన్ని పరీక్షించి దీన్ని రూపొందించారు. ఈ నివేదిక ఒక నిశ్శబ్ద మహమ్మారి గురించి తెలియజేసింది. లక్షణాలు కనిపించకపోయినప్పటికీ లక్షల మంది గుర్తించని దీర్ఘకాలిక వ్యాధులతో జీవిస్తున్నారు. గమనించదగ్గ విషయం ఏమిటంటే, 26శాతం మంది రక్తపోటు సమస్యతో, 23శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నట్టు తేలింది. అయినప్పటికీ వారికి ఎలాంటి లక్షణాలు కనిపించట్లేదు. 2019లో 10 లక్షల మంది ఆరోగ్య పరీక్షలు చేసుకోగా 2024లో 25 లక్షల మంది హెల్త్ టెస్టులు జరుపుకున్నారు. అంటే వీరి సంఖ్య ఐదేండ్లలో దాదాపు 150శాతం వద్ధి చెందిదన్నమాట. ఇది ప్రజల్లో నివారణ ఆరోగ్యం పట్ల అవగాహన, ఆసక్తి పెంచుతోందని తెలియజేస్తోంది. ఈ నివేదిక మూడు అత్యవసర ఆరోగ్య సవాళ్లపై దష్టి సారించింది. కొవ్వు కాలేయ వ్యాధి, రుతుస్రావం ఆగిన తర్వాత ఆరోగ్య క్షీణత, చిన్నారుల స్థూలకాయం రిపోర్ట్ అనే అంశాలు ఇందులో ఉన్నాయి. ఈ సందర్భంగా అపోలో చైర్మెన్ ప్రతాప రెడ్డి మాట్లాడుతూ "ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన కుటుంబాలను సష్టించేందుకు భారత్ ముందుకు రావాలి. ప్రతి ఇల్లు ఆరోగ్య కేంద్రంగా మారాలి. నివారణ ఆరోగ్య సంరక్షణ ఇకపై భవిష్యత్ ఆకాంక్ష కాదు. ఈ నివేదిక మన బాధ్యతను తెలియజేస్తోంది. ఆరోగ్య ప్రాధాన్యతను తెలియజేసే అంశాలను విద్యార్థులకు బోధించాలి. ఆరోగ్యాన్ని కూడా కుటుంబ దినచర్యల్లో భాగం చేయాలి. అప్పుడే వ్యాధుల చికిత్స నుంచి ఆరోగ్య సంరక్షణకు మారగలం, రాబోయే తరాలకు దఢమైన, ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని అందించగలం" అని అన్నారు. హాస్పిటల్ ఎండీ సునీతా రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య పరీక్షలు జరిపిన వారిలో 66శాతం మందికి కొవ్వు కాలేయం సమస్యలు ఉండగా.. వారిలో 85శాతం మంది మద్యానికి దూరంగా ఉన్నారు" అని తెలిపారు.

గెలీరియా మాల్‌లో ఉచిత వైద్య శిబిరం

- ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహణ

నవతెలంగాణ-సిటీబ్యూరో



ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అందరికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో నగరంలోని ప్రధాన ఆస్పత్రుల్లో ఒకటైన ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం పంజాగుట్టలోని నెక్స్ గెలిరియా మాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ శిబిరం కొనసాగింది. మాల్‌కు సుమారు 5 వేల మంది వరకు రాగా.. వారిలో 450 మందికి పైగా ఈ శిబిరంలో పాల్గొని నిపుణులైన వైద్యుల సేవలు వినియోగించుకున్నారు. ఇందులో ప్రధానంగా బరువు, ఎత్తు, రక్తపోటు, ర్యాండమ్ బ్లడ్ షుగర్, హెమోగ్లోబిన్, కంటి పరీక్ష, వైద్యుల సూచన మేరకు ఈసీజీ, 2డీ ఎకో లాంటి పరీక్షలు నిర్వహించారు. జనరల్ ఫిజిషియన్లు డాక్టర్ సమీర, డాక్టర్ లావణ్య, కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పవన్ కుమార్ ఇందులో పాల్గొని తమ సేవలందించారు. ఈ సందర్భంగా ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి సీఈఓ డాక్టర్ దేవానంద్ మాట్లాడుతూ "ఆరోగ్యకరమైన ప్రారంభంతో భవిష్యత్ ఆశాజనకంగా ఉంటుందన్నది. ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య దినోత్సవం థీమ్ ఇందుకు తగినట్టుగా ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్ బాగుంటుంది. ఈ రోజుల్లో వయస్సుతో సంబంధం లేకుండానే చాలా మందికి అధిక రక్తపోటు, మధుమేహం లాంటి సమస్యలు ఉంటున్నాయి. వాటివల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతాయి. ప్రతి ఒక్కరూ కనీసం ఏడాదికోసారి సమగ్ర వైద్య పరీక్షలు చేయించుకోవాలి. అప్పుడే వాటి విషయం తెలుస్తుంది. ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రిలో అన్ని విభాగాలకు సంబంధించిన నిపుణులు, అత్యాధునిక వైద్య పరికరాలు ఉన్నాయి. వీటిని అందరూ ఉపయోగించుకుని తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి" అని తెలిపారు.

యువకుల మధ్య ఘర్షణ



నవతెలంగాణ-బోడుప్పల్

ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోడుప్పల్ కార్పొరే షన్ పరిధిలో కిషోర్ అనే వ్యక్తి జిమ్ నిర్వహిస్తున్నాడు. సోమవారం నాడు సా యంత్రం 8 గం॥ సమయంలో చంటి అనే పాత స్నేహితుడితో పాటు మరో ముగ్గురు వ్యక్తులు జిమ్ వద్దకు వచ్చి జిమ్‌లో ఉపయోగించే డంబెల్స్‌తో విచక్షణారహితంగా దాడి చేశారు. అ దాడిలో తీవ్రంగా గాయపడిన కిషోర్ ను బోడుప్పల్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. కాగ జరిగిన ఘటనపై గాయపడిన కిషోర్ సోదరుడు కిరణ్ మేడిపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఘర్షణకు గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
మంగళవారం | ఏప్రిల్ 08, 2025 | www.navatelangana.com

ప్రజావాణికి 56 దరఖాస్తులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణి ఆర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 56 దరఖాస్తులను స్వీకరించారు. అట్టి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో గహ నిర్మాణ శాఖకు 18, పెన్షన్ 10, ఇతర శాఖలకు సంబంధించినవి 28 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి. ముకుంద రెడ్డి, డీఆర్ఓ ఈ. వెంకట చారి, ఆర్డిఓ సాయిరాం, జిల్లా అధికారులు పవన్ కుమార్, ఆశన్న సుబ్రహ్మణ్యం,కోటజీ, సురేందర్, రాజేందర్ , శ్రీరామ్,రమేష్ తదితరులు పాల్గొన్నారు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పేదలకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు.సోమవారం గోల్నాక తులసి నగర్ క్యాంపు కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై 25 మంది లబ్దిదారులకు చెక్కులను అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న నెల రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం చెక్కులను రిలీజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులు, పార్టీ నాయకులు రవీందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సేవలు అభినందనీయం..

- టీజీఎస్పీడీసీఎల్ ఎస్ఇ సోమిరెడ్డి



నవతెలంగాణ - ధూల్ పేట్

విద్యుత్ వినియోగదారులకు సేవలు చేయడం విద్యుత్ ఉద్యోగుల అదృష్టం, అభినందనీయమని టీజీఎస్పీడీసీఎల్ ఎస్ఇ సోమి రెడ్డి అన్నారు. సోమవారం సాలర్ జంగ్ మ్యూజియం సమీపంలోని మినార్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులు రాత్రి, పగలు పని చేస్తూ మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. ఉద్యోగులు చేసే పనికి ప్రజల నుంచి మెప్పు పొందాలంటే వారితో సఖ్యతగా మెలగాలన్నారు. విద్యుత్ అంతరాయం కలిగినప్పుడే ప్రజలు ఫ్యూస్ కాల్ నెంబర్‌కు ఫోన్ చేస్తారని, వెంటనే వారి సమస్యలు అడిగి తెలుసుకుంటే వారు కూడా సంతోషపడతారన్నారు. విద్యుత్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నప్పుడు తలకు హెల్మెట్, జాకెట్ ధరిస్తే ప్రజలు విద్యుత్ ఉద్యోగులని గుర్తించి ఇంకా ఏవైనా సమస్యలుంటే దృష్టికి తెస్తారన్నారు. పలువురు ఉద్యోగులు అధికారులకు పలు సమస్యలు వివరించారు. ఫ్యూస్ ఆఫ్ కాల్ సిబ్బంది ఎప్పుడు ఫోన్‌ను పక్కకు పెట్టవద్దని ప్రతి ఫోన్ కాల్ కు సమాధానం ఇవ్వాలన్నారు. పాత బస్తీలో సహితం కొత్త నగరానికి దీటుగా రానించాలంటే విద్యుత్ ఉద్యోగులు సంఘటితంగా పని చేస్తే మొదటి స్థానం సాధించావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ నంద్ కుమార్, విద్యుత్ శాఖ కమర్షియల్ డైరెక్టర్ సాయి బాబా, చక్రపాణి, తో పాటు విద్యుత్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజావాణిని ప్రజలు సద్వినియోగించుకోవాలి



- జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న

నవతెలంగాణ - ధూల్ పేట్

ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న సూచించారు. ఆయన పర్యవేక్షణలో చాంద్రాయణ గుట్ట సర్కి ఫూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అక్రమ నిర్మాణంపై చార్మినార్ సర్కిల్, రాజేంద్రనగర్ సర్కిల్‌కు చెందిన పలు ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్, ఏఎంసీ రాజారావు, టౌన్ ప్లానింగ్ సీటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, మలేరియా సీనియర్ ఎంటామాలజిస్ట్ నామాల శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఈ ఈ రామారావు, వెటర్నరీ సీనియర్ అసిస్టెంట్ హమీద్, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లుట్ల నవీన్ చంద్రకు అక్షర నీరాజనం



నవతెలంగాణ-ముషీరాబాద్

వరంగల్‌కు చెందిన కెనడా ప్రవాస భారతీయులు డా.నెల్లుట్ల నవీన్ చంద్ర పై 30 మంది రచయితలు రాసిన అక్షర నీరాజనం పుస్తకావిష్కరణ సభ సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ప్రముఖ రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కెనడాలో స్థిర నివాసం ఏర్పరచుకున్న డాక్టర్ నెల్లుట్ల నవీన్ చంద్ర సైంటిస్ట్ గా భౌతిక శాస్త్రవేత్తగా కెనడాలో 50 ఏండ్లు ప్రవాస భారతీయుడు గా ఉండి తెలుగు భాషాభిమానం పట్ల ఎనలేని గౌరవంతో ఉన్నారన్నారు. కవిగా సాహితీవేత్తగా తెలుగు రచయితలందర్నీ ఒక వేదిక మీదికి తెచ్చి తెలుగు కవులను రచయితలను, మంచి రచనలను నిరంతరం ప్రోత్సహిస్తూ అనేక పుస్తకాలను ప్రపంచానికి అందించారన్నారు. అన్య భాషలు ఎన్ని నేర్చినా తెలుగును మరిచిపోవద్దంటు చాటి చెప్పారన్నారు. తన ఇల్లే చైతన్య వేదికగా తెలుగు కవులను తెలుగు రచయిత్రులను నిరంతరం ప్రోత్సహించేవారని.. ఆయన ఇటీవల మరణించడం తెలుగు భాషకు తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. తెలుగు కవులందరూ ఆయనకు నివాళిగా అక్షర నీరాజనం అనే పుస్తకాన్ని తీసుకొచ్చి ఆయన తెలుగుకు చేసిన కృషిని అభివర్ణించారు . ఈ కార్యక్రమంలో కొంపల్లి కామేశ్వరరావు, నెల్లుట్ల ఇందుశ్రీ ,గోపాలకష్ణ కష్ణమూర్తి, ప్రమోద్ ఆవంఛ టీవీ శర్మ ,లలితా చండి కిరణ్మయి ,రాణి పాలడుగు తదితర కవులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోంది



- కాంగ్రెస్ బహదూర్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ కుమార్

నవతెలంగాణ - ధూల్‌పేట్

కేంద్ర ప్రభుత్వ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని కాంగ్రెస్ బహదూర్పురా నియోజకవర్గం ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ కుమార్..అన్నారు. బహదూర్‌పురా నియోజకవర్గంలోని అన్ని డివిజన్ అధ్యక్షులతో కలిసి దూద్ బౌలిలో సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు, టీపీసీసీ తీసుకున్న జై బాపు, జై భీం, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉంటున్నాయన్నారు. ఈ సందేశాన్ని గడప గడపకు వెళ్లి వివరించాలని, అలాగే ప్రతి కుటుంబాన్ని కలిసి వారి సమస్యలు తెలుసుకోవడానికి ఈ పాదయాత్ర ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వారి సమస్యలను పార్టీ దష్టికి, ప్రభుత్వ దష్టికి తీసుకొచ్చి పరిష్కరించేలా ప్రయత్నించాలని కోరారు. ఈ పాదయాత్రలను పర్యావేక్షించడానికి రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ కాసుల బాలరాజు ని నియోజకవర్గానికి పర్యావేక్షుడిగా కాంగ్రెస్ నియమించిందన్నారు. వారి సూచనా, సలహాలతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. నియోజకవర్గ డివిజన్ అధ్యక్షులు ఎండీ. నజీర్ ఖాన్, భాను చందర్ యాదవ్, హామీరుద్దీన్, నసీర్ ఫారూకీ, గులాం నబి, సీనియర్ కాంగ్రెస్ నాయకులూ అబేద్ అలీ, మీర్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త గడి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

- వికారాబాద్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించిన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్



నవతెలంగాణ - ముషీరాబాద్

ఎస్సీ ఎస్టీ బాలికలను కులం పేరుతో దూషించి దాడి చేసిన వికారాబాద్ జిల్లా కొత్త గడి సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సాయిలతను సస్పెండ్ చేయాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య వికారాబాద్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని దళిత బహుజన ఫ్రంట్, మానవ హక్కుల వేదిక, ఎంవీ ఫౌండెషన్ సంస్థలు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు పిర్యాదు చేయగా స్పందించిన చైర్మెన్ వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చెసి బాలికల పై దాడి సంఘటన వివరాలను తెలుసుకు న్నారు. బాలికల పై దాడి చేసి కులం పేరుతో అవమానించిన ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. సస్పెండ్ చెసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు రోహిత్ లు పాల్గొన్నారు.


విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేసిన డాక్టర్ ముజీబ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మెన్, సేవారత్న డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ (ముజీబ్) చిన్ననాటి స్నేహితుడు రఘు అకాల మరణంతో అతని కూతురు దివ్య అనాథగా మారింది. ఈ విషయం తెలుసుకుని డాక్టర్ ముజీబ్ తమ ట్రస్ట్ ద్వారా స్నేహితుడి కుమార్తె చదువు బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ఒవైసీ కాలేజీలో చదువుతున్న దివ్య చదువుకు సంబంధించిన సెమిస్టర్ ఫీజు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం మూడో విడుతకు సంబంధించిన రూ. 28వేల చెక్కును నాంపల్లి గృహకల్పలోని టీఎన్జీవోస్ జిల్లా కార్యాలయంలో అందజేశారు. భవిష్యత్తులో విద్యార్థి దివ్యకు కావాల్సిన అన్ని సౌకర్యాలను ట్రస్ట్ ద్వారా అందజేస్తామని ట్రస్ట్ చైర్మెన్ ముజీబ్ తెలిపారు.

వంటింట్లో గ్యాస్ మంట!



- హైదరాబాద్ జిల్లాలో 19 లక్షల గ్యాస్ కనెక్షన్లు
- సాధారణ సిలిండర్‌పై రూ.50 పెరిగి రూ.905కు..
- నగర ప్రజలపై రూ. 9.5 కోట్ల అదనపు భారం

నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతూ.. సామాన్యులకు గట్టి షాకిచ్చింది. ఒకవైపు పెరుగుతున్న నిత్యావసర ధరలతో సతమతవుతున్న సామాన్యుడి నెత్తిమీద కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వంటింటి గ్యాస్ ధర పెంచి అదనపు భారం మోపింది. ఈ మేరకు సోమవారం గృహ వినియోగదారులు వాడే గ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచుతున్నట్టు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరి ప్రకటించారు. పెంచిన సిలిండర్ ధర మంగళవారం నుంచి అమల్లోకి రానున్నాయి. తాజా పెంపుతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై మరింత అదనపు భారం పడినట్టయ్యింది. ఇప్పటికే వంట గ్యాస్ సబ్సిడీలను ఎత్తివేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. మరోసారి ధరల పెంపు నిర్ణయం తీసుకోవడంతో సామాన్య ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. తాజాగా పెరిగిన ధరతో జిల్లాలోని గ్యాస్ వినియోగదారులపై నెలకు సుమారు 9.5కోట్లకుపైగా అదనపు భారం పడనుంది. గ్యాస్ సిలిండర్ ధర పెంపుపై నగర మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్ జిల్లావ్యాప్తంగా మొత్తం 68 గ్యాస్ ఏజెన్సీలుండగా.. వీటి పరిధిలో 19లక్షల వరకు వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో సాధారణ కనెక్షన్లు 17.39లక్షలు ఉండగా.. దీపం కనెక్షన్లు 1,59,023, ఉజ్వల కనెక్షన్లు 1,259 ఉన్నాయి. కాగా ఒక్కో కటుంబానికి ఏడాదిలో నెలకు ఒకటి చొప్పున మొత్తం 12 సిలిండర్లు రాయితీపై వినియోగించే వెసులుబాటు ఉంది. ఇదిలావుంటే ప్రస్తుతం నగరంలో 14.2కిలోల ఎల్పీజీ సిలిండర్ ధర రూ.855గా ఉంది. తాజాగా ధర పెంచడంతో రూ. 905కు చేరింది. ఈ లెక్కన ప్రస్తుతం పెరిగిన గ్యాస్ ధర రూ.50తో పోల్చి చూస్తే 19లక్షల కుటుంబాలకు ఒక్కో సిలిండర్‌పై ఒక నెలకు సరాసరి రూ.9.5కోట్ల భారం పడతుంది. ఒకవైపు పెరిగిన నిత్యావసరాల ధరలతో సామాన్యుడి బడ్జెట్‌పై ప్రభావం చూపుతుండగా.. మరోవైపు తాజాగా పెరిగిన గ్యాస్ ధర వారిపై మరింత అదనపు భారం పడనుంది.

సర్కారుపైనే అదనపు భారం..!

హైదరాబాద్ జిల్లాలో ఇప్పటివరకు సిలిండరు ధర రూ. 855 ఉండగా.. ఇప్పుడు రూ. 50 పెరిగి ఆ ధర రూ.905 చేరింది. సిలిండర్ తీసుకునే వినియోగదారులు గ్యాస్ కోసం పెంచిన ధరను చెల్లించాల్సిందే. అయితే ఇందులో బీపీఎల్ కుటుంబాలకు కేంద్రం ఒక్క సిలిండర్‌పై రూ.40 సబ్సిడీ వారి ఖాతాల్లో జమ చేస్తోంది. మరోపక్క రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.500లకే సిలిండర్ అందజేస్తోంది. మొత్తం 855కు లభించే సిలిండర్‌లో కేంద్రం తన వాటా కింద రూ.40 ఇవ్వగాపోను.. ప్రస్తుత ప్రభుత్వం ఒక్క సిలిండర్‌కు రూ.815 చమురు సంస్థలకు చెల్లిస్తూ.. బీపీఎల్ కుటుంబాలకు మాత్రం రూ.500లకే అందజేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో 3,48,498 మంది మహిళలు మహాలక్ష్మి పథకం ద్వారా లబ్ది పొందుతున్నారు. తాజాగా సిలిండర్‌పై పెరిగిన రూ.50 కేంద్రం చెల్లిస్తుందా? లేదా రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుందా? అనేదానిపై క్లారిటీ లేదు. కేంద్ర మంత్రి చెప్పిన ప్రకారం చూస్తే.. ఈ అదనపు భారం రాష్ట్ర ప్రభుత్వంపైనే పడనుందని తెలుస్తోంది. అదే జరిగితే ఒక్క గ్రేటర్ పరిధిలోనే 3.48లక్షలకుగాను 1.74కోట్ల రూపాయల అదనపు భారం పడనుంది. ఆ లెక్కన రాష్ట్రవ్యాప్తంగా చూస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇదే పెనుభారంగా మారనుంది.

11న నియోజకవర్గాల పునర్విభజనపై రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఈనెల 11న ప్రజా ఏక్తా పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గాల పునర్విభజన అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ అధినేత బోనాల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తమ అభిప్రాయాలను వెల్లడిస్తారని తెలిపారు.



బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదు

నవతెలంగాణ - ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం లో బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం వేస్తే భారీ జరిమానా విధిస్తామని జీహెచ్ఎంసి అధికారులు తెలిపారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని జీహెచ్ఎంసీ జవాన్ రాజేష్ ఆధ్వర్యంలో ప్రజలకు ప్రత్యేక అవగాహన నిర్వహించారు. అంబేద్కర్ కళాశాల ప్రాంగణంలో తీవ్రస్థాయిలో చెత్తాచెదారం వేస్తున్నారని ఫిర్యాదుతో పారిశుధ్య కార్మికుల తో పరిసరాలు పరిశుభ్రం చేయించి ఆ ప్రాంతంలో మైక్ తో కూడిన కెమెరాను అమర్చి ఈ ప్రాంతంలో చెత్తాచెదారం వేసే భారీ జరిమానా విధిస్తామని తెలిపారు.



వైద్యులు దేవునితో సమానం

- టీడీపీ హైదరాబాద్ పార్లమెంట్ కో- ఆర్డినేటర్ నాగు నగేష్

నవతెలంగాణ - ధూల్ పేట్

రోగులకు చికిత్సచేసే వైద్యులు దేవునితో సమానం అని తెలుగుదేశం పార్టీ హైదరాబాద్ పార్లమెంటు కో- ఆర్డినేటర్ నాగు నగేష్ అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పార్టీ ఆధ్వర్యం లో రక్షాపురం లోని ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మురళీ డిస్టిక్ ఎస్పీహెచ్ డా.లక్ష్మమ్మ, పి హెచ్ ఎన్, ఈ. స్వాతి, సిస్టర్ మహేశ్వరి, ఆషలను శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రిలో ప్రజలకు వైద్యం అందిస్తూ సేవలు చేసిన వారిని సన్మానించి అభినందించామన్నారు. తెలుగుదేశం సీనియర్ నాయకులు సమీయుదిన్ రఫిక్, బి.వై. శ్రీకాంత్, జోగేందర్‌సింగ్ , సత్యకష్ణ, అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గోపాల్ రావు మృతికి సీపీఐ, ఏఐటీయూసీ సంతాపం

నవతెలంగాణ-హిమాయత్ నగర్



సీఐటీయూ నాయకులు జి.టి. గోపాల్ రావు డీఎల్ఆర్ఎల్ డిఫెన్స్ సంస్థలో పని చేస్తూ తన జీవితాంతం ఉద్యోగ కార్మికుల బాగు కోసం అహర్నిశలు పని చేశారని, యాజమాన్యం తనపై కక్షపూరిత ధోరణితో ఉద్యోగంలో నుండి తొలగించినా అలుపెరుగని పోరాటం చేస్తూ డిఫెన్స్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలతో పాటు అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పని చేసే ఉద్యోగుల బాగు కోసం పని చేసి న గొప్ప నాయకుడని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా ఉద్యోగ కార్మికుల మేలు తప్ప మరో ధ్యాసలేని గోపాల్ రావు భయంకరమైన క్యాన్సర్ బారినపడి చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారన్నారు. జి.టి. గోపాల్‌రావు తన జీవితంలో స్వార్థం లేకుండా నిస్వార్థంగా పని చేసి ఉద్యోగుల ఆదరాభిమానాలను చురగొని యాజమాన్యాలతో అనేక ఇక్కట్లకు గురైనా మొక్కవోని ధైర్యంతో తాను నమ్మిన సిద్ధాంతం కోసం పని చేశారని గుర్తు చేశారు. సోమవారం జరిగిన జి.టి.గోపాల్ రావు అంతిమయాత్రలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.చంద్రయ్య, నాయకులు జి.డి.రాములు తదితరులు పాల్గొని భౌతికకాయంపై పుష్పగుచ్చాలుంచి ఘనమైన నివాళులర్పించారు.అయన మృతికి ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఘనంగా ఇందిరా ప్రియదర్శిని మహిళా కళాశాల వార్షికోత్సవం



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఘనంగా ఇంద్ర ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల 44వ వార్షికోత్సవం నిర్వహించారు. సోమవారం నాంపల్లిలోని ఇంద్ర ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్ర ముఖర్జీ 2024- 25 సంవత్సర కాలంలో కళాశాల విద్యార్థులు సాధించిన విజయాలు, సాంస్కృతిక పోటీలు, వివిధ క్రీడా పోటీల్లో సాధించిన విజయాలను తెలిపారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డీఎస్ అర్ రాజేందర్ పాల్గొని మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టాప్ టెన్ కళాశాలలో ఇంద్ర ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ఒకటిగా ఉందని తెలిపారు. ఎన్ఏఏసీ "ఏ"గ్రేడ్ సాధించడం ద్వారా తెలంగాణ యువతులకు ఉత్తమ నాణ్యమైన విద్యను అందిస్తూ వారిలోని నైపుణ్యాన్ని నిరూపించుకుంటూ ముందుకు సాగుతున్న విద్యార్థినిలను అభినందించారు. గొప్ప పరిశోధన అనుభవాలను విద్యార్థులకు వివరిస్తూ వారి భవిష్యత్తు జీవితంలో స్థిరపడేలా చేస్తున్న అధ్యాపక బందాన్ని అభినందించారు. విద్యార్థినీలు యూపీఎస్సీ, గ్రూప్ వన్‌లలో కూడా విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ మిమిక్రీ కళాకారుడు ఎం జితేంద్ర నాథ్ అద్భుతమైన మిమిక్రీతో అలరించారు. ఈ కార్యక్రమంలో సీసీఈ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి, ప్రొఫెసర్లు, మీడియా ఇన్‌చార్జి ఇ.పావని, డిగ్రీ విద్యార్థినిలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

జీవనశైలిలో మార్పులు అత్యవసరం

- హెచ్‌సీఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య



నవతెలంగాణ - ముషీరాబాద్

బీపీ, షుగర్ పేషెంట్లకు మందుల వాడకంతో పాటు, జీవనశైలిలో కూడా మార్పులు అవసరమని ప్రముఖ డాక్టర్లు, నిపుణులు హెచ్చరిస్తున్నారని హెచ్.సి.ఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం (హైదరాబాద్ జిందాబాద్) ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీపీ-షుగర్ ఉచిత మెడికల్ క్యాంప్ కు ఉచిత సేవలు అందిస్తున్న డాక్టర్లను సన్మానించారు. డాక్టర్ రాజును హెచ్‌సీఎఫ్ ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, డాక్టర్ నాగుని, మోహన్ నాయుడు శాలువా కప్పి సన్మానించి, మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా కె.వీరయ్య మాట్లాడుతూ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని, బడ్జెట్లో కేటాయింపులు కూడా తగిన విధంగా కేటాయించడం లేదని విమర్శించారు. ప్రస్తుతం ప్రజానీకం వైద్య సదుపాయాల కోసం, ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. బీపీ, షుగర్ పేషెంట్లకు మందుల వాడకంతోపాటు, వ్యాయామం, వాకింగ్ చేస్తేనే ఉపయోగమన్నారు. హెచ్.సి.ఎఫ్ ఆధ్వర్యంలో గత ఎనిమిదేండ్లుగా బీపీ - షుగర్ పేషెంట్లకు ఉచిత సేవలందిస్తున్నామని, ఇప్పటికి 102 నెలలలో, 102 క్యాంపులు పూర్తయ్యాయన్నారు. ఈ ఉచిత మెడికల్ క్యాంపులలో ఉచిత సేవలు అందించిన డాక్టర్లకు, డాక్టర్ రాజు, డాక్టర్ నాగులకు ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉచిత మెడికల్ క్యాంపులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో హెచ్‌సీఎఫ్ నాయకులు పి.శ్రీనివాసరావు, ఎం శ్రీనివాసరావు, సంగీత, అస్మిత, నాగేష్, రాజమౌళి, సైదులు, సుకుమార్, గోపాల్, శంకర్, మహేందర్, శంకరయ్య, రమేష్, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలి



- నేషనల్ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ
- ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్షకు పలు బీసీ సంఘాల సంఘీభావం

నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బీసీ బిల్లును పార్లమెంట్ లో ఆమోదించి, 9వ షెడ్యూల్ లో చేర్చాలని నేషనల్ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన బీసీ ఆజాది జేఏసీ చైర్మెన్ బత్తుల సిద్దేశ్వర్ పటేల్, జక్కని సంజయ్‌లకు సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలు బీసీ సంఘాలు సంఘీభావం తెలుపుతూ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ జనగణనలో కులగణన చేర్చాలని కోరారు. రాష్ట్రంలో కులగణన, విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో బీసీ జనాభా దామాషా వాటా కోసం హైదరాబాద్‌లో 12 రోజుల ఆమరణ దీక్ష ఫలితంగా నేడు బీసీలు కులగణన సాధించామన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు, బడ్జెట్ కేటాయించాలని, దీంతో అందరికీ సామాజిక న్యాయం అందుతుందన్నారు. ఢిల్లీలో చేపట్టిన బీసీల ఆమరణ నిరాహార దీక్షకు బీసీ ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకులు, బీజేపీ మంత్రులు ఢిల్లీకి వెళ్లి మద్దతు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రంలోని ప్రతి గ్రామ, మండల, జిల్లా కేంద్రాల్లోని మంత్రుల కార్యాలయాలు, ఇండ్లను ముట్టడించి, బీసీ మంత్రులను నిలదీస్తామని హెచ్చరించారు. అనంతరం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ మాట్లాడుతూ బీజేపీ నాయకులు, ఎమ్మెల్యే, ఎంపీలు బీసీలు చేపడుతున్న పోరాటాలు, ఆమరణ నిరాహార దీక్షలకు మద్దతు తెలపడంలో ఎందుకు ఆలోచిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే రఘునందన్ రావు, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్ని సమస్యలపై స్పందిస్తున్నప్పుడు బీసీ సమస్యలు, డిమాండ్లపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాలను ఢిల్లీ, ప్రధాని మోడీ వద్దకు తీసుకెళ్ళి బీసీ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.అన్ని రాజకీయ పార్టీలు బీసీ బిల్లుకు మద్దతిస్తున్నాయని, కేవలం బీజేపీ మాత్రమే బిల్లుకు మద్దతు ఇవ్వడం లేదని విమర్శించారు. మద్దతు ప్రకటించాలని, లేకపోతే రాబోయే ఎన్నికల్లో భంగపాటు తప్పదని, బీసీల సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షులు బొంగు ప్రసాద్ గౌడ్, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ కుమార్, హిందూ బీసీ మహాసభ అధ్యక్షులు పర్వత సతీష్ కుమార్, నాయకులు నగేష్ భూషణ్, కమ్మెట భూపాల్, బొంపల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

ఈ పండుతో ఎన్ని లాభాల్లో...

వేసవి కాలం... ఎండలు దంచి కొడుతున్నాయి. ఈ సమయంలో మనం ఎక్కువగా డీహైడ్రేషన్ బారిన పడతాం. దాని నుండి బయటపడటానికి ఎక్కువగా నీళ్ల, జ్యూస్ తాగడం, పళ్ల తినడం లాంటివి చేయాలి. ఎండాకాలంలో వేడి నుండి ఉపశమనం కలిగించే పండ్లలో కర్బూజ ఒకటి. ఇది దోస జాతికి చెందిన ఫ్రూట్. దీనిని తినడంతోపాటు జ్యూస్ కూడా తాగుతారు. ఈ పండు తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకుందాం.



- కర్బూజ పండు తినడం వల్ల బాడీ డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉంటుంది.
- గుండెల్లోని మంటలను తగ్గించడంలో ఈ పండు బాగా పనిచేస్తుంది.
- ఇందులో ఉండే యాంటియాక్సిడెంట్లు ఊబకాయాన్ని తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. అంతేకాకుండా శరీర కణాలను ఆరోగ్యంగా ఉంచుతాయి.
- ఈ పండులో అధిక మొత్తంలో ఆర్గానికి ఫిగ్మెంట్ కెరోటినాయిడ్ ఉంటుంది. ఇది క్యాన్సర్ రాకుండా అడ్డుకుంటుంది.
- కర్బూజలో విటమిన్-ఎ, బీటా కెరొటిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది కళ్ల పనితీరును మెరుగుపరుస్తుంది.
- ఇది బీపీని కంట్రోల్ లో ఉంచుతుంది. అంతేకాకుండా ఆజీర్తి, మూత్ర సంబంధిత వ్యాధులను దూరం చేస్తుంది.

మరింత ప్రోత్సహిస్తే..

'కొడితే కొట్టాలిరా సిక్స్ కొట్టాలి. ఆడితే ఆడాలిరా రప్ఫాడాలి.. పోటీ ఉన్నా గానీ గెలుపొంది తీరాలి.. చరిత్రలో నీకూ ఒక పేజీ ఉండాలి' అంటూ సాగే పాట మనందరికీ తెలిసిందే. చంద్రబోస్ సాహిత్యానికి ప్రతిరూపంగా అనూష క్రీడా ప్రస్థానం కొనసాగుతోంది. చిన్నప్పటి నుంచే ఆటలపై ఆసక్తి పెంచుకున్న ఆమె ఆ తర్వాత టెన్నిస్ క్రీడాకారిణిగా గుర్తింపు పొందారు. ఇప్పుడు సాఫ్ట్ టెన్నిస్ క్రీడాకారిణిగా అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ అందరినోటా శభాష్ అని పిలిపించుకుంటున్న ఆమె పరిచయం...







విజయవాడకు చెందిన అనూష నెలకుదుటి 2002 ఏప్రిల్ 15న పుట్టారు. తల్లి నిర్మల, గృహిణి. తండ్రి నెలకుదుటి శంకరరావు వ్యాపావేత్త. అనూషకు చిన్నప్పటి నుంచి ఆటలంటే చాలా ఇష్టం. దాంతో తల్లిదండ్రులు ఆమెను ఆవైపుగా ప్రోత్సహించారు. అథ్లెటిక్స్, రన్నింగ్, టెన్నిస్, క్రికెట్, వాలీబాల్ వంటి ఆటల్లో బాగా ముందుండేవారు. పదోతరగతి వరకూ కెసిపి సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూలులోనూ, ఇంటర్ శారద జూనియర్ కళాశాలలోనూ, బిఎ డిగ్రీని ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పూర్తిచేశారు. ప్రస్తుతం పిబి సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఎంబిఎ మొదటి ఏడాది చదువుతున్నారు. చదువులో మంచి ఉత్తీర్ణత సాధిస్తూనే సాఫ్ట్‌టెన్నిస్‌లో రాష్ట్ర, జాతీయస్థాయిలో సింగిల్స్, డబుల్స్, మిక్సిడ్ డబుల్స్‌లో అనేక పతకాలు సాధించారు.



ఒడిసి పట్టడంలో దిట్ట

అనూష బరిలోకి దిగితే మెరుపు వేగమే. సాఫ్ట్‌గా ఉండే బంతిని నేర్పుగా కొడుతూ ఆటలో ఉత్సాహాన్ని ఉరకలెత్తిస్తారు. రాకెట్ వేగంతో బంతిని ప్రత్యర్థుల కోర్టులోకి నెట్టి పాయింట్లను ఒడిసి పట్టడంలో ఆమె దిట్ట. ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్), ఏపి సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ తోడ్పాటు, తల్లిదండ్రుల ప్రోత్సాహం, చదివిన ప్రతిచోటా ఆయా విద్యాసంస్థల సహకారం తోడవ్వటంతో ఈ క్రీడలో అనూష రాణిస్తున్నారు.

సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రోత్సాహం

టెన్నిస్‌తో పాటుగా సాఫ్ట్ టెన్నిస్‌లో అనూష ప్రతిభను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులు ఆమెకు మరింత నైపుణ్యమైన శిక్షణను అందించటంతో దానిలో నిపుణత సాధించారు. 2002 నుంచి సాఫ్ట్ టెన్నిస్‌పై రాష్ట్రంలో ఆదరణ పెరిగింది. రాష్ట్ర విభజన అనంతరం 2018లో విజయవాడ కేంద్రంగా క్రీడాకారులను తయారు చేసేందుకు అసోసియేషన్ శిక్షణను ప్రారంభించింది. విజయవాడ కేంద్రంగా ప్రారంభమైన శిక్షణ అనూషకు ఎంతో ఉపయోగపడింది. ఇదే క్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు కొనసాగుతూ వస్తుండటంతో ఎందరో క్రీడాకారులు సైతం వెలుగులోకి వచ్చారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయిలో సబ్‌జూనియర్, అండర్ 17, అండర్ 19 సీనియర్ విభాగాల్లో పోటీలు జరిగ్గా అనూష పాల్గొన్న అన్నింటా విజయఢంకా మోగించారు. ప్రోత్సహిస్తేనే గుర్తింపు

దేశంలోని ఉత్తరాది రాష్ట్రాల్లో సాఫ్ట్ టెన్నిస్ క్రీడకు విశేష ప్రాచుర్యం ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లోనూ తమిళనాడు, కర్నాటక, కేరళలో ప్రోత్సాహాలు ఉండగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గతంలో అంతగా ప్రోత్సాహం లేదు. అప్పట్లో ఢిల్లీలోని అకాడమీ ద్వారా మెరుగైన శిక్షణ అందటంతో ఎక్కువమంది అక్కడికి వెళ్లేందుకు ఇష్టపడేవారు. అనూష కూడా అక్కడ శిక్షణ పొందారు. ఆంధ్రాలో శాప్ ద్వారా ప్రోత్సాహం అందుతోంది. రాష్ట్రప్రభుత్వం నగదు ప్రోత్సాహాలను అందించటంతో జాతీయస్థాయిలో అనూష పతకాలు సాధించటానికి కృషిచేస్తున్నారు. అయితే దేశ, విదేశాల్లో వివిధ పోటీల్లో పాల్గొటానికి ఆమె ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ప్రపంచ చాంఫియన్ లక్ష్యంగా...



సాఫ్ట్‌టెన్నిస్ క్రీడలో అత్యున్నతంగా భావించే ఏషియన్, వరల్డ్ చాంఫియన్‌షిఫ్‌లో పతకాలు సాధించటం ద్వారా భారతదేశ ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లాలన్నదే నా లక్ష్యం. ఆ దిశగా ప్రాక్టీస్ చేస్తూ కృషిచేస్తున్నాను. శాప్, ఏపీ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ద్వారా అందిస్తున్న సహకారం ముదావహం. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రోత్సహిస్తే మరింతగా రాణిస్తా.

- నెలకుదుటి అనూష

తిరుగులేని విజయం

ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో మార్చి 23 నుంచి 26వ తేదీ వరకూ జరిగిన ఒకటో ఏషియన్ సాఫ్ట్ టెన్నిస్ చాంఫియన్‌షిఫ్‌లో మహిళల విభాగంలో భారత జట్టు స్వర్ణపతకం సాధించింది. అనూష భారతజట్టు తరపున ప్రాతినిధ్యం వహించగా.. టీమ్ విభాగంలో బంగారు, డబుల్స్, మిక్సిడ్ డబుల్స్‌లో కాంస్య పతకాలను సాధించారు. మార్చి 16 నుంచి 22 వరకూ రెండో ఇండియా ఇంటర్నేషనల్ సాఫ్ట్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఆమె భారత జట్టు తరపున ప్రాతినిధ్యం వహించారు. భారత మహిళా జట్టు కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. పతకాలు సాధించిన భారతజట్టుతో పాటుగా అనూషను ప్రభుత్వం ఘనంగా సత్కరించింది.

సాధించిన పతకాలు ఇవే

17వ వరల్డ్ సాఫ్ట్ టెన్నిస్ చాంఫియన్‌షిఫ్-2024 (కొరియా-అన్సెంగ్), 17వ పోలెండ్ కప్ (గ్రోడ్జిక్స్)-2024-వ్యక్తిగత సింగిల్స్, డబుల్స్, మిక్సిడ్ డబుల్స్‌లో బ్రౌంజ్ మెడల్, 19వ ఏషియన్ గేమ్స్ (చైనా-హ్యాంగ్జౌ)-2023-ఉమెన్ టీమ్ 5వ స్థానం, సుంశాంగ్ ఓపెన్ ఇంటర్నేషనల్ సాఫ్ట్ టెన్నిస్ టోర్నమెంట్ (దక్షిణకొరియా) 2023, ది కింగ్ కప్ ఇంపాక్ట్ స్పోర్ట్ వరల్డ్ టూర్ ఇంటర్నేషనల్ సాఫ్ట్ టెన్నిస్ చాంఫియన్‌షిఫ్ (థారులాండ్-బ్యాంకాక్)-2022, విండివిడ్యువల్, విండివిడ్యువల్ డబుల్‌లో బ్రౌంజ్, టీమ్ ఈవెంట్‌లో గోల్డ్, ఐఎస్‌టిఎఫ్ వరల్డ్ టూర్ ఇంటర్నేషనల్ సాఫ్ట్ టెన్నిస్ చాంఫియన్‌షిప్-2022 (థారులాండ్-పట్టయ)-విండువిడ్యువల్ డబుల్స్, మిక్సిడ్ డబుల్స్, టీమ్ ఈవెంట్‌లో బ్రౌంజ్ మెడళ్లు, పోలెండ్ కప్-ఇంటర్నేషనల్ సాఫ్ట్ టెన్నిస్ టోర్నమెంట్-2022 (పోలెండ్), మొదటి ఆషియన్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంఫియన్‌షిప్ -2019 (ఫిలిఫ్పీన్స్)లో 13వ స్థానం సాధించారు.

- యడవల్లి శ్రీనివాసరావు

బనకచర్లపై గరంగరం

(మొదటిపేజీ తరువాయి)

చైర్మెన్ ఏకే ప్రధాన్ అధ్యక్షతన జరిగింది. దీనికి రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్య అధికారులు హాజరయ్యారు. ఇందులో ఏపీ, తెలంగాణ అధికారుల మధ్య వాదనలు వాడీవేడిగా సాగాయి. ఈ సందర్భంగా బనకచర్ల ప్రాజెక్టు, తెలంగాణపై దాని ప్రభావం, జీఆర్ఎంబీ కార్యదర్శి అజగేషన్ ప్రవర్తన, ఇతర అంశాలు చర్చకొచ్చాయి. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ జీఆర్ఎంబీని తీవ్రంగా ప్రశ్నించింది. ఏపీ సర్కారును తప్పుబట్టింది. గోదావరి-బనకచర్ల అనుసంధానాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ వాదనలు వినిపించింది. రూ.80 వేల కోట్లతో ప్రాజెక్టు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని తెలియజేసింది. 180టీఎంసీల మిగులు జలాలను తరలించాలనే లక్ష్యంతో ఏపీ సర్కారు పని చేస్తున్నదని గుర్తు చేసింది. అలాగే ఈ ప్రాజెక్టు కోసం నాగార్జునసాగర్ కుడికాలువ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించింది. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం జీఆర్ఎంబీకి లేఖ రాసినా పట్టించుకోకపోవడంపై నిరసన వ్యక్తం చేసింది. ఏపీ సర్కారు సమాచారంతోపాటు ఇతర వివరాలను దాచిపెడుతున్నదని తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు జీఆర్ఎంబీ చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టు అంశంపై బోర్డుకు కేంద్రం నుంచి లేఖ వచ్చి దాదాపు ఐదు నెలలు కావస్తున్నా పట్టించుకోలేదన్నారు. లేఖ వచ్చిన సంగతిని కూడా తెలంగాణకు చెప్పకుండా బోర్డు నిర్లక్ష్యం చేసిందని గుర్తు చేశారు. బనకచర్ల ప్రాజెక్టు పూర్తి వివరాలు, దాని మూలంగా తెలంగాణపై ప్రభావం తదితర వివరాలను ఏపీ ప్రభుత్వం అందించాలని తెలంగాణ అధికారులు బోర్డును కోరారు. ఈ మేరకు ఆ రాష్ట్రానికి ఆదేశాలివ్వాలని తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా సూచించారు. అనుమతులు లేకుండా ప్రాజెక్టు చేపడుతున్నారని తెలంగాణ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఏపీ అధికారులు స్పందిస్తూ బనకచర్ల ప్రాజెక్టుకు ఇంకా డీపీఆర్ తయారు చేయలేదని వివరణ ఇచ్చారు. తాము ఎలాంటి పనులు చేయడం లేదని ఏపీ ఈఎన్సీ వెంకటేశ్వర్‌రావు తెలియజేశారు. మరోవైపు తెలంగాణలో పెద్దవాగు ప్రాజెక్టు ఆధునీకరణ పనులపై సమావేశంలో చర్చించారు. రూ. 15 కోట్లతో తక్షణ మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జీఆర్ఎంబీ కార్యదర్శి అజగేషన్ వ్యవహార శైలిని తెలంగాణ అధికారులు ప్రస్తావించారు. రాష్ట్రాలను సంప్రదించకుండానే బోర్డు సమావేశాలను నిర్వహిస్తున్నారని విమర్శించారు. అంతేకాకుండా జీఆర్ఎంబీలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఏపీ, తెలంగాణకు చెందిన అధికారులను అజగేషన్ వేధిస్తున్నారనీ, మహిళా ఉద్యోగులను అసభ్యకర మాటలతో దూషిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలాయన్ రోకో.. నౌకరీ దో

బీహార్‌లో ఎన్ఎస్‌యూఐ నిర్వహించిన ర్యాలీలో రాహుల్

బెగుసరాయ్ : బీహార్ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ..రాజకీయం వేడెక్కుతోంది. అక్కడి నితీశ్ సర్కార్‌పై స్థానిక ఓటర్లు ఆగ్రహం వ్యక్తమవుతోంది. బీజేపీతో జత కట్టిన జేడీయూ సీట్ల పంచాయతీ భయం వెంటాడుతోంది. ఇప్పటికే ఆర్జేడీ ఓటు రాజకీయానికి అస్త్రాలు సిద్ధం చేసుకుంటోంది.మరోవైపు కాంగ్రెస్ కూడా రంగంలోకి దిగింది. కాంగ్రెస్ విద్యార్థి విభాగం (ఎన్ఎస్‌యూఐ) బీహార్‌లోని బెగుసరాయలో 'పలాయన్ రోకో.. నౌకరి దో (వలసలు ఆపండి.. ఉద్యోగాలు ఇవ్వండి)' అనే ర్యాలీ చేపట్టింది. ఎన్ఎస్‌యూఐ జాతీయ ఇన్‌చార్జి కన్నయ్య కుమార్ నేతృత్వంలో జరుగుతున్న ఈ ర్యాలీలో లోక్‌సభ ప్రతిపక్షనేత, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు.సోమవారం పాట్నాలో జరిగిన బహిరంగ సభలో రాహుల్ ప్రసంగించనున్నారు. బీహార్ యువత స్ఫూర్తిని, వారి కష్టాలను ప్రపంచానికి తెలియజేయడానికే ఈ ప్రచారం ముఖ్య లక్ష్యమని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. బీహార్ ప్రభుత్వం ఆ రాష్ట్ర యువతకు ఉపాధి కల్పించడం లేదు. ఈ అంశాన్నే హైలెట్ చేస్తూ.. కాంగ్రెస్ స్టూడెంట్స్ విభాగం ఎన్ఎస్‌యూఐ ర్యాలీ చేపట్టింది. రాష్ట్రంలో తాండవిస్తున్న నిరుద్యోగాన్ని ఈ ఏడాది చివరలో జరగనున్న ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ హైలెట్ చేయనుంది.

రూ.14 లక్షల కోట్లు హాంఫట్

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభంలో 4000 పాయింట్లు పతనమైంది. తుదకు 2,227 పాయింట్లు లేదా 2.95 శాతం పతనమై 73,137కు దిగజారింది. ఇంట్రాడేలో 71,425.01 వద్ద కనిష్టాన్ని తాకిన సూచీ.. రోజంతా నష్టాల్లోనే కదలాడింది.

ఎన్ఎస్ఈ నిఫ్టీ 742 పాయింట్లు లేదా 3.24 శాతం నష్టంతో 22,161కి పడిపోయింది. అన్ని రంగాల సూచీలు నష్టాలు చవి చూశాయి. ఐటీ, లోహ, రియాల్టీ, ఆటో, ఫైనాన్సీయల్ రంగాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్-30లో కేవలం ఒకే ఒక్క సూచీ హిందుస్థాన్ యూనిలీవర్ .

మాత్రం స్వల్పంగా పెరగ్గా..

మిగితా అన్నీ నేల చూపులు చూశాయి. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.14 లక్షల కోట్లు ఆవిరై.. రూ.389 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. ఈ ఒక్క మార్చిలోనే మదుపర్ల సంపద ఏకంగా రూ.30 లక్షల కోట్లు హరించుకుపోయింది. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 3.63 శాతం, 3.88 శాతం చొప్పున పతనమయ్యాయి. భారీ నష్టాలతో మదుపర్లు లబోదిబోమన్నారు.

ప్రధాన కారణాలు..

ట్రంప్ విధానాలకు దీటుగా చైనా కూడా సుంకాల మోత మోగించడంతో వాణిజ్య యుద్ధం తీవ్రతరమయ్యింది. అమెరికా విధానాలు ప్రపంచ వృద్ధిని దెబ్బతీయడంతో పాటుగా మాంద్యానికి ఆజ్యం పోస్తోందన్న నిపుణులు అంచనాలు ఇన్వెస్టర్లను బెంబేలెత్తిస్తున్నాయి. మార్కెట్లు మరింత పతనం కానున్నాయనే విశ్లేషణలు అమ్మకాలకు మరింత ఆజ్యం పోశాయి. భారత ఫార్మా రంగంపై కూడా భారీ టారిఫ్‌లు విధించనున్నట్లు యూఎస్ ప్రకటించడంతో అరబిందో ఫార్మా, లారస్ ల్యాబ్స్, లుపిన్ వంటి కంపెనీల షేర్లు నేల చూపులు చూశాయి.

మూడో రోజూ యూఎస్ మార్కెట్లు క్రాష్

వరుసగా మూడో రోజూ అమెరికా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. ఎస్అండ్‌పీ, డోజోన్స్ బేర్ గుప్పిట్లోకి జారుకున్నాయి. సోమవారం మార్కెట్ ప్రారంభంలోనే ఎస్అండ్‌పీ 500 సూచీ 229.94 పాయింట్లు లేదా 4.52 శాతం పతనమయ్యింది. డోజోన్స్ 1626 పాయింట్లు లేదా 4.24 శాతం, నాస్‌డాక్ 773 పాయింట్లు లేదా 4.96 శాతం చొప్పున క్షీణించాయి. కొవిడ్ తర్వాత ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. జపాన్ నిక్కీ 8.49 శాతం, సింగపూర్ స్ట్రెయిట్ టైమ్స్ 8 శాతం, హాంగ్‌కాంగ్ హాంగ్‌సెంగ్ 15.24 శాతం, దక్షిణ కొరియా కోస్పీ 5.89 శాతం చొప్పున నష్టాలను చవి చూశాయి. శుక్రవారమే అమెరికా మార్కెట్లు బేర్ గుప్పెట్లోకి వెళ్లాయి. సాధారణంగా ఏదైనా సూచీ రికార్డు గరిష్టాల నుంచి 20 శాతం మేర పతనం అయితే దాన్ని బేర్ గుప్పెట్లోకి జారుకున్నట్టు పరిగణిస్తారు.

ఎవరూ పెట్టుబడులు పెట్టొద్దు : రాహుల్ గాంధీ

"స్టాక్ మార్కెట్ల నుంచి డబ్బు సంపాదించవచ్చనేది భ్రమే. ఎవరూ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టవద్దు. దేశంలో ఒక్క శాతం మంది మాత్రమే స్టాక్స్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. ట్రంప్ భ్రమను మూటగట్టుకున్న ప్రధాని మోడీ ఎక్కడ కనపడటం లేదు." అని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. స్టాక్ మార్కెట్లు భారీగా పతనం కావడానికి మోడీనే ప్రధాన కారణమని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అన్నారు. మోడి, ట్రంప్ తమను తాము అపూర్వ స్నేహితులుగా అభివర్ణించుకోవడంలో ఆశ్చర్యం లేదన్నారు. ఎందుకంటే ఇద్దరూ తమ ఆర్థిక వ్యవస్థలు పతనం అవ్వడానికి స్వయంగా సమస్యలు సృష్టించుకోవడంలో నిపుణులని విమర్శించారు. 2016 నవంబర్ 8న చేసిన నోట్ల రద్దు, 2025 ఏప్రిల్ 5 నుంచి అమల్లోకి వచ్చిన పరస్పర సుంకాలు వీటికి ఉదాహరణలని ఆరోపించారు. వారిద్దరి చర్యల కారణంగానే మార్కెట్లు తీవ్రంగా నష్టాలు చవి చూస్తున్నాయన్నారు.

మే 7 నుంచి ఆర్టీసీ కార్మికుల సమ్మె

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మే 7వ తేదీ అర్థరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్టు టీజీఎస్ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు ప్రకటించారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఆర్టీసీ యాజమాన్యం, కార్మిక శాఖ కమిషనర్‌కు సమాచారాన్ని ఇచ్చామని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలురూపాల్లో ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామనీ, చర్చలు జరపాలని లేబర్ కమిషనర్‌ను కోరామనీ, రకరకాల సాకులు చెప్తూ యాజమాన్యం కాలయాపన చేసిందే తప్ప, చర్చలకు రాలేదన్నారు. కార్మికుల పక్షాన నిలవాల్సిన కార్మిక శాఖ కూడా యాజమాన్యానికే వత్తాసు పలుకుతున్నదని విమర్శించారు. టీజీఎస్ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పిలుపు మేరకు సోమవారం చలో లేబర్ కమిషనర్ ఆఫీస్ ఆందోళన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు హాజరయ్యారు. జేఏసీ చైర్మెన్ ఈదురు వెంకన్న (ఎంప్లాయీస్ యూనియన్), కో చైర్మెన్ కే హన్మంతు ముదిరాజ్ (టీజేఎమ్‌యూ), వైస్ చైర్మెన్ ఎమ్ థామస్‌రెడ్డి (టీఎమ్‌యూ), కన్వీనర్ ఎమ్‌డీ మౌలానా (ఎన్ఎమ్‌యూ), కో కన్వీనర్లు కత్తుల యాదయ్య (బీకేయూ), సుద్దాల సురేష్ (బీడబ్ల్యూయూ), బీ యాదగిరి (కార్మిక పరిషత్) మాట్లాడారు. సమ్మె నోటీసులో 21 అంశాలను ప్రస్తావించామని తెలిపారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీని కూడా అమలు చేయలేదని ఆక్షేపించారు. ఆపార్టీ మ్యానిఫెస్టోలో కార్మిక సంఘాలను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారనీ, దాన్నీ ఆచరణలోకి తేలేదన్నారు. మార్చి నెల వేతనాన్ని సంస్థలో కొందరికే చెల్లించారనీ, మిగిలిన వారికి 7వ తేదీ వచ్చినా జీతాలు ఖాతాల్లో జమ కాలేదన్నారు. 2017 వేతన సవరణ బకాయిలు చెల్లించలేదనీ, రిటైర్డ్ ఉద్యోగులకు 2017 వేతన ఫిక్సేషన్లు లేవనీ, అలవెన్సులు ఇవ్వలేదనీ, 2021 వేతన సవరణ గడువు ముగిసినా, దాని ప్రస్తావనే తేవట్లేదని యాజమాన్యం, ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎలక్ట్రిక్ బస్సుల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఆర్టీసీకి సరఫరా చేయాలనీ, అద్దె బస్సులు వద్దని డిమాండ్ చేశారు. సీసీఎస్, ఈపీఎఫ్ సహా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఈయూ అధ్యక్షులు ఎస్ బాబుతో పాటు పలువురు జేఏసీ నేతలు పాల్గొన్నారు. అంతకుముందు జేఏసీ నేతలు లేబర్ కమిషనర్‌తో భేటీ అయ్యారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందుకు ఆర్టీసీ యాజమాన్యం చర్చలకు రాలేదని కమిషనర్ తెలిపారు. దీనిపై జేఏసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ ఒక్క ఆర్టీసీ ఉద్యోగి, అధికారికి ఓటు హక్కు లేదనీ, అలాంటప్పుడు ఎలక్షన్ కోడ్ ఏంటని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారంలో కార్మిక శాఖ ఉద్దేశ్యపూర్వకంగానే జాప్యం చేస్తున్నదని విమర్శించారు.

గ్యాస్ బండ రూ.50 పెంపు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) కింద సబ్సిడీ పొందుతున్న లబ్దిదారులు, సబ్సిడీయేతర వినియోగదారులపై పడనున్నది. సవరించిన ధరలు నేటి(మంగళవారం) నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ ప్రకటించారు. "పీఎంయూవై లబ్దిదారులకు సిలిండర్‌పై ధర రూ.500 నుంచి రూ.550కు పెరగనున్నది. ఇతర వినియోగదారులకు ఇది రూ.803 నుంచి రూ.853కు పెరుగుతుంది" అని కేంద్రమంత్రి తెలిపారు. కాగా, ఈ పెరిగిన ధరలు రాష్ట్రాలను బట్టి మారుతాయి. కొన్నిరోజుల క్రితమే 19 కేజీల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్‌పై రూ.41 మేర ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ(ఓఎంసీ)లు తగ్గించిన విషయం తెలిసిందే. తాజాగా వంటగ్యాస్ సిలిండర్ ధరలను పెంచుతూ మోడీ సర్కారు నిర్ణయం తీసుకోవటం గమనార్హం.

ప్రస్తుతం దేశరాజధాని న్యూఢిల్లీలో సబ్సిడీయేతర వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.803గా ఉన్నది. కోల్‌కతాలో రూ.829, ముంబయిలో రూ.802.50, చెన్నైలో రూ.818.50గా ధరలు ఉన్నాయి. ఇక హైదరాబాద్‌లో 14.2 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధర రూ.855గా ఉన్నది. అయితే, ఈ ధరలు మంగళవారం రూ.50 మేర పెరగనున్నాయి.

ఇప్పటికే దేశంలో పెరుగుతున్న పలు వస్తువుల ధరలతో సతమతమవుతున్న సాధారణ ప్రజలు.. మోడీ సర్కారు వంట గ్యాస్ ధరలను అమాంతంగా పెంచటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ధరలను పెంచుతున్న మోడీ సర్కారు తీరుపై వారు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎదురైన నష్టాలను పూడ్చుకోవటంలో భాగంగా ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను పెంచింది. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతికూల ఆర్థిక, వాణిజ్య పరిస్థితుల నేపథ్యంలో మోడీ సర్కారు ధరల పెంపు నిర్ణయం తీసుకోవటం గమనార్హం. ధరల పెంపు మీద కేంద్రంపై ప్రతిపక్షాలు సైతం ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నాయి. అంతకముందు సోమవారం మధ్యాహ్నం పెట్రోల్, డీజిల్‌పై రూ.2 చొప్పున ఎక్సైజ్ డ్యూటీని కేంద్రం పెంచింది. ఈ పెంపుతో వినియోగదారులపై ప్రభావం ఉండదనీ, ఈ భారాన్ని చమురు మార్కెటింగ్ కంపెనీల భరిస్తాయని కేంద్రం వివరించింది.

'యర్రా' మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు



(మొదటిపేజీ తరువాయి)

చర్చి కాంపౌండ్ మీదుగా మమత హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ బాడీ డీకాంపోజ్ కాకుండా రసాయన చర్యలు పూర్తయ్యాక తిరిగి బైక్ ర్యాలీగా సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయానికి తీసుకొచ్చి.. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రెండు గంటల వరకు భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ... ప్రజా ఉద్యమాలకు, సీపీఐ(ఎం)కి యర్రా శ్రీకాంత్ మరణం తీరని లోటు అని అన్నారు. పార్టీ అఖిలభారత 24 మహాసభలతో పాటు పార్టీ కేంద్ర కమిటీ ఆయన మృతికి సంతాపం తెలిపినట్టు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. మార్చి 31వ తేదీన పార్టీ అఖిలభారత మహాసభలకు ఎంతో ఉత్సాహంగా బయలుదేరి వెళ్ళామని, అంతలోనే శ్రీకాంత్ అకాల మృతి చెందడం దిగ్భ్రాంతిని కలిగించిందని అన్నారు. సంతాప సభ అనంతరం శ్రీకాంత్ భౌతికకాయాన్ని స్థానిక శ్రీనివాస్ నగర్‌లోని తన స్వగృహానికి బైక్ ర్యాలీగా తీసుకొని వెళ్లారు. శ్రీకాంత్ కుటుంబ సభ్యులు భార్య యర్రా సుకన్య, కుమారులు రంజిత్, శ్రావణ్, జ్ఞానేశ్, సోదరులు యర్రా రమేశ్, గోపి, నాగరాజుకు నేతలు తమ సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో.. సీపీఐ నేతలు బాగం హేమంతరావు, దండి సురేశ్, ఎంపీ వద్దిరాజు, గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నేత గుర్రం అచ్చయ్య, టీడీపీ, ఎన్డీ, వివిధ పార్టీల నేతలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, నాయకులు ఏజే రమేష్, సీఐటీయూ రాష్ట్ర నాయకులు మధు తదితరులు ఉన్నారు. అలాగే, జపాన్ పర్యటనలో ఉన్న యలమంచిలి పాలీ క్లీనిక్ నిర్వాహకులు డాక్టర్ రవీంద్రనాథ్, నాగమణి, రామకోటేశ్వరరావు, రమాదేవి.. ఫోన్‌లో సంతాపం తెలిపారు.

యర్రా శ్రీకాంత్ మృతి కార్మికోద్యమానికి తీరని నష్టం

- మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ ఆ పార్టీ అఖిల భారత మహాసభల ప్రతినిధిగా మదురై వెళ్లి ఆకస్మికంగా గుండెపోటుకు గురై మరణించడం విస్మయానికి గురిచేసిందని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలోని కార్మికోద్యమంలో ఆయన చురుకైన పాత్ర నిర్వహించారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐటీయూకు అనుబంధంగా అనేక కార్మిక సంఘాలను నిర్మించారని వివరించారు. ఆయన మరణం ఖమ్మం జిల్లా కార్మికోద్యమానికి, సీపీఐ(ఎం) పార్టీకి తీరని నష్టమని పేర్కొన్నారు. ఆయన మరణం పట్ల జోహార్లు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

నయా ఫాసిస్ట్ ధోరణులపై పోరాటం

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ పిలుపు

- పి.రామమూర్తి విగ్రహం వద్ద నివాళి



మధురై : మదురైలో విజయవంతంగా జరిగిన సీపీఐ(ఎం) మహాసభ చరిత్రలో అత్యంత విశేషమైనదని ఆ పార్టీ నూతన ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ నియంత్రణలో ఉన్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గట్టి హెచ్చరికను మహాసభ జారీ చేసిందని ఆయన తెలిపారు, మోడీ పరిపాలన నయా-ఫాసిస్ట్ ధోరణులను వ్యక్తం చేస్తోందని, ఈ నయా ఫాసిస్ట్ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడాలని మహాసభ పిలుపునిచ్చిందని, ఈ పిలుపును ప్రజలు స్వీకరిస్తారని బేబీ పేర్కొన్నారు. మహాసభ విజయవంతంగా ముగిసిందని, దీనికి నిర్మాణ నైపుణ్యం, సమిష్టి భాగస్వామ్యం కారణమని స్పష్టం చేశారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తరువాత మదురైలోని తెప్పకుళంలో పార్టీ సీనియర్ నాయకుడు పి.రామమూర్తి విగ్రహానికి పూలమాల వేసిన తర్వాత ఎంఎ బేబీ మీడియాతో మాట్లాడారు. తమిళనాడు ప్రజలకు పార్టీ పట్ల ఉన్న ప్రేమ, నమ్మకం సమావేశం అంతటా, రెడ్ వాలంటీర్ మార్చ్, లక్షలాది మంది హాజరైన బహిరంగ సభలో స్పష్టంగా కనిపించిందని తెలిపారు. 1953, 1972లో మదురైలో జరిగిన పార్టీ మహాసభలు కూడా చరిత్రలో కీలకమైనవి. 1972లో జరిగిన తొమ్మిదవ మహాసభలో, ఇందిరా గాంధీ పాలనలో మితిమీరిన నిరంకుశ ధోరణులు, అర్ధ-ఫాసిస్ట్ నియంతృత్వానికి వ్యతిరేకంగా దేశాన్ని పార్టీ హెచ్చరించింది. ఆ తర్వాత కొద్దికాలానికే ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని ప్రకటించారని బేబీ గుర్తు చేశారు.

కె. బాలకృష్ణన్, మదురై ఎంపీ వెంకటేశన్ నేతృత్వంలోని నిర్వాహక కమిటీ, అన్ని వర్గాల ప్రజలను మహాసభలో భాగం చేయడంలో అద్భుతమైన పని చేసింది. ప్రజల ఉత్సాహాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను. ఎర్ర దండు కవాతు క్రమశిక్షణ, బహిరంగ సభ ఉత్సాహం నిర్మాణ నైపుణ్యానికి నిదర్శనాలు. బహిరంగ సభ ముగింపులో వర్షం కురుస్తున్నప్పటికీ, ప్రజలు ప్రసంగాన్ని ఉత్సాహంగా విన్నారు' అని బేబీ తెలిపారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ బహిరంగ సభలో ఎంపురాన్ సినిమా గురించి ప్రస్తావించడాన్ని బేబీ గుర్తు చేశారు. కేరళ, తమిళనాడు ముఖ్యమంత్రులు, కర్నాటక మంత్రి ఎం.పీ.సుధాకర్ హాజరైన ఈ సెమినార్ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై విధించిన ఆంక్షలకు వ్యతిరేకంగా ఒక ప్రధాన హెచ్చరిక. ఈ మహాసభలో ప్రకాష్ రాజ్, రోహిణి, సముద్రఖని, వెట్రిమారన్, టిజి జ్ఞానవేల్, సెల్వరాజ్ వంటి సినీ ప్రముఖులు కూడా సంబంధిత కార్యక్రమాలకు హాజరయ్యారని ఎంఎ బేబీ తెలిపారు.


బేబీని సత్కరిస్తున్న సీపీఐ(ఎం)అగ్రనేతలు

బెంగళూర్ జోరు

ముంబయిపై 12 పరుగులతో గెలుపు
ఛేదనలో తిలక్, హార్దిక్ పోరాటం వృథా

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ జోరు కొనసాగుతుంది. వాంఖడెలో ముంబయి ఇండియన్స్‌పై మెరుపు విజయం సాధించిన బెంగళూర్ సీజన్లో మూడో విక్టరీ నమోదు చేసింది. కోహ్లి (67), పాటిదార్ (64) అర్థ సెంచరీలతో బెంగళూర్ 221 పరుగులు చేయగా.. ఛేదనలో తిలక్ వర్మ (56), హార్దిక్ పాండ్య (42) మెరిసినా ముంబయికి ఓటమి తప్పలేదు.

నవతెలంగాణ-ముంబయి

ఉత్కంఠ రేపిన వాంఖడె పోరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 12 పరుగులో తేడాతో గెలుపొందింది. 222 పరుగుల భారీ ఛేదనలో ముంబయి ఇండియన్స్‌కు భంగపాటు తప్పలేదు. తిలక్ వర్మ (56, 29 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సులు) అర్థ సెంచరీతో మెరువగా.. కెప్టెన్ హార్దిక్ పాండ్య (42, 15 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఐదో వికెట్‌కు 34 బంతుల్లోనే 89 పరుగులు పిండుకున్న హార్దిక్ పాండ్య, తిలక్ వర్మ వాంఖడెలో రికార్డు లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించారు. ఆఖరు మూడు ఓవర్లలో బెంగళూర్ బౌలర్లు అద్భుత ప్రదర్శనతో ముంబయి వరుస వికెట్లు కోల్పోయింది. తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య సహా మిచెల్ శాంట్నర్ (8), దీపక్ చాహర్ (0), నమన్ ధిర్ (11)లు నిష్క్రమించారు. 20 ఓవర్లలో 9 వికెట్లకు 209 పరుగులే చేసిన ముంబయి ఇండియన్స్ 12 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. రోహిత్ శర్మ (17), రియాన్ రికెల్టన్ (17), విల్ జాక్స్ (22), సూర్యకుమార్ యాదవ్ (28) మంచి ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేదు. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ స్పిన్నర్ కృనాల్ పాండ్య (4/45) నాలుగు వికెట్లు పడగొట్టగా.. యశ్ దయాల్ (2/46), జోశ్ హాజిల్‌వుడ్ (2/37) రాణించారు. ముంబయి ఇండియన్స్‌కు ఇది ఐదు మ్యాచుల్లో నాల్గో పరాజయం కాగా.. బెంగళూర్ నాలుగు మ్యాచుల్లో మూడో విజయం నమోదు చేసింది.



తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 221 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (67) అర్ధ సెంచరీతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టగా.. రజత్ పాటిదార్ (64) ధనాధన్ మెరుపులతో భారీ స్కోరు అందించాడు. జితేశ్ శర్మ (40 నాటౌట్, 19 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సులు) ఆఖర్లో అద్భుత షాట్లతో అలరించాడు. ట్రెంట్ బౌల్ట్‌పై ర్యాంప్ షాట్లతో సిక్సర్లతో అదరగొట్టాడు. ముంబయి బౌలర్లలో బౌల్ట్, హార్దిక్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. బుమ్రా (0/29) ఆకట్టుకునే ప్రదర్శన చేశాడు.

50శాతానికి పైగా గాజా భూభాగం పై ఇజ్రాయిల్ కబ్జా

- ఇక అక్కడ ఎవరూ జీవించలేరు, బంజరు భూమిగా మారిందంటున్న సైనికులు





టెల్ అవీవ్ : గాజాలో తన మిలటరీ బఫర్ జోన్‌ను విస్తరిస్తూ వస్తున్న ఇజ్రాయిల్ ప్రస్తుతం 50శాతానికి పైగా భూభాగంపై పట్టును సాధించింది. ఈ ప్రాంతమంతా ఎక్కువగా గాజా సరిహద్దు చుట్టుపక్కలనే వుంది. ఇక్కడ మిలటరీ మొత్తంగా ఇళ్ళను నేలమట్టం చేసేసింది. పొలాలు, మౌలిక వసతులనేవి కంటికి కనిపించకుండా నాశనమయ్యాయి. అక్కడ ఇక ప్రజలు నివసించడానికి వీలుగా లేదని ఇజ్రాయిల్ సైనికులే చెబుతున్నారు. మానవ హక్కుల గ్రూపులు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఇటీవలి వారాల్లోనే మిలటరీ బఫర్ జోన్ రెట్టింపైంది. హమాస్ వద్ద మిగిలిన బందీలను విడిపించుకునేందుకు ఇజ్రాయిల్ పన్నిన ఎత్తుగడలో భాగంగానే మొత్తంగా గాజాను ఆక్రమించుకుంటూ వెళుతోంది. ఉత్తర, గాజాలను విభజించే కారిడార్ ఇజ్రాయిల్ అధీనంలోనే వుంది. దీనివల్ల దీర్ఘకాలంగా ఈ ప్రాంతంపై పట్టు సాగించడానికి వీలుంటుందని గాజా నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. హమాస్‌ను ఓడించిన తర్వాత కూడా గాజాలో సెక్యూరిటీ పట్టును ఇజ్రాయిల్ కొనసాగిస్తుందని, పాలస్తీనియన్లను అక్కడ నుండి వెళ్లిపోయేలా చేస్తామని గత వారమే ప్రధాని నెతన్యాహు చెప్పారు. 18మాసాల క్రితం దాడులు ఆరంభించినప్పటి నుండి ఒక పద్ధతి ప్రకారమే బఫర్ జోన్‌ను విస్తరించుకుంటూ వస్తోందని, అలాగే ఇజ్రాయిల్ సరిహద్దుకు సమీపంలోనే మొత్తంగా కూల్చివేతలు, ఆక్రమణలు వున్నాయని ఐదుగురు ఇజ్రాయిల్ సైనికులు మీడియాకు తెలిపారు. "పనిచేసే ప్రతీదాన్ని పనికిరాకుండా చేశాం. ఒకవేళ పాలస్తీనియన్లు వెనక్కి తిరిగి వచ్చినా వారు జీవించడానికి ఏమీ మిగల్లేదు, ఇక వారు ఎప్పటికీ వెనక్కి తిరిగి రాకుండే వుండేందుకే ఇదంతా చేసింది." అని కూల్చివేతల బృందాలకు చెందిన సైనికుడు ఒకరు చెప్పారు. తమ పేర్లు చెప్పకుండా వుండే షరతుపై వారు మీడియాతో మాట్లాడారు. మొత్తంగా ఇక్కడున్న భూమి అంతా బంజరు భూమిగా మారిపోయిందని,. ఏమీ పండవని వారు చెప్పారు. ఆ సైనికుల వ్యాఖ్యలు, కథనాలతో కూడిన నివేదికను సోమవారం విడుదల చేశారు.

గాజా ఆక్రమణ వ్యతిరేక గ్రూపు బ్రేకింగ్ ది సైలెన్స్ ఈ నివేదికను విడుదల చేసింది. విస్తృతమైన రీతిలో విచ్చలవిడిగా విధ్వంసానికి ఉద్దేశ్యపూర్వకంగా మిలటరీ పునాది వేసిందని ఆ గ్రూపు వ్యాఖ్యానించింది. దీనిపై ఇజ్రాయిల్ ఆర్మీ స్పందిస్తూ, అక్టోబరు 7నాటి దాడిలో ధ్వంసమైన దక్షిణ ప్రాంత కమ్యూనిటీల భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతోనే ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. తాము గాజాలోని పౌరులకు హాని కలిగించాలనుకోవడం లేదని, అంతర్జాతీయ చట్టానికి కట్టుబడి వున్నామని తెలిపింది. యుద్ధం ఆరంభించిన తొలినాళ్ళలో కిలోమీటరుకు పైగా వుండేలా బఫర్ జోన్‌ను ఏర్పాటు చేసేందుకు ఇజ్రాయిల్ సైన్యం పాలస్తీనియన్లను అక్కడ నుండి పారద్రోలిందని ఆ నివేదిక పేర్కొంది.

ఇంగ్లాండ్ కెప్టెన్‌గా హ్యారీ బ్రూక్

వైట్‌బాల్ ఫార్మాట్‌లో సారథ్య పగ్గాలు



లండన్ : ఇంగ్లాండ్ యువ క్రికెటర్ హ్యారీ బ్రూక్ (26) జోశ్ బట్లర్ నుంచి కెప్టెన్సీ పగ్గాలు అందుకోనున్నాడు. 26 ఏండ్ల హ్యారీ బ్రూక్ ఇంగ్లాండ్ వన్డే, టీ20 జట్లకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని ఇంగ్లాండ్, వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) తెలిపింది. 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ పరాజయానికి బాధ్యత వహిస్తూ జోశ్ బట్లర్ కెప్టెన్సీ నుంచి వైదొలిగిన సంగతి తెలిసిందే. మే ఆఖర్లో స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగే టీ20, వన్డే సిరీస్‌తో కెప్టెన్‌గా హ్యారీ బ్రూక్ ప్రయాణం ఆరంభం కానుంది. 'ఇంగ్లాండ్ వైట్‌బాల్ కెప్టెన్‌గా ఎంపిక కావటం నిజమైన గౌరవం. చిన్న వయసులో క్రికెట్ ఆడుతున్నప్పుడు యార్క్‌షైర్, ఇంగ్లాండ్‌కు ఆడాలని స్వప్నించేవాడిని. ఇప్పుడే జాతీయ జట్టును నడిపించే అవకాశమే లభించింది. ఇది నాకు ఓ గొప్ప అవకాశం' అని బ్రూక్ అన్నాడు. హ్యారీ బ్రూక్ 26 వన్డేల్లో 34 సగటుతో 816 పరుగులు చేశాడు. 44 టీ20ల్లో 28.50 సగటుతో 798 పరుగులు చేశాడు. 24 టెస్టుల్లో 58.48 సగటుతో 2281 పరుగులు చేసిన హ్యారీ బ్రూక్ ఇంగ్లాండ్ నయా సూపర్‌స్టార్‌గా ఎదుగుతున్నాడు. స్వదేశీ టెస్టు సీజన్‌కు సన్నద్ధం అయ్యేందుకు ఐపీఎల్18కు బ్రూక్ దూరం కావటంతో అతడిపై బీసీసీఐ రెండు సీజన్ల పాటు నిషేధం విధించిన సంగతి తెలిసిందే.

మా శైలి దూకుడు ఫలితాలు ఇస్తుంది

- పరిస్థితులను గౌరవించాలి!
- సన్‌రైజర్స్ చీఫ్ కోచ్ డానియల్ వెటోరీ




హైదరాబాద్ : ఐపీఎల్18లో ఐదు మ్యాచుల్లో నాలుగింట ఓటమి. తొలి మ్యాచ్‌లో తిరుగులేని విజయం సాధించిన సన్‌రైజర్స్.. ఆ తర్వాతి నాలుగు మ్యాచుల్లో చెత్త ప్రదర్శనతో నిరాశపరిచింది. సన్‌రైజర్స్ బ్యాటింగ్ వ్యూహంపై విమర్శలు వస్తోన్నా చీఫ్ కోచ్ డానియెల్ వెటోరీ మద్దతుగా నిలిచాడు. 'మా శైలి బ్యాటింగ్ ఫలితాలు ఇస్తుందని తెలుసు. కానీ పరిస్థితులను గౌరవిస్తూ, పిచ్ స్వభావాన్ని అంచనా వేయాలి. ఇక్కడే మేము విఫలమవుతున్నాం. ప్రత్యర్థి బౌలర్లను సైతం గౌరవించాలి. ఇతర జట్లు మా టాప్-3 బ్యాటర్ల కోసం ఎంతో శ్రమించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి' అని వెటోరీ తెలిపాడు. టైటాన్స్‌తో మ్యాచ్‌కు సంప్రదాయ హైదరాబాద్ వికెట్ ఇవ్వలేదు. ఈ పిచ్‌పై 160-170 పరుగులు చేయాలని అనుకున్నాం. కానీ ఓ 20 పరుగుల తక్కువకే పరిమితం అయ్యాం. ఫ్లడ్‌లైట్ల వెలుగులో పిచ్ బ్యాటింగ్‌కు మరింత సహకరించింది. పాట్ కమిన్స్ ఓటములకు ఆందోళన చెందే ఆటగాడు కాదు. నాలుగు ఓటముల తర్వాత పరిణామాలను అర్థం చేసుకోగలం. గత సీజన్ రన్నరప్‌గా భారీ అంచనాలతో సీజన్‌ను ఘనంగా మొదలెట్టినా.. గత నాలుగు మ్యాచుల్లో మూడు రంగాల్లోనూ మా ఉత్తమ ప్రదర్శన చేయలేదు. బ్యాటింగ్ విభాగం ఆత్మవిశ్వాసంతోనే ఉంది. పంజాబ్‌తో మ్యాచ్‌లో బలంగా పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్నామని వెటోరీ అన్నాడు.


అజిత్

భయాన్నే భయపెడతాడు

అజిత్ కుమార్ హీరోగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన మల్టీ లాంగ్వేజ్ ప్రాజెక్ట్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఈనెల 10న ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధంగా ఉంది.
టి-సిరీస్ గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.
అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించిన ఈ హై-ప్రొఫైల్ మూవీ ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్‌తో సంచలనం సృష్టించింది. తాజాగా మేకర్స్ తెలుగు ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. హీరో అజిత్‌ను డిఫరెంట్ అవతార్స్‌లో నెవర్ బిఫోర్ క్యారెక్టర్‌లో ప్రజెంట్ చేసిన ట్రైలర్ అదిరిపోయింది. తన కొడుకును కాపాడుకోవడానికి తన వైలెంట్ పాస్ట్‌కి తిరిగి వచ్చే పాత్రలో అజిత్ క్యారెక్టరైజేషన్ చాలా క్యురియాసిటీని పెంచింది. భయాన్నే భయపెడతాడనే డైలాగ్ హీరో క్యారెక్టర్ ఎంత పవర్ ఫుల్‌గా ఉండబోతోంది సూచిస్తోంది. ట్రైలర్‌లో త్రిష కృష్ణన్, అర్జున్ దాస్, ప్రభు, ప్రసన్న, సునీల్ కీలక పాత్రల్లో కనిపించారు. అభినందన్ రామానుజం సినిమాటోగ్రఫీ అద్భుతంగా ఉంది, జీవీ ప్రకాష్ కుమార్ నేపథ్య సంగీతం ఎక్స్‌ట్రార్డినరీగా ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ప్రొడక్షన్ వాల్యూస్ చాలా గ్రాండియర్‌గా ఉన్నాయి.


విజయశాంతి, కళ్యాణ్‌రామ్

'ముచ్చటగా బంధాలే..'

నందమూరి కళ్యాణ్ రామ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ఈ చిత్రంలో విజయశాంతి పవర్ ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఇందులో వీరిద్దరూ తల్లీకొడుకులుగా నటిస్తున్నారు.
ఈ యాక్షన్- ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో ఈ రెండు పాత్రలు మధ్య డైనమిక్స్ కీలకంగా ఉండబోతున్నాయి.
ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. శ్రీరామ నవమి శుభ సందర్భంగా మేకర్స్ ఈ సినిమా నుంచి కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. కళ్యాణ్ రామ్, విజయశాంతిలను డైనమిక్‌గా ప్రజెంట్ చేసిన ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా మేకర్స్ సోమవారం సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. 'ముచ్చటగా బంధాలే' అంటూ సాగే పాటను ఈనెల 9న రిలీజ్ చేస్తున్నారు.
చిత్తూరు శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలో జరిపే గ్రాండ్ ఈవెంట్ లో సాంగ్‌ని లాంచ్ చేయనున్నారు. తల్లీకొడుకుల మధ్య ఉన్న అనుబంధాన్ని బ్యూటీఫుల్‌గా ప్రజెంట్ చేసిన సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 18న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది.

పవర్‌ఫుల్ కథతో..


అశ్విన్‌బాబు

అశ్విన్ బాబు హీరోగా, మామిడాల ఎం.ఆర్.కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'వచ్చిన వాడు గౌతమ్'.
అరుణశ్రీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై టి.గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు.
ఈ చిత్రం నుండి సోమవారం పవర్ ఫుల్ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేసారు.
డిఫరెంట్ సబ్జెక్ట్స్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న హీరో అశ్విన్ బాబు నుండి వస్తున్న మరో ఎగ్జైటింగ్ మూవీ ఇది. బ్లేడ్, స్టెత్‌తో ఉన్న అశ్విన్ బాబు లుక్ సినిమాపై క్యురియాసిటీని పెంచింది.
మెడికల్ యాక్షన్ మిస్టరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సాయి రోణక్ అతిథి పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ఇప్పటికే 90% చిత్రీకరణను పూర్తి చేసుకుంది. త్వరలో మేకర్స్ రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేస్తారు. రియా సుమన్, అయేషా ఖాన్, మురళీ శర్మ, సచిన్, ఖేడేకర్, అభినయ, అజయ్, వీటీగణేష్, యెష్నా చౌదరి, సుదర్శన్, శకలక శంకర్, రాఘవ, అమర దీప్, అభిత్ భూషణ్, నాగి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

నవచిత్రం

'గోదారి గట్టుపైన..'


సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్

'మేమ్ ఫేమస్'తో నటుడిగా, దర్శకుడిగా అందరి ప్రశంసలు సొంతం చేసుకున్న సుమంత్ ప్రభాస్ తాజాగా మరో ఎగ్జైటింగ్ ప్రాజెక్ట్‌తో రాబోతున్నారు. ఈ చిత్రం రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్‌కు ఫస్ట్ వెంచర్. సుభాష్ చంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.
నిధి ప్రదీప్ కథానాయికగా అరంగేట్రం చేస్తుండగా, జగపతిబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు.
సోమవారం నిర్మాతలు ఈ సినిమా టైటిల్ 'గోదారి గట్టుపైన'ను రివీల్ చేశారు. ఇది 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలోని హిట్ పాట ద్వారా ఇప్పటికే ప్రజాదరణ పొందిన టైటిల్. టైటిల్ లోగో విజువల్ ఎట్రాక్టివ్‌గా ఉంది. పోస్టర్ ప్రశాంతమైన గోదావరి ప్రాంతాన్ని అందంగా ప్రజెంట్ చేసింది. టైటిల్, పోస్టర్ రెండింటి డిజైన్ ప్లజెంట్‌గా ఉంది.
'ఒక చల్లని సాయంత్రం వేళ ప్రశాంతమైన గోదావరి నది ఒడ్డున మీ స్నేహితులతో కూర్చుని సమయం గడపడం ఎంత ప్రశాంతంగా ఉంటుందో, మా సినిమా కూడా అంతే ప్రశాంతంగా ఉంటుంది. రిలాక్స్‌గా, అందమైన భావోద్వేగాలతో నిండి ఉంటుంది. గోదావరి జిల్లాలు వేల్పూరు, రేలంగి, భీమవరం నేపథ్యంలో సుందరమైన ప్రకృతి దృశ్యాలు సినిమా విజువల్ గ్రాండియర్‌ని పెంచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి' అని చిత్ర దర్శకుడు చెప్పారు.
రాజీవ్ కనకాల, లైలా, దేవి ప్రసాద్, హర్షవర్ధన్, సుదర్శన్, రాజ్‌కుమార్ కాసిరెడ్డి, వివా రాఘవ్, రోహిత్ కృష్ణ వర్మ తదితరులు ముఖ్యతారాగణంగా నటిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం - సుభాష్ చంద్ర, నిర్మాత - అభినవ్ రావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - మధులిక సంచన లంక, డీఓపీ - సాయి సంతోష్, సంగీతం - నాగ వంశీ కృష్ణ, ఎడిటర్ - అనిల్ కుమార్ పి, సౌండ్ డిజైనర్ - నాగార్జున తాళ్లపల్లి, ప్రొడక్షన్ డిజైనర్ - ప్రవల్య డి.


శివాజీ

'దండోరా'లో కీలక పాత్ర

నేషనల్ అవార్డ్ గెలుచుకున్న చిత్రం 'కలర్ ఫోటో', బ్లాక్‌బస్టర్ 'బెదురులంక 2012' చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందిస్తున్న తాజా చిత్రం 'దండోరా'.
మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీ శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోంది. ఇప్పటికే ఫస్ట్ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న ఈ చిత్రం తాజాగా సెకండ్ షెడ్యూల్ చిత్రీకరణను ప్రారంభించింది. 25 రోజుల పాటు కంటిన్యూగా జరగనున్న ఈ షెడ్యూల్‌లో విలక్షణ నటుడు శివాజీ పాల్గొంటున్నారు.
నైంటీస్, కోర్ట్ వంటి డిఫరెంట్ కంటెంట్‌తో ప్రేక్షకులను అలరించిన ఈ వెర్సటైల్ యాక్టర్ ఇప్పుడు ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నారు. అగ్ర వర్ణాలకు చెందిన అమ్మాయిలని ప్రేమించి పెళ్లి చేసుకున్నా, అగ్ర వర్ణాలకు ఎదురు తిరిగినా ఎలాంటి దౌర్జన్యకాండ జరుగుతున్నాయనే అంశాన్ని ఆధారంగా చేసుకుని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో మన పురాతన ఆచారాలు, సాంప్రదా యాలను ఆవిష్కరిస్తూనే వ్యంగ్యం, చక్కటి హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికగా ఈ సినిమాను ఆవిష్కరిస్తున్నారు. నవదీప్, నందు, రవి కృష్ణ, మణిక, అనూష, రాధ్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం : మార్క్ కె.రాబిన్.



డిఫరెంట్ ఎంటర్‌టైనర్

ఈ సమ్మర్ సీజన్‌లో ప్రేక్షకులను నవ్వుల వర్షంతో ముంచెత్తేందుకు సిద్ధమైన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'వర్జిన్ బాయ్స్' సినిమా రిలీజ్‌కు సిద్ధమైంది. గీతానంద్-మిత్రా శర్మ హీరో, హీరోయిన్లుగా రాజ్ గురు ఫిలిమ్స్ పతాకంపై రాజా దరపునేని నిర్మాతగా, దయానంద్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది.
సినిమా పోస్టర్ చూస్తుంటేనే దాని ఫన్ ఎలిమెంట్ ఏంటో అర్థమవుతుంది. ఓ అందమైన అమ్మాయి ముఖం, అందులో ఆమె పెదాలపై ముగ్గురు యువకులు విభిన్న శైలిలో కనిపించడం ఆకర్షణీయంగా ఉంది.
పోస్టర్ చూస్తుంటే చాలా క్రేజీ వైబ్స్ వస్తున్నాయి. ఈ పోస్టర్‌లో అమ్మాయి పెదాలపై ఒకరు కలర్‌ఫుల్ షార్ట్స్‌లో, మరొకరు స్కేట్‌బోర్డ్‌తో, మరొకరు మ్యాగజైన్‌తో నవ్వుతూ కనిపించడం ఈ సినిమా తాలూకా కామెడీ ఎలిమెంట్‌ని సూచిస్తోంది. 'బ్రో.. ఆర్ యు వర్జిన్?' అనే ట్యాగ్‌లైన్ ఈ సినిమా రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైన్‌మెంట్‌గా రూపొందుతోందని తెలుస్తోంది. ఈ సమ్మర్‌లో విడుదల కానున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధిస్తుందని అంచనా వేస్తున్నారు. యువతీ యువకుల మధ్య నడిచే రొమాన్స్, కామెడీ, ఎమోషన్స్‌తో కూడిన ఈ సినిమా థియేటర్లలో మరింత ఉత్సాహాన్ని రేకెత్తించే అవకాశం ఉంది. త్వరలో రిలీజ్ డేట్ పై క్లారిటీ రానుంది. శ్రీహన్, రోనీత్, జెన్నీఫర్, అన్షుల, సుజిత్ కుమార్, బబ్లు, అభిలాష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి డైరెక్టర్: దయానంద్, ప్రొడ్యూసర్ : రాజా దరపునేని, మ్యూజిక్ డైరెక్టర్: స్మరణ్ సాయి, ఎడిటర్ : మార్తాండ్ కె వెంకటేష్. డీఓపి : వెంకట ప్రసాద్.

ఉత్కంఠభరితంగా 'తత్వం'


దినేష్ తేజ్, దక్షిక

మర్డర్ మిస్టరీ జోనర్ సినిమాల్లో ఉండే ఉత్కంఠ, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి. ఇదే కోవలో ఓ వైవిధ్యమైన కథాంశంతో ప్రేక్షకులకు థ్రిల్ కలిగించే అంశాలతో రాబోతున్న చిత్రం 'తత్వం'.
దినేష్ తేజ్, దక్షిక.కె హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో వంశీ సీమకుర్తి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.
సోమవారం ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి చిత్ర బృందానికి ఆల్ ద బెస్ట్ చెప్పారు.
దర్శకుడు అర్జున్ కోల మాట్లాడుతూ, 'మా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసిన మారుతి, ఎస్‌కేఎన్‌లకు ధన్యవాదాలు. పెళ్లి చూపుల కోసమని ఓ గ్రామానికి వెళ్లిన హీరో, ఆ ఊరిలో జరిగిన హత్యల కేసుల్లో ఎలా ఇరుక్కున్నాడు?, ఆ కేసుల నుంచి ఎలా బయటపడ్డాడు?, ఈ పరిణామాల మధ్యలో అతను తెలుసుకున్న తత్వం ఏమిటి? అనేది ఈ చిత్ర కథ. ప్రతి సన్నివేశం ఎంతో ఉత్కంఠభరితంగా, ఆసక్తిగా ఉంటుంది' అని అన్నారు. 'ఈతరం ప్రేక్షకులకు కావలసిన అంశాలతో పాటు చూసేటప్పుడు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా ఉంటుంది. ముఖ్యంగా ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే హైలెట్‌గా ఉంటుంది. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు మా సినిమా తప్పకుండా నచ్చుతుంది' అని నిర్మాత వంశీ సీమకుర్తి చెప్పారు.
ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: భరత్ రోంగలి, ఎడిటర్: విష్ణవ్ నైషదం, కెమెరా: భరత్ పట్టి, డిఐ: భూషణ్, దర్శకుడు: అర్జున్ కోల, నిర్మాత: వంశీ సీమకుర్తి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ ప్రారంభం



న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన సోమవారం ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ(ఎంపీసీ) భేటీ ప్రారంభమయ్యింది. ఈ ద్వైమాసిక పరపతి సమీక్షా సమావేశాల నిర్ణయాలను ఏప్రిల్ 9న వెల్లడించనున్నారు. గత పాలసీ సమీక్షలో వడ్డీ రేట్లకు కీలకమైన రెపో రేటును 0.25 శాతం తగ్గించేందుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మూడు రోజుల సమావేశంలో మరో పావు శాతం కోతకు వీలున్నట్టు నిపుణులు అంచనా వేస్తోన్నారు. భారత్‌పై అమెరికా టారిఫ్‌ల ప్రభావం, రూపాయి పతనం, మారకం నిల్వలపైనా విస్తృత చర్చ జరిగే అవకాశం ఉంది.

జొమాటో సీఓఓ రిన్షుల్ చంద్ర

బెంగళూరు : జొమాటో ఫుడ్ డెలివరీ బిజినెస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) రిన్షుల్ చంద్ర తన పదవీకి రాజీనామా చేశారు. ఈ నెల 5నే తను వైదొలిగారని జొమాటో వెల్లడించింది. వ్యక్తిగత, వృత్తిపరమైన లక్ష్యాలకు అనుగుణంగా కొత్త అవకాశాలు, అభిరుచిని కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు జొమాటో వ్యవస్థాపకుడు గోయల్‌కు రాసిన లేఖలో రిన్షుల్ తెలిపారు.

ఆధునాతన ఫీచర్లతో అర్బన్ క్రూయిజర్ హైరైడర్

బెంగళూరు : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) తన అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌లో భద్రత, సౌకర్యం పునర్నిర్వచించే ఫీచర్ అప్‌గ్రేడ్‌లను ప్రవేశపెట్టినట్లు సోమవారం వెల్లడించింది. భారతదేశపు మొట్టమొదటి సెల్ఫ్ ఛార్జింగ్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ ఎస్‌యువిగా గుర్తింపు పొందిన అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఇప్పటికే 1 లక్ష వాహనాల అమ్మకాల మైలురాయిని దాటినట్లు పేర్కొంది.కొత్తగా ప్రధానంగా మెరుగైన భద్రత ఫీచర్లు జోడించబడ్డాయని తెలిపింది. ప్రయాణీకుల భద్రతను నిర్ధారిస్తూ 6 ఎయిర్‌బ్యాగ్‌లు ఇప్పుడు అన్ని వేరియంట్‌లలో ప్రామాణికంగా ఉన్నాయని పేర్కొంది. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.11.34 లక్షలుగా నిర్ణయించింది.

పెట్స్ ఉత్పత్తులపై అమెజాన్ ఆఫర్లు

బెంగళూరు : పెంపుడు జంతువుల జాతీయ దినోత్సవం సందర్భంగా పెట్స్‌కు అవసరమైన అన్ని రకాల వస్తువులపై ప్రత్యేక తగ్గింపును అందిస్తున్నట్టు అమెజాన్ ఇండియా తెలిపింది. ఏప్రిల్ 11 నుండి 14 తేదీల్లో ఒకే వేదికపై వివిధ పెట్స్ విభాగాలకు చెందిన విస్తృత శ్రేణీ ఉత్పత్తులను పొందవచ్చని పేర్కొంది. రూ.5000 కనీస ఆర్డర్‌కు ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుతో చెల్లింపులు చేస్తే అదనంగా 10 శాతం తగ్గింపును అందిస్తున్నట్టు వెల్లడించింది.

సామ్‌సంగ్ నుంచి బెస్పోక్ ఎఐ లాండ్రీ వెంటెడ్ కాంబో

గూర్‌గావ్ : సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ కొత్తగా తమ బెస్పోక్ ఎఐ లాండ్రీ ఉపకరణాల శ్రేణిలో లాండ్రీ వెంటెడ్ కాంబోను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఏడు అంగుళాల ఎఐ హోమ్ టచ్‌స్క్రీన్‌తో కూడిన ఈ మిశ్రమ యూనిట్ వాషింగ్, డ్రైయింగ్ మధ్య లాండ్రీని బదిలీ చేయవలసిన అవసరాన్ని తొలగిస్తుందని పేర్కొంది. ఇది రెండు ప్రీమియం రంగులలో వస్తుందని పేర్కొంది. భారత్‌లో ప్రీ ఆర్డర్లను మాత్రమే తీసుకుంటున్నట్లు పేర్కొంది.

ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బి డిపాజిట్లలో 20 శాతం వృద్ధి

బెంగళూరు : ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ 2025 మార్చి 31తో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4) 19.7 శాతం వృద్ధితో రూ.37,617 కోట్ల డిపాజిట్లను సాధించినట్లు ప్రకటించింది. ఇదే సమయంలో రుణాల జారీలో 11.6 శాతం పెరుగుదలతో రూ.7,455 కోట్లను నమోదు చేసినట్లు పేర్కొంది. గడిచిన ఆర్థిక సంవత్సరం ముగింపు త్రైమాసికంలో అత్యంత బలమైన ఫలితాలను సాధించినట్లు ఆ బ్యాంక్ పేర్కొంది.

28న నథింగ్ సిఎంఎఫ్ ఫోన్ ప్రో విడుదల

న్యూఢిల్లీ : లండన్ కేంద్రంగా పని చేస్తోన్న టెక్ కంపెనీ నథింగ్ తన సిఎంఎఫ్ సిరీస్‌లో ఏప్రిల్ 28న తన సిఎంఎఫ్ ఫోన్ 2 ప్రోను విడుదల చేస్తోన్నట్లు ప్రకటించింది. 2023లో ఆవిష్కరించిన తన సబ్‌బ్రాండ్ సిఎంఎఫ్ కింద దీన్ని తెస్తోంది. దీంతో పోటో సిఎంఎఫ్ కొత్త ఆడియో ఉత్పత్తులను కూడా పరిచయం చేయనున్నట్లు వెల్లడించింది.

కాషాయ పార్టీకి విరాళాల వెల్లువ

2023-24లో రూ.2,243 కోట్ల విరాళాలు • జాతీయ పార్టీల్లోనే అత్యధికం : ఏడీఆర్ నివేదిక



న్యూఢిల్లీ : 2023-24 ఆర్థిక సంవత్సరంలో అధికార పార్టీ బీజేపీకి విరాళాల వరద పారింది. కాషాయ పార్టీకి ఏకంగా రూ. 2,243 కోట్లకు పైగా విరాళాలు వచ్చాయి. కేవలం 8,358 విరాళాల ద్వారా ఈ భారీ మొత్తాన్ని బిజెపి ఆర్జించింది. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) ఈ మేరకు ఒక నివేదిక ప్రచురించింది. ఈ నివేదిక ప్రకారం మొత్తం జాతీయ పార్టీలకు వచ్చిన విరాళాల్లో 88 శాతం బీజేపీకే దక్కాయి. 20 వేల కంటే ఎక్కువ వచ్చిన విరాళాలపై ఎన్నికల సంఘానికి జాతీయ రాజకీయ పార్టీలు సమర్పించిన వివరాల ప్రకారం 2023-24 ఈ పార్టీలకు మొత్తం రూ. 12,547 కోట్లు విరాళాలుగా వచ్చాయి. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఈ విరాళాలు 199 శాతం ఎక్కువ. రూ. 281.48 కోట్లతో కాంగ్రెస్ రెండోస్థానంలో నిలిచింది. పేరుకు రెండోస్థానంలో ఉన్నా బీజేపీకి కంటే చాలా దూరంలో హస్తంపార్టీ ఉంది. మిగిలిన జాతీయ పార్టీలు , ఆప్, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీఈపీ) తమకు తక్కువ మొత్తంలో విరాళాలు వచ్చినట్లు ఈసీకి నివేదించాయి. మరో జాతీయ పార్టీ బీఎస్పీ ఈసారి కూడా తమకు ఎలాంటి విరాళాలు రాలేదని తెలిపింది. గత 18 ఏండ్ల నుంచి బీఎస్పీ ఇదే విషయాన్ని పేర్కొంటూ వస్తోంది.

2022-23 ఆర్థిక సంవత్సరంలో బీజేపీకి రూ.719.858 కోట్ల విరాళాలు రాగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,243.94 కోట్లకు పెరిగాయి. అంటే 211.72 శాతం పెరిగాయి. కాంగ్రెస్‌కు 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.79.924 కోట్ల విరాళాలు రాగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.281.48 కోట్లకు పెరిగాయి. కాంగ్రెస్‌కు 252.18 శాతం విరాళాలు పెరిగాయని ఏడీఆర్ నివేదిక పేర్కొంది. అయితే ఇదే కాలంలో, ఆప్‌నకు విరాళాలు 70.18 శాతం లేదా 426.038 కోట్లు తగ్గాయి. ఎన్‌పీఈపీ కూడా విరాళాలు 98.02 శాతం లేదా రూ. 7.331 కోట్లు తగ్గాయి. విరాళాల వివరాల సమర్పణకు సెప్టెంబర్ 30, 2024 వరకూ ఇసి గడువు ఇచ్చింది. ఈ గడువు లోగా ఆప్, బీఎస్పీ మాత్రమే తమ నివేదికలను సకాలంలో సమర్పించాయి. బీజేపీ 42 రోజుల ఆలస్యంతో తన నివేదికను సమర్పించింది.

అలాగే, 2023-24 ఆర్థిక సంవత్సరంలో జాతీయ పార్టీలకు కార్పొరేట్/వ్యాపార రంగాల నుంచి 3,755 విరాళాలు ద్వారా. రూ. 2,262.55 కోట్లు (మొత్తం విరాళాలలో 88.92 శాతం) రాగా, 8,493 మంది వ్యక్తిగత దాతలు రూ. 270.872 కోట్లు (మొత్తం విరాళాలలో 10.64 శాతం) విరాళంగా ఇచ్చారని నివేదిక పేర్కొంది. కార్పొరేట్/వ్యాపార రంగాల నుంచి వచ్చిన విరాళాల్లో 3,478 విరాళాలు (రూ.2,064.58 కోట్లు) బీజేపీకే వచ్చాయని ఏడీఆర్ నివేదిక పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 4,628 మంది వ్యక్తిగత దాతల ద్వారా బీజేపీకి రూ. 169.126 కోట్లు అందాయి. ఇక, 2023-24 ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీకి కార్పొరేట్/వ్యాపార రంగాల నుంచి 102 విరాళాల ద్వారా మొత్తం రూ. 190.3263 కోట్లు, 1,882 మంది వ్యక్తిగత దాతల ద్వారా రూ.90.899 కోట్లు వచ్చాయని నివేదిక వెల్లడించింది. ఏదేమైనా, 2023-24లో మిగిలిన అన్ని ఇతర జాతీయ పార్టీలు ప్రకటించిన మొత్తం కార్పొరేట్ విరాళాల కంటే (రూ.197.97 కోట్లు) తొమ్మిది రెట్లు ఎక్కువగా రూ. 2064.58 కోట్లు బీజేపీకి వచ్చాయి.

విరాళాలు ఇచ్చిన సంస్థల్లో ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ బీజేపీ, కాంగ్రెస్‌లకు కలిపి మొత్తం రూ.880 కోట్లు విరాళంగా ఇచ్చింది. ఎక్కువ విరాళాలు ఇచ్చిన సంస్థల్లో అగ్రస్థానంలో నిలిచింది. ఈ ట్రస్ట్ బీజేపీకి రూ. 723.675 కోట్లు (బీజేపీ అందుకున్న మొత్తం నిధులలో 32.25 శాతం), కాంగ్రెస్‌కు రూ. 156.4025 కోట్లు (కాంగ్రెస్ అందుకున్న మొత్తం నిధులలో 55.56 శాతం) విరాళంగా ఇచ్చింది. అలాగే, ట్రయంఫ్ ఎలక్టోరల్ ట్రస్ట్ బీజేపీకి నాలుగు విరాళాల ద్వారా రూ. 127.50 కోట్లు విరాళంగా ఇచ్చింది. డెరైవ్ ఇన్వెస్ట్‌మెంట్స్ బీజేపీకి రూ. 50 కోట్లు, కాంగ్రెస్‌కు రూ. 3.20 కోట్లు విరాళంగా ఇచ్చింది.

2023-24 ఆర్థిక సంవత్సరంలో బీజేపీకి, ఆక్మే సోలార్ ఎనర్జీ ప్రయివేట్ లిమిటెడ్ ఐదు విరాళాల ద్వారా రూ. 51 కోట్లు, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఒకే విరాళం ద్వారా రూ. 50 కోట్లు, రుంగ్తా సన్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఒకే విరాళం ద్వారా రూ. 50 కోట్లు, దినేష్ చంద్ర ఆర్ అగర్వాల్ ఇన్ఫ్రాకాన్ ప్రయివేట్ లిమిటెడ్ ఒకే విరాళం ద్వారా రూ. 30 కోట్లు విరాళంగా ఇచ్చాయి. కాగా, ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ తన నివేదిక ద్వారా బిజెపికి రూ. 723.78 కోట్ల విలువైన 31 విరాళాలను అందించినట్టు ప్రకటించిందని ఏడీఆర్ పేర్కొంది. ఈసీకి బీజేపీ ఇచ్చిన నివేదికలో రూ. 723.675 కోట్ల విలువైన 30 విరాళాలను అందుకున్నట్టు ప్రకటించింది. అలాగే, జయభారత్ ఎలక్టోరల్ ట్రస్ట్ తన నివేదిక ప్రకారం బీజేపీకి రూ. 5 కోట్లు విరాళంగా ఇచ్చింది.

అయితే, బీజేపీ తన నివేదికలో దీని గురించి ప్రస్తావించలేదని ఏడీఆర్ తెలిపింది. అలాగే, ఏడీఆర్ తన నివేదికలో రూ. 20,000 కంటే ఎక్కువ విరాళాలకు సంబంధించిన అసంపూర్ణ నివేదికలను తిరస్కరించాలని, పాన్ వివరాలు తప్పనిసరి చేయడం వంటి నిబంధనలు అమలు చేయాలని సిఫారసు చేసింది. అదేవిధంగా, పార్టీ విరాళాల నివేదికలను కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ప్రతీఏడాది పరిశీలించాలని, సమాచార హక్కు చట్టం కింద దాతల వివరాలను బహిరంగంగా అందుబాటులో ఉంచాలని కూడా సూచించింది. అలాగే, నిబంధనలు పాటించడంలో విఫలమైన పార్టీలపై తీసుకున్న చర్యలపై సమాచారాన్ని బహిరంగ పర్చాలని ఎన్నికల సంఘాన్ని కోరింది. ఇందుకోసం ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను రూపొందించాలని ఈసీకి ఏడీఆర్ విజ్ఞప్తి చేసింది.

ఒక వ్యవస్థ వుందిగా.. దాన్నే అనుసరిస్తాం

వక్ఫ్ అభ్యర్థనల పరిశీలనపై చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా



న్యూఢిల్లీ : వక్ఫ్ (సవరణ) చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తున్న పిటిషన్లను త్వరలోనే విచారిస్తామని ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా సోమవారం చెప్పారు. కేసులను అత్యవసరంగా విచారించాలని కోరుతూ పంపే రాతపూర్వక అభ్యర్థనలు లేదా ఇ మెయిల్స్ వంటి వాటిని పరిశీలించేందుకు ఒక పద్ధతి వుందని, దాన్ని కోర్టు అనుసరిస్తుందని జస్టిస్ ఖన్నా చెప్పారు. ప్రధాన న్యాయమూర్తి మొత్తంగా పరిస్థితులను సమీక్షించి, ఆయా కేసులను బెంచ్‌లకు అప్పగిస్తారన్నారు.

ఇవన్నీ చూసేందుకు ఇప్పటికే ఒక వ్యవస్థ అమల్లో వుండగా, మీరెందుకు ప్రస్తావిస్తున్నారని జస్టిస్ ఖన్నా పిటిషనర్ల తరపు న్యాయవాది కపిల్ సిబల్‌ను ప్రశ్నించారు. ఈ పిటిషన్లను సత్వరమే విచారించాల్సిన అవసరం వుందని సమస్తా కేరళ జమైతుల్ ఉలేమా తరపు న్యాయవాదులు ఎ.ఎం.సింఘ్వి, జుల్ఫీకర్ అలీ, ఎఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఔవైసి తరపు న్యాయవాది నిజామ్ పాషాలు కూడా కోరారు. వక్ఫ్ ఆస్తులపై, వాటి నిర్వహణపై ఈ చట్టం ఏకపక్షంగా ఆంక్షలు విధిస్తోందని పిటిషనర్లు పేర్కొంటున్నారు. దీనివల్ల ముస్లింల మత స్వయంప్రతిపత్తికి విఘాతం కలుగుతోందన్నారు. రాజ్యాంగంలోని మౌలిక అంశమైన సమానత్వపు హక్కును ఇది ఉల్లంఘిస్తోందన్నారు.

సుప్రీంకు ఐయుఎంఎల్

1995 నాటి వక్ఫ్ చట్టాన్ని సవరిస్తూ కొత్తగా తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ సోమవారం ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) సుప్రీం కోర్టును ఆశ్రయించింది. మతపరమైన, దాతృత్వ కార్యకలాపాల కోసం అల్లాకు శాశ్వతంగా అంకితమైన వక్ఫ్ ఆస్తుల పాలన, ఏర్పాటు, రక్షణ వంటి అంశాలను కొత్తగా తీసుకువచ్చిన సవరణలు ప్రాథమికంగా మార్చివేస్తున్నాయని ఐయుఎంఎల్ తన పిటిషన్‌లో పేర్కొంది. రాజ్యాంగంలోని 14, 15, 25, 26 అధికరణలను ఉల్లంఘిస్తున్నాయని ఆ పిటిషన్ పేర్కొంది. ఐయుఎంఎల్ అధ్యక్షుడు కె.ఎం.కదర్ మొహియుద్దీన్ ఆదివారం మాట్లాడుతూ, వక్ఫ్ చట్టాన్ని కాపాడేందుకు తమ పార్టీ చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

అత్యవసర జాబితా కోసం వక్ఫ్ చట్టంపై పిటిషన్లు

న్యూఢిల్లీ : వక్ఫ్ సవరణ చట్టం, 2025ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లు అత్యవసర జాబితా కోసం సోమవారం సుప్రీంకోర్టు ఎదుట ప్రస్తావనకు వచ్చాయి. ఈ పిటిషన్‌లపై మౌఖిక ప్రస్తావనను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం తిరస్కరించింది. ఈ మెయిల్ ద్వారా అత్యవసర జాబితా కోరే అవకాశం ఉన్నప్పుడు మౌఖిక ప్రస్తావన ఎందుకు అని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. సంబంధిత లేఖను ఈ మెయిల్‌లో పంపాలని ఆదేశించింది. అయితే లేఖను ఇప్పటికే ఈమెయిల్ పంపామని సిబల్ పేర్కొన్నారు. దీంతో మధ్యాహ్నం పరిశీలించిన తర్వాత అవసరమైన చర్యలు చేపడతామని సిజెఐ తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులు వలు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. ఈ చట్టం ముస్లిం కమ్యూనిటీ పట్ల వివక్ష చూపుతోందని, వారి ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తోందని వాదించాయి.

జూన్ 3న దక్షిణ కొరియా అధ్యక్ష ఎన్నికలు



సియోల్ : దక్షిణ కొరియా అధ్యక్ష ఎన్నికల తేదీని జూన్ 3న మంత్రివర్గం ఖరారు చేయవచ్చని భావిస్తున్నారు. దేశంలో సైనిక పాలన విధించారన్న కారణంపై రాజ్యాంగ కోర్టు గత వారంలో అధ్యక్ష పదవి నుండి యూన్ సుక్ యోల్‌ను తొలగించింది.

అధ్యక్ష ఎన్నికల రోజును శలవు దినంగా ప్రకటించాల్సి వున్నందున చట్టపరంగా అవసరసం లేనప్పటికీ మంగళవారం దీనిపై కేబినెట్ నిర్ణయం తీసుకోనుందని సంబంధిత ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. కొత్త అధ్యక్షుడిని 60రోజుల్లోగా ఎన్నుకోవాల్సి వుంది. తాత్కాలిక అధ్యక్షుడు, ప్రధాని హన్ డక్ సూ ప్రకటించేవరకు మీడియా వార్తల్లో వస్తున్న తేదీ ఖరారు కాదని జాతీయ ఎన్నికల కమిషన్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

జమ్ముకాశ్మీర్ అసెంబ్లీలో గందరగోళం..

వక్ఫ్ చట్టం కాపీలను చింపేసిన ఎన్‌సి ఎమ్మెల్యేలు



జమ్ము : వక్ఫ్ సవరణ బిల్లుపై జమ్ముకాశ్మీర్ అసెంబ్లీలో సోమవారం గందరగోళం నెలకొంది. ఈ బిల్లు అమలును వ్యతిరేకిస్తూ నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి)తో పాటు ప్రతిపక్షాల సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ బిల్లుపై తమ వాయిదా తీర్మానాన్ని స్పీకర్ అబ్దుల్ రహీం రాథర్ తిరస్కరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ప్రారంభం కాగానే.. వక్ఫ్ చట్టంలో ఇటీవల చేసిన సవరణలు, వాటి పర్యవసానాలపై చర్చ చేపట్టాలని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఎన్‌సి ఎమ్మెల్యే తన్వీర్ సాధిక్ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అయితే సుప్రీంకోర్టులో ఉన్నందున, సబ్‌జ్యుడీస్ (విచారణ)లో ఉన్నందున, ఆ కాపీ తన వద్ద కూడా ఉన్నందున ఈ అంశాన్ని వాయిదా తీర్మానం కింద చర్చించలేమని స్పీకర్ తిరస్కరించారు. దీంతో వెల్‌లోకి దూసుకువెళ్లేందుకు యత్నించిన సభ్యులను మార్షల్స్ అడ్డుకున్నారు. వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కొందరు ఎన్‌సి ఎమ్మెల్యేలు వక్ఫ్ చట్టం కాపీలను చింపివేశారు.

ఇది రాజ్యాంగ, ప్రజాస్వామ్య, చట్ట నిబంధనల ఉల్లంఘన అని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇర్ఫాన్ హఫీజ్ లోన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ విశ్వాసాలను పరిగణనలోకి తీసుకోలేదని, తమ అభిప్రాయాలను గౌరవించాల్సి వుందని అన్నారు. స్పీకర్ చట్టపాలన, సమాఖ్యవాదం, లౌకిక వాదాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రతిపక్ష పిడిపి సభ్యులు సైతం నిరసనలో పాల్గొన్నారు. ఆర్టికల్ 370, సిఎఎ సబ్‌జ్యుడీస్‌లో ఉన్నప్పుడు కూడా తీర్మానం ప్రవేశపెట్టామని పిడిపి నేత వహీద్ పారా పేర్కొన్నారు. పలు రాష్ట్రాలు తీర్మాలను ప్రవేశపెట్టాయని, వక్ఫ్ బిల్లుకి వ్యతిరేకంగా తమ నిరసనలను తెలియజేయాలనుకుంటున్నామని, అయితే స్పీకర్ తిరస్కరించారని మండిపడ్డారు. ఎన్‌సి ఫిక్స్‌డ్ మ్యాచ్ ఆడుతోందని దుయ్యబట్టారు. ఈ బిల్లుని వ్యతిరేకించకపోవడం ద్వారా జమ్ముకాశ్మీర్ ప్రభుత్వం కాశ్మీర్, ముస్లింల సమస్యలపై రాజీపడుతోందని స్పష్టమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గుజరాత్‌కు రెడ్ అలర్ట్ : ఐఎండి



న్యూఢిల్లీ : గుజరాత్‌లో ఎండలు మండిపోతున్నాయి. దీంతో సోమవారం భారత వాతావరణ శాఖ (ఐఎండి) రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. ఆదివారం గుజరాత్‌లో సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాల్లో 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆ రాష్ట్రానికి ఐఎండి రెడ్ అలర్ట్ ప్రకటించింది.

ఇక దేశ రాజధాని ఢిల్లీలో రాబోయే రెండు రోజుల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది. దీంతో ఢిల్లీకి నేడు ఐఎండి ఎల్లో అలర్ట్ ప్రకటించింది.కాగా, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, చండీగఢ్, పంజాబ్, ఢిల్లీ పశ్చిమ ఉత్తరప్రదేశ్, మధ్యపపదేశ్, గుజరాత్, గోవా రాష్ట్రాల్లో రాబోయే రెండు రోజులు ఏప్రిల్ 8-9 తేదీల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది. అలాగే ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా రాష్ట్రాల్లోని 21 నగరాల్లో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. ఈ రాష్ట్రాల్లోనే కాకుండా.. బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో హీట్‌వేవ్ కొనసాగుతుంది. రాజస్థాన్‌లో కూడా ఎండలు మండుతున్నాయి. దీంతో ఏప్రిల్ 9-10 తేదీల్లో ఐఎండి ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి కేరళ హైకోర్టుకు బదిలీ

న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారిని కేరళ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం ఏప్రిల్ 3న నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు కొలీజియం 2025 మార్చి 20, మార్చి 24 , ఏప్రిల్ 3వ తేదీలలో జరిగిన సమావేశాలలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారిని కేరళ హైకోర్టుకు బదిలీ చేయాలని సిఫారసు చేసింది అని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



వివిప్యాట్ స్లిప్‌లను వందశాతం చేతులతో లెక్కించాలన్న పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీం

న్యూఢిల్లీ : ఎన్నికల సమయంలో ఎలక్ట్రానిక్ కౌంటింగ్‌తో పాటూ ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రెయిల్ (వివిప్యాట్) స్లిప్‌లను వంద శాతమూ చేతితోనే లెక్కించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు సోమవారం తిరస్కరించింది. ఈ అంశంపై ఢిల్లీ హైకోర్టు గతేడాది ఆగస్టు 12న ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ హంస్‌రాజ్ జైన్ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ తోసిపుచ్చింది. ఢిల్లీ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి తమకు ఎలాంటి సహేతుకమైన కారణం కనిపించడం లేదని అందువల్లే ఈ స్పెషల్ లీవ్ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నామని చీఫ్ జస్టిస్ తెలిపారు. గతంలో ఇలాంటి అంశాలను లేవనెత్తుతూ తన నేతృత్వంలోని బెంచ్ తీర్పునిచ్చిందని, మళ్లీ మళ్లీ దీనిపై ఆందోళన చెందడం సరికాదని అన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎం)ను వివిప్యాట్ స్లిప్‌లతో వంద శాతమూ సరిపోల్చాలంటూ గతంలో దాఖలైన పిటిషన్లను తోసిపుచ్చుతూ సుప్రీంకోర్టు, ఇవిఎంలు సురక్షితమైనవి, సులభమైనవి, భద్రమైనవి, ఓటరుకు సులువుగా వుండేవని పేర్కొంది. జైన్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు తీర్పులను ఉదహరిస్తూ గతేడాది ఆగస్టు 12న ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చింది.

ఐసీయూలో ఆరోగ్య వ్యవస్థ

మోడీ పాలనలో క్షీణ దశకు : ఖర్గే



న్యూఢిల్లీ : నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం. ఈ సందర్భంగా మోడీ హయాంలో ఆరోగ్య వ్యవస్థ క్షీణించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య వ్యవస్థను ఐసీయూకి పంపిందని, దీంతో పౌరులపై వైద్య ఖర్చుల భారం విపరీతంగా పెరిగిపోతుందని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వీడియోను పోస్టు చేశారు. 'గత ఐదేండ్లలో వైద్య ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోయింది. ప్రతి సంవత్సరం 14 శాతం దేశ వైద్య ద్రవ్యోల్బణం పెరిగి భయంకరమైన స్థాయికి చేరింది. ఈ ఏప్రిల్ నాటికి 900 నిత్యావసర మందుల ధరల పెరిగాయి. ఖరీదైన వైద్యం వల్ల ప్రతి సంవత్సరం 10 కోట్ల మంది భారతీయులు పేదరికంలో కూరుకుపోతున్నారని నిటి అయోగ్ నివేదిక చెబుతోంది. మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్‌పై 12 శాతం జీఎస్టీ, బ్యాండేజీలు, సర్జికల్ వస్తువులపై 12 శాతం జీఎస్టీ, హాస్పిటల్ వీల్‌ఛైర్స్‌పై 18 శాతం జీఎస్టీ, ఆస్పతుల్లో శానిటరీ నాప్‌కిన్‌లపై 18 శాతం జీఎస్టీ, గుండె చికిత్సలకు 18 శాతం కేంద్రం జీఎస్టీ విధిస్తోంది. దీంతో ఆస్పత్రి ఖర్చులు ఈ సంవత్సరంలో 11.3 శాతం పెరిగాయి. యాంజియోప్లాస్టీ ఖర్చు రెట్టింపు యింది. ఇక కిడ్నీ మార్పిడి ఖర్చు మూడురెట్లు పెరిగింది.

మోడీ ప్రభుత్వం ఆరోగ్య వస్తువులపై పన్నులు విధించడంతో వైద్య ఖర్చులు విపరీతంగా పెరిగిపోయి సాధారణ ప్రజలపై పెనుభారమవుతుంది.' అని ఖర్గే వీడియో పోస్టులో మోడీ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. జాతీయ ఆరోగ్య విధానం 2017 ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం జీఎస్టీలో 2.5 శాతం మేర ఆరోగ్యంపై ఖర్చు చేసింది. అయితే ఇప్పుడు మోడీ ప్రభుత్వం 1.84 శాతం మాత్రమే ఖర్చు చేసిందని ఖర్గే విమర్శించారు. కేంద్ర బడ్జెట్ మొత్తం వ్యయంతో పోలిస్తే గత 5 సంవత్సరాలలో ఆరోగ్యం కోసం కేటాయించిన బడ్జెట్ 42 శాతం మేర తగ్గింది అని ఖర్గే ఆరోపించారు. మోడీ ప్రభుత్వం ఆరోగ్యం కోసం కేటాయించే బడ్జెట్‌లో కోతలు విధిస్తూ.. సాధారణ ప్రజలకు వైద్య ఖర్చుల్ని పెంచుతున్నారని ఖర్గే కామెంట్ చేశారు. మోడీ హయాంలో ఆరోగ్య వ్యవస్థ ఐసీయూకి చేరిందని ఆయన తీవ్రంగా విమర్శించారు.



లాలూ సన్నిహితుడి బెయిల్‌పై ఈడి పిటిషన్‌ను నిరాకరించిన సుప్రీం

న్యూఢిల్లీ : రైల్వే స్కామ్‌కి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూయాదవ్ సన్నిహితుడు, వ్యాపారవేత్త అమిత్‌కత్యాల్ బెయిల్‌ను సవాలు చేస్తూ ఈడి దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది.

ఢిల్లీ హైకోర్టు ఆదేశాలలో జోక్యం చేసుకోలేమని జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ రాజేష్ బిందాల్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. పెద్ద చేపలు లేవని, ప్రధాన నిందితులను ఇంకా అరెస్ట్ చేయలేదు. కానీ చిన్న ఈగ కోసం ఎందుకు వెతుకుతున్నారు. వాటిని చూసి భయపడుతున్నారా అని ఈడిని ప్రశ్నించింది. మరో 11 మంది నిందితులను ఎందుకు అరెస్ట్ చేయలేదని నిలదీసింది.

గతేడాది సెప్టెంబర్ 17న ఢిల్లీ హైకోర్టు కత్యాల్‌కు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మరే ఇతర నిందితుడిని అరెస్ట్ చేయనప్పటికీ, కత్యాల్ దర్యాప్తులో ఉన్నప్పటికీ, రాంచీకి బయలుదేరేముందు విమానాశ్రయం నుండి ఆయనను అనధికారికంగా ఈడి అదుపులోకి తీసుకుందని పేర్కొంది.

ప్రజల విశ్వాసంతోనే నేరాలను అదుపు చేయగలం

- అర్ధవార్షిక క్రైమ్ రివ్యూలో డీజీపీ జితేందర్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ప్రజల విశ్వాసాన్ని పొందిన నాడే నేరాలను పూర్తి స్థాయిలో అదుపు చేయగలమని డీజీపీ జితేందర్ చెప్పారు. నేరాల అదుపునకు ప్రజల సహకారం తప్పనిసరి అవసరమని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర అర్ధవార్షిక క్రైమ్ రివ్యూ సమావేశంలో సీనియర్ ఐపీఎస్ అధికారులనుద్దేశించి ఆయన మాట్లాడారు. నేర విచారణతో పాటు కోర్టుల్లో నిందితులపై అభియోగాలను రుజువు చేయడంలోనే దర్యాప్తు అధికారుల సమర్థత ఇమిడి ఉందన్నారు. ముఖ్యంగా సీటీపీఎస్ఎస్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నేర విచారణలో అనేక విజయాలను సాధించవచ్చునని తెలిపారు. దర్యాప్తు అంశంలో క్షేత్రస్థాయి అధికారులకు ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సరైన మార్గదర్శకాలను అందజేయాలని సూచించారు. రాష్ట్రంలో నేరాలు కొద్దిమేరకు తగ్గుముఖం పట్టినప్పటికీ సైబర్ నేరాల సంఖ్య పెరగడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. నేరస్తులకు కచ్చితంగా శిక్షలు పడేటట్టు చేసినప్పుడే ఇతర నేరస్తుల్లో సైతం భయాన్ని పాదుగొల్పగలమన్నారు. కీలకమైన నేర విచారణలో ఉన్నతాధికారులు సమన్వయంతో వ్యవహరించి ఫలితాలను సాధించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలను అదుపు చేయడంపై ప్రభుత్వం పోలీసు శాఖకు అనేక మౌలిక సదుపాయాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుతున్నదనీ, దానికి అనుగుణంగా ఫలితాలను సాధించాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉందని నొక్కిచెప్పారు. సీఐడీడీజీపీ శిఖాగోయెల్ మాట్లాడుతూ...గతేడాది చివరి ఆరు నెలలతో పోలిస్తే ఈ ఏడాది మొదటి అర్ధవార్షికంలో రాష్ట్రంలో 4.1 శాతం తగ్గాయని వివరించారు. అదే సమయంలో దర్యాప్తులోని కేసుల సంఖ్య 20.1 శాతం పెరిగిందని తెలిపారు. ఫోరెన్సిక్ సైన్స్ నిపుణులు కృపాకర్‌సింగ్ మాట్లాడుతూ..వివిధ కేసులకు సంబంధించిన పోస్టుమార్టం రిపోర్టుల్లో వెలుగు చూస్తున్న అంశాలపైన కూడా దర్యాప్తు అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించుకోవాలని సూచించారు. రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ...విజిబుల్ పోలీసింగ్ ద్వారా జరగబోయే నేరాలను చాలా వరకు నియంత్రించవచ్చునని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో సీపీలు, ఎస్పీలు, కూడా మాట్లాడుతూ.. నేర విచారణలో ఎదురవుతున్న సమస్యలను, తమ అనుభవాలను పంచుకున్నారు. సమీక్షా సమావేశంలో ఇంటిలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి, రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ మహేశ్‌భగవత్, టెక్నికల్ విభాగం అదనపు డీజీ వీవీ శ్రీనివాసరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్‌కు భారీగా దరఖాస్తులు

- ఇప్పటి వరకు 2.99 లక్షల మంది అప్లై
- ఇంజినీరింగ్‌కు 2.15 లక్షలు, అగ్రికల్చర్‌కు 83,916

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్)కు భారీగా దరఖాస్తులొస్తున్నాయి. ఇప్పటి వరకు 2,99,594 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి 2,15,436 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 83,916 మంది, రెండింటికీ 242 మంది కలిపి మొత్తం 2,99,594 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఆలస్య రుసుంతో ఈనెల 24 వరకు దరఖాస్తుల సమర్పణకు అవకాశమున్నది. ఈసెట్‌కు ఇప్పటి వరకు 15,516 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఈసెట్‌కు దరఖాస్తు గడువు ఈనెల 19 వరకు ఉన్నది. ఐసెట్‌కు 15,582 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఐసెట్ దరఖాస్తు గడువు మే 17 వరకు ఉన్నది. పీజీఈసెట్‌కు ఇప్పటి వరకు 3,979 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వచ్చేనెల 19 వరకు దరఖాసు చేసేందుకు గడువున్నది. ఎడ్‌సెట్‌కు 10,486 దరఖాస్తులొచ్చాయి. వచ్చేనెల 13 వరకు దరఖాస్తుల సమర్పణకు అవకాశమున్నది. లాసెట్‌కు 19,533 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. లాసెట్ దరఖాస్తుల సమర్పణకు ఈనెల 15 వరకు గడువున్నది. పీఈసెట్‌కు అత్యల్పంగా 635 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వచ్చేనెల 24 వరకు దరఖాస్తుల సమర్పణకు అవకాశమున్నది.

అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి.

- ఇందిరా పార్క్ వద్ద నేడు ఎమ్మెల్సీ కవిత దీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం దీక్ష చేపట్టనున్నారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించనున్న ఈ దీక్ష ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఇందిరా పార్క్ వద్ద ఏర్పాట్లను సోమవారం జాగృతి నాయకులు పరిశీలించారు. పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ చాలాకాలం నుంచి కవిత పోరాటం చేస్తున్న విషయం విదితమే. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను రెండు సార్లు కలిసి వినతి పత్రాలు కూడా అందించారు. అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో దీక్షకు పూనుకున్నారు.ఎమ్మెల్సీ కవిత దీక్షకు వేలాదిటా ప్రజలు, బీసీలు తరలిరావాలని జాగృతి నేతలు పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దుర్మరణం

- సిఎం చంద్రబాబు సంతాపం



పీలేరు : అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గ పరిధిలోని సంబేపల్లెలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పీలేరు హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రమ మృతి చెందారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. రమ మృతికి సంతాపం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.... అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో స్పెషల్ కో-ఆర్డినేటర్‌గా విధులకు హాజరయ్యేందుకు పీలేరు నుంచి రాయచోటికి కారులో తన ఇద్దరు సిబ్బందితో రమ సోమవారం బయలుదేరారు. మార్గమధ్యలోని సంబేపల్లె సమీపంలో ఎదురుగా వచ్చిన మరో కారు వీరి కారును ఢీకొంది. దీంతో, రమ అక్కడికక్కడే మృతి చెందారు. అటెండర్ నాయక్, కంప్యూటర్ ఆపరేటర్ ముబారక్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముబారక్ పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అనంతపురం జిల్లాకు చెందిన రమ గత ఏడాది ఫిబ్రవరి ఐదున పీలేరు హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాలయానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కర్నూలు నుంచి బదిలీపై వచ్చారు. ఎస్‌డిసి పీలేరు నియోజకవర్గం ఓటర్ నమోదు అధికారిగా కూడా ఆమె వ్యవహరిస్తున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పీలేరు తహశీల్దారు భీమేశ్వరరావు, హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాలయం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డు ప్రమాదంలో రమ మృతి చెందడం దురదృష్టకరమని ముఖ్యమంత్రి చంద్ర బాబు పేర్కొన్నారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి నివాళి

రాయచోటి ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో ఉంచిన రమ భౌతికకాయాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చామకూరి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రమాద వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇరువురిని కూడా వారు పరామర్శించారు. రమ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. రమా మృతికి అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బిసి జనార్థన్‌రెడ్డి ఒక ప్రకటనతో సంతాపం తెలిపారు ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలి

తాగు, సాగునీరు సమస్యలు పరిష్కరించాలి

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి



నవతెలంగాణ - మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'మెదక్ జిల్లాలో ఉన్న భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలి. అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలి. ఉపాధి హామీ కూలీలకు వేతన సమస్యలు పరిష్కరించాలి. జిల్లా వ్యాపంగా రోడ్ల నిర్మాణం చేపట్టాలి' అని ప్రజలెదుర్కొంటున్న స్థానిక సమస్యలపై సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కమిటీ ఆందోళన చేపట్టింది. సోమవారం పట్టణంలోని మర్రిచెట్టు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయం ఎదుట బైటాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అడిషనల్ కలెక్టర్ నగేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పని పద్మ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా పోడు భూములతో పాటు ఇతర ధరణీ సమస్యలున్నాయని, వీటి పరిష్కారానికి రెవెన్యూ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించడమే కాకుండా వేతనాల్ని రెగ్యులర్‌గా చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అర్హులైన పేదలకు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అజ్జమర్రి మల్లేశం మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసేందుకు నెల రోజులుగా పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్రజల దగ్గరకు వెళ్లి సర్వే నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో భూ సమస్యలు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్, ఉపాధి హామీ, సాగు, తాగు నీరు, పింఛన్లు, ఇతర స్థానిక సమస్యలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో జాప్యం వంటివి ఉన్నాయని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మౌలానా సాగర్ నుంచి సింగూర్ ప్రాజెక్టు వరకు నిర్మించే ప్రధాన కాలువ పనులు నిలిచిపోయాయన్నారు. సగం కాలువ తవ్వి వదిలేయడం వల్ల, దానికి ఆనుకొని ఉన్న గ్రామాలకు రవాణా సౌకర్యం దెబ్బతింటోందన్నారు. వాటిని పూర్తిచేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ ద్వారా అన్ని గ్రామాలకు సరిపడా తాగునీరు సరఫరా చేయకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ పట్టణం, నర్సాపూర్ కేంద్రంగా ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేద ప్రజలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఇంటి స్థలం లేని నిరుపేదలు ఇందిరమ్మ ఇండ్లు వెంటనే మంజూరు చేసి, నిర్మాణం చేసి ఇవ్వాలన్నారు. అలాగే, పోడు పట్టాలు ఇచ్చే భూములతో పాటు బీన్నీ తొలగించే భూములు ప్రభుత్వ భూమిగా గుర్తించి పట్టా సర్టిఫికెట్ ఇచ్చే భూములున్నాయని, వీటిని వెంటనే పరిష్కారం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోరెంకల మల్లేశం, బాలమణి, జిల్లా కమిటీ సభ్యులు గౌరి, సంతోష్, అజయ్, జిల్లాలోని వివిధ గ్రామాల భూ సమస్య, రోడ్డు సమస్య, ఇండ్ల సమస్యలు, ఉపాధి హామీ సమస్యల బాధితులు పాల్గొన్నారు.

భూమికి భూమి ఇప్పించండి

రేంజర్ భిక్షపతిని తప్పించండి.. : కలెక్టర్‌కు ముప్పారం రైతుల గోడు



హన్మకొండ కలెక్టర్‌ను కలిసి ఫారెస్ట్ రేంజర్ భిక్షపతిపై ఫిర్యాదు చేసిన ముప్పారం గ్రామస్తులు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఇనుపరాతి గట్లు అటవీ బ్లాకులో 60 ఏండ్లుగా సాగు చేసుకుంటున్న పట్టా భూములు న్యాయని, వీటిపై ఇప్పటికే సంయుక్త సర్వే చేశారని, రేంజర్ భిక్షపతి తమను ఆ భూముల్లో సాగు చేసుకోనివ్వడం లేదని, అతన్ని విధుల నుంచి తప్పించి, విచారణ చేసి శిక్షించాలని ముప్పారం గ్రామ రైతులు కోరారు. సోమవారం 'ప్రజావాణి' నేపథ్యంలో ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన రైతులు పెద్ద ఎత్తున హనుమకొండ కలెక్టరేట్‌కు తరలివచ్చి కలెక్టర్ పి. ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముప్పారం గ్రామ శివారు సర్వే నెంబర్లు 204, 842, 843, 844, 845, 846, 847, 47లోని వ్యవసాయ భూములకు తగిన నష్టపరిహారం ఇవ్వకుండా ఆక్రమించి రైతులను సేద్యం చేయకుండా అడ్డు కొని బెదిరించి అక్రమ కేసులు పెట్టిన ఎఫ్ఆర్ఓ భిక్షపతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 1987 నుంచి ఈ సర్వే నెంబర్ల నుంచి కొంత భూమిని అటవీ ప్రాంతంగా గుర్తించటానికి అధికారులు ప్రతిపాదనలు పంపారని తెలిపారు. తమ భూముల విలువ ఎకరానికి రూ.40- 50 లక్షలు ఉంటుందని, కొన్నేండ్లుగా ఈ భూములను తాము సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నా మని అన్నారు. ఇంతవరకు గెజిట్ నోటిఫికేషన్ రాలేదని చెప్పారు. ఫారెస్ట్ రేంజర్‌గా భిక్షపతి వచ్చాక భూములు ఆక్రమించి ట్రెంచ్‌లు కట్ చేసి తమను వ్యవసాయం చేయకుండా అడ్డుకోవడమే కాకుండా కేసులు పెట్టారని ఆరోపించారు. దుక్కి దున్నడానికి ట్రాక్టర్లు వస్తే వాటిని సీజ్ చేయించారని అన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకొచ్చాక, కలెక్టర్‌గా మీరు స్పందించి స్వయంగా భూములను పరిశీ లించి జాయింట్ సర్వే చేయించి ఇనుపరాతి గట్లు, పట్టా భూములకు మధ్య సరిహద్దులను ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు. ఈ విషయం రేంజర్ భిక్షపతికి చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చాక కూడా రేంజర్ భిక్షపతి ఆ ఉత్తర్వులను ఖాతర్ చేయకుండా రైతులు వ్యవసాయం చేయకుండా అడ్డుకున్నారని తెలిపారు. కలెక్టర్ ఉత్తర్వులతో సంబంధం లేదని, అధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేవంటూ తమను అడ్డుకుంటున్నారని అన్నారు. ఎలాంటి గెజిట్ నోటిఫికేషన్ లేకుండానే రేంజర్ భిక్షపతి దేవునూరు గ్రామ రైతులను బెదిరించి వారి నుంచి డబ్బులు తీసుకొని ఆక్రమణలో ఉన్న భూములు దున్నుకోవడానికి అనుమతిచ్చారని ఆరోపించారు. తమ పట్టా భూముల్లో వ్యవసాయం చేయాలంటే ఎకరానికి రూ.2లక్షలు ఇవ్వాలని, దేవునూరు గ్రామానికి చెందిన మాజీ వాచర్ కమలాకర్ ద్వారా డిమాండ్ చేయించాడన్నారు. అయినా తాము డబ్బులు ఇవ్వలేదని చెప్పారు. అవినీతికి పాల్పడిన ఫారెస్ట్ రేంజర్ భిక్షపతిని విధుల నుంచి తప్పించి, అతని అవినీతిపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అటవికి కేటాయించిన పట్టా భూములకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, లేదంటే మండలంలో మరో ప్రాంతంలో భూమికి బదులుగా భూమిని కేటాయించాలని కోరారు. ఇదే విషయమైన హనుమకొండ జిల్లా అటవీ శాఖాధికారి లావణ్యను కలిసి ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.



ఏపీలో వక్ఫ్ ఆస్తులకు ఎసరు!

కార్పొరేట్లకు అప్పగించేందుకు రంగం సిద్ధం

పిపిపి పేరుతో లీజుకిచ్చేందుకు ప్రకటన

అమరావతి, : జాతీయ స్థాయిలో వక్ఫ్ చట్ట సవరణపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతుండడగా, రాష్ట్రంలో కూడా కొత్త వివాదం నెలకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోని వక్ఫ్ భూములను లీజు విధానంలో 'పెద్దలకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం విమర్శలకు తావిస్తోంది. ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఇఒఐ) పేరుతో వక్ఫ్ భూములను కార్పొరేట్లకు, ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేసింది. భూములు కావాల్సిన వారు వచ్చే నెల ఎనిమిద తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, ఎక్కడి భూములను ఇవ్వనున్నదనేది అత్యంత రహస్యంగా ఉంచడం అనేక సందేహాలకు తావిస్తోంది. పబ్లిక్, ప్రయివేటు భాగస్వామ్యంతో ఈ భూములను లీజుకు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రధానంగా కీలక వాణిజ్య అవసరాలకు, వ్యాపారాలకు ఈ భూములను అప్పగించనున్నారు. సోలార్ ఎనర్జీ పార్కులు, పారిశ్రామిక వెంచర్లు, వాణిజ్య సముదాయాలు, విద్యా సంస్థలు, వైద్య సంస్థలు వంటివి ఏర్పాటు చేసుకునేందుకు సుముఖంగా ఉన్న పారిశ్రామికవేత్తలు ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదనలతో ముందుకు రావాలని కోరింది.

ఎకరా నుంచి 200 ఎకరాల వరకు ఇలా లీజుకు ఇవ్వనున్నారు. రాష్ట్రంలో దాదాపు 60 వేల ఎకరాల వరకు వక్ఫ్ భూములు ఉన్నట్లు సమాచారం. ఇందులో ఇప్పటికే సగం వరకు భూములు అన్యాక్రాంతమయ్యాయి. వీటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ఇప్పటివరకు ఎటువంటి చర్యలూ లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. మిగిలి ఉన్న భూములను లీజుకు ఇవ్వాలని ప్రతిపాదించడం చర్చనీయాంశమైంది.

ఆదాయం కోసమా?

వక్ఫ్ భూములను బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టాలన్న ఆలోచన వెనుక భారీ ఆదాయ సముపార్జన లక్ష్యంగా ఉన్నట్లు సమాచారం. అనేక ప్రాంతాల్లో మార్కెట్ విలువ అధికంగా ఉన్న చోట ఈ భూములను లీజుకు ఇస్తే భారీగా ఆదాయం సమకూరుతుందని అధికారులు అంటున్నారు.

భూముల వివరాల్లో గోప్యత

ఏ భూములను ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ కింద ఇవ్వనున్నారన్న విషయం బయటకు పొక్కనివ్వకుండా రహస్యంగా ఉంచడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికే ఏ భూములను ఈ పద్ధతిలో కేటాయించాలన్న గుర్తింపు జిల్లాల వారీగా జరిగినట్టు సమాచారం. ఈ వివరాలను బయటకు ఇవ్వక పోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాధా రణంగా భూముల వివరాలను వెల్లడించి ఈ ప్రాంతంలో ఎవరైనా పెట్టుబడులు పెడతారా? అని ప్రకటన ఇవ్వడం పరిపాటి. ఎందుకంటే ఆ ప్రాంతంలో ఎక్కువమంది మొగ్గుచూపితే లీజు ధర కూడా పెరిగే అవకాశం ఉంటుంది. అటువంటి వివ రాలేవి బయటకు వెల్లడించకుండా ప్రకటన ఇవ్వడం పలు సందేహాలకు తావిస్తోంది. ఈ భూములను ఎలా లీజుకు ఇస్తారు? మార్గదర్శకాలు ఏమిటి? అనేవి బయటకు వస్తేనే వాస్తవాలు తెలుస్తాయి.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో పరీక్ష

- ప్రభుత్వ నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో రాతపరీక్షను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా జీవోనెంబర్ 21ని శుక్రవారం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇంజినీరింగ్, సాంకేతిక కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీటీ) ఆన్‌లైన్‌లో వంద మార్కులను రాతపరీక్షను నిర్వహిస్తామని తెలిపారు. దాన్ని 20 మార్కులుగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. గేట్ తరహాలో ఈ పరీక్ష ఉంటుందని వివరించారు. పీహెచ్‌డీ ఉండే అభ్యర్థులకు 10 మార్కులు వెయిటేజీగా కలుపుతామనీ, మిగిలిన పది మార్కుల కోసం పరీక్ష రాయాల్సి ఉంటుందని తెలిపారు. పీహెచ్‌డీ లేని అభ్యర్థులు 20 మార్కుల కోసం రాతపరీక్షను రాయాలని సూచించారు. మార్కుల వివరాలను అధికారికంగా వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక కోసం స్క్రూటినీ కమిటీని నియమిస్తామని వివరించారు. యూజీ, పీజీలో మార్కుల శాతాన్ని బట్టి 20 మార్కులు, యూజీసీ/సీఎస్ఐఆర్-జేఆర్ఎఫ్ ఉంటే పది మార్కులు లేదా యూజీసీ-నెట్ (పీహెచ్‌డీ అడ్మిషన్ కాకుండా)/స్లెట్/సెట్ ఉంటే ఐదు మార్కులు, పీహెచ్‌డీ (యూజీసీ నిబంధనల ప్రకారం) ఉంటే పది మార్కులు, ఎంఫిల్ ఉంటే ఐదు మార్కులుంటాయని తెలిపారు. పరిశోధన పత్రాలకు ఐదు మార్కులు, సెమినార్లు, కాన్ఫరెన్స్‌లు, సింపోజియం, జర్నల్స్‌కు ఐదు మార్కుల చొప్పున కేటాయిస్తామని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన రాతపరీక్ష ఆధారంగా 1:10 మంది అభ్యర్థులను ఎంపిక చేయాలని సూచించారు. బోధనా నైపుణ్యానికి 30 మార్కులుంటాయని వివరించారు. అందులో బోధనానుభవానికి పది మార్కులు, పుస్తకాలకు రచయితలుగా ఉంటే ఐదు మార్కులు, పీహెచ్‌డీ ఫెలోషిప్ పొందితే ఐదు మార్కులు, బోధనా నైపుణ్యంలో భాగంగా డెమో లెక్చర్‌కు పది మార్కుల చొప్పున కేటాయిస్తామని పేర్కొన్నారు. ఇందులో నుంచి 1:5 నిష్పత్తి చొప్పున అభ్యర్థులను ఇంటర్వ్యూల కోసం ఎంపిక చేయాలని తెలిపారు. చివరిగా ఇంటర్వ్యూకు 20 మార్కులుంటాయని పేర్కొన్నారు. వీటి ఆధారంగా ఇంజినీరింగ్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఉంటుందని వివరించారు.

వర్సిటీల వారీగా నోటిఫికేషన్లు : బాలకిష్టారెడ్డి

విశ్వవిద్యాలయాల వారీగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి చెప్పారు. సోమవారం తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల వివరాలను సేకరిస్తామని అన్నారు. రోస్టర్ పాయింట్లను రూపొందించాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయ్యేందుకు నెలరోజుల సమయం పట్టే అవకాశముందని చెప్పారు. ఆ తర్వాతే నోటిఫికేషన్లపై కసరత్తు ప్రారంభమవుతుందని అన్నారు. అయితే వర్సిటీల వారీగా నోటిఫికేషన్లు విడుదలైనా దరఖాస్తు నమూనా అందరికీ ఒకేలా ఉండేలా రూపొందిస్తామని వివరించారు.

రిస్కులో రెస్క్యూ ఆపరేషన్

భారీగా ఉబికి వస్తున్న నీరు

- సొరంగంలో ముందుకు సాగని సహాయక చర్యలు
- 24 గంటలు శ్రమిస్తున్న రెస్క్యూ టీం
- తమ వారికోసం పడిగాపులు కాస్తున్న కుటుంబ సభ్యులు

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి



ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదం జరిగి 45 రోజులు గడిచింది. నాటి నుంచి రెస్క్యూ టీం రిస్కుతో కూడిన సహాయక చర్యలను చేపడుతోంది. సొరంగంలో ఇరుక్కుపోయిన కార్మికులను వెలికి తీయడం అత్యంత ప్రమాదకరమని తెలిసినా.. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వహిస్తోంది. ఒకవైపు ఉబికి వస్తున్న నీరు, మరోవైపు మట్టి, విరిగిపోయిన టీబీఎం మిషన్‌తో సహాయక చర్యలు ముందుకు సాగడం లేదు. అయినా కార్మికులను వెలికి తీయడం కోసం రెస్క్యూ టీం సభ్యులు 24 గంటలు శ్రమిస్తున్నారు. తమ వారి కోసం వచ్చిన కుటుంబ సభ్యులు గుడారాల్లో పడిగాపులు కాస్తున్నారు. చివరి చూపు అయినా ఉంటుందో లేదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీశైలం సమీపంలో దోమలపెంట దగ్గర ఫిబ్రవరి 22న ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు చిక్కుకుపోయారు. సహాయక చర్యలో భాగంగా కొద్ది రోజులకు ఒక్కొక్కటిగా ఇంజినీర్లు గురుప్రీత్‌సింగ్, మనోజ్‌కుమార్ మృతదేహాలు లభించాయి. ఇంకా ఆరుగురు కార్మికుల ఆచూకీ తెలియలేదు. రెస్క్యూ టీంతోపాటు కడావర్ డాగ్స్, రోబోలు, హిటాచీలను ఉపయోగించి సొరంగంలో నిరంతరం కృషి చేస్తున్నారు. ఆర్మీ, నేవీ, మైనింగ్, హైడ్రాతో పాటు అంతర్జాతీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. రాళ్ల శిథిలాల తొలగింపు కష్టంగా మారింది. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని లక్ష్యంగా చేసుకొని రెస్క్యూ టీం మట్టి తీయడం మొదలు పెట్టింది. 20 మీటర్ల మేర మట్టిని తొలగిస్తే.. కార్మికుల ఆచూకీ లభించే అవకాశాలున్నాయి. ముఖ్యంగా ఉబికి వస్తున్న నీరు, టీబీఎం మిషన్ విడి భాగాలు తునాతునకలై పనులకు అడ్డుగా మారాయి.

మొదట 13.50 మీటర్లు మట్టి కూరుకుపోయింది. అతికష్టం మీద టన్నెల్ చివరి 40 మీటర్ల వరకు వెళ్లగలిగారు. మిగతా 40 మీటర్లు వెళ్లడానికి వీలు లేకుండా ఉంది. టన్నెల్ పై భాగం నుంచి మట్టి కూలుతోంది. నిరంతరాయంగా నీరు వచ్చి చేరుతోంది. మోటార్ల ద్వారా నీరు పంపింగ్ చేస్తున్నారు. అయితే 5 నిమిషాలు నీటి పంపింగ్ చేయకపోతే ఎప్పటిలాగే ఆ ప్రాంతం కోనేరులా మారుతోంది. ఎంత మట్టి తీస్తున్నారో అంత మట్టి వచ్చి చేరుతోంది. టీబీఎం మిషన్‌ను బయటకు తీస్తే టన్నెల్ కూలే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. 44 రోజులుగా కృషి చేస్తున్నా కార్మికుల ఆచూకీ తెలియకపోవడంతో బాధిత కుటుంబాలు విలవిల్లాడుతున్నాయి.

కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

ఎనిమిది మంది కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి. రూ.25 లక్షల ప్యాకేజీతోపాటు వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలి. ముఖ్యంగా సొరంగంలో పనులను మంత్రులు పర్యవేక్షణ చేయాలి.

- వర్ధం పర్వతాలు,
సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి, నాగర్‌కర్నూల్

డోలీ మోతలు తప్పిస్తాం

గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి : 'అడవితల్లి బాట'లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

రూ.1005 కోట్లతో 1069 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



దుంబ్రిగుడ : డోలీ మోతలు తప్పిస్తామని, దీనిలో భాగంగా గిరిజన ప్రాంతాల్లోని మారుమూల గ్రామాలకు రోడ్లు నిర్మిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అల్లూరి జిల్లా దుంబ్రిగుడ మండలంలో సోమవారం ఆయన పర్యటించారు. తొలుత పెదపాడు పివిటిజి గ్రామాన్ని సందర్శించారు. థింసా నృత్యంతో గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను పవన్ పంపిణీ చేశారు. గ్రామస్తులతో ముఖాముఖి ద్వారా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాము పండించిన చిరుధాన్యాలను, అటవీ ఉత్పత్తులను స్టాల్స్‌గా గ్రామస్తులు పెట్టి వాటి గురించి పవన్‌కు వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను పవన్ సందర్శించారు. అడవితల్లి బాట కార్యక్రమం ద్వారా పిఎం జన్‌మన్, పిఎంజిఎస్‌వై, ఎంజిఎన్ఆర్ఇజిఎ, పిఆర్ఆర్, టిఎస్‌పి పథకాల కింద రూ.1005 కోట్లతో 1,069 కిలోమీటర్ల మేర ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ గిరిజన మారుమూల గ్రామాలకు రోడ్లు లేక ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారని, నేటికీ డోలీ మోతలే కనిపిస్తున్నాయని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యతనిచ్చామని తెలిపారు.